30 . 07. 2025

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper

బుధవారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 63 , పేజీలు : 12 వెల:రూ.5/-

SIMULANEOUSLY PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH



## సంక్షేమ ఫలితాలన్నీ ప్రజల సొమ్ముతోనే అమలు

- ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఆదిలాబాద్ వెలుతురు జూలై 29:** కేంద్ర ప్రభుత్వం గానీ, రాష్ట్ర ప్రభుత్వం గానీ అందించే ఏ సంక్షేమ పథకలైన ప్రజల కట్టే ట్యాక్స్ సొమ్ముతోనే అందించడం జరుగుతాయని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఎమ్మెల్యే అయినా, సీఎం అయినా,

## సిందూర్‌లో త్రివిధ దళాలు

# సత్తా చాటాయి



- కాల్పుల విరమణలో మూడో దేశం జోక్యం లేదు
- ట్రంప్ మధ్యవర్తిత్వ ప్రకటనను తోసిపుచ్చిన మోడీ
- ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రమూకలకు బుద్ధి చెప్పాం
- కేవలం 22 నిమిషాల్లో ఆపరేషన్ పూర్తి చేసిన త్రివిధ దళాలు
- ఆపరేషన్‌పై కాంగ్రెస్, విపక్షాల తీరు దారుణం
- సైన్యం స్థైర్యం దెబ్బతినేలా వ్యాఖ్యాలు
- హెడ్‌లైన్స్‌లో ఉండేలా చేస్తున్న వారికి ప్రజల్లో స్థానం లేదు
- ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో ప్రధాని మోడీ సమాధానం

**న్యూఢిల్లీ,జూలై29( వెలుతురు):** పాక్‌తో కాల్పుల విరమణలో అమెరికా పాత్రను లోక్‌సభ వేదికగా ప్రధాని మోడీ తోసిపుచ్చారు. ఇందులో మూడో వ్యక్తి ప్రమేయం లేదని తేల్చి చెప్పారు. ఇదే సందర్భంలో ప్రధాని మోదీ.. కాంగ్రెస్, విపక్షాల తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఉగ్రవాదులను మట్టిలో కలిపినందుకు భారత్ విజయోత్సవాలు చేసుకుంటోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడం, భారత సేనల శౌర్య, ప్రతాపాల ప్రదర్శన తర్వాత విజయోత్సవాలు చేసుకుంటున్నామన్నారు. 140 కోట్ల భారతీయుల ఐక్యత, ఇచ్ఛాశక్తి ఫలాలతో భారత్ విజయోత్సవాలు చేసుకుంటోందని తెలిపారు. 'ఆపరేషన్ సిందూర్'పై లోక్‌సభలో వాడీ వేడిగా జరిగిన చర్చకు సమాధానం గా ప్రధాని మోదీ ప్రసంగించారు. ఆపరేషన్ సిందూర్ ఆపాలని ప్రపంచంలో ఏ నేత కూడా మాకు చెప్పలేదు. మే 9న అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నాతో ఫోన్‌లో మాట్లాడారు. పాక్ భారీగా దాడి చేయబోతోందని ఆయన హెచ్చరించారు. పాక్ భారీ మూల్యం చెల్లించుకుంటుందని జేడీ వాన్స్‌కు చెప్పా. పాక్‌కు ఎవరు సాయం చేసినా.. చూస్తూ ఊరుకొనేది లేదని చెప్పాం. పాక్ ఎలాంటి దాడి చేసినా మేం చూసుకుంటామని వాన్స్‌కు చెప్పాం. బుల్లెట్‌కు బుల్లెట్‌తోనే సమాధానం చెప్తామని జేడీ వాన్స్‌కు చెప్పాం. పాక్‌కు ఎవరు సహాయం చేసినా.. చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టం చేశాం. పాక్‌కు చిరకాలం గుర్తుండి పోయే

## కాలుష్యరహిత హైదరాబాదే లక్ష్యం...

- పాతికేళ్ల అవసరాలకు తగినట్లు ప్రణాళికలు....
- మెట్రో పనులు వేగవంతం చేయాలి...
- నగరానికి ఐకానిక్ గా మూసీ అభివృద్ధి ఉండాలి...
- ఎంఏయూడీ సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ వెలుతురు జూలై 29:** హైదరాబాద్ నగరాన్ని పర్యావరణహితంగా మార్చాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. విపరీతమైన కాలుష్యంతో ఢిల్లీ, ముంబయి, చెన్నై వంటి నగరాల్లో ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని... అటువంటి పరిస్థితి హైదరాబాద్ నగరంలో తలెత్తకూడదన్నారు. కోర్ సిటీలో ఉన్న కాలుష్యకారక పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తరలించాలని సీఎం ఆదేశించారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మంగళవారం కమాండ్ కంట్రోల్ సెంటర్ లో సమీక్ష నిర్వహించారు.



## సైన్యం చేతులు కట్టేసి.. పాక్‌తో సయోధ్య

- ఉగ్రవాదులకు దీటుగా సమాధానం చెప్పడంలో విఫలం
- దమ్ముంటే ట్రంప్ వ్యాఖ్యలను ఖండించాలి
- ఆపరేషన్ సిందూర్ చర్చపై రాహుల్



## అఖిలపక్షంకన్నా ఎన్నికల ప్రచారమే ముఖ్యమా?

- ఉగ్రవాదులను ఏరివేసామని అబద్ధాలు ప్రచారం చేస్తారా
- అబద్దాల కార్ఖానాలు ఏర్పాటు చేసిన బిజెపి
- సిందూర్‌పై రాజ్యసభ చర్చలో ఖర్గే ఘాటు వ్యాఖ్యలు
- నడ్డా అభ్యంతరం.... విపక్షం డిమాండ్‌తో క్షమాపణలు



## ఆపరేషన్ సిందూర్‌పై సందేహాలా

- ఉగ్రమూకలను అణచివేస్తే సంతోషించరా
- మాజీ హోంమంత్రికి ఉగ్రవాదుల ఉనికిపై అనుమానాలా
- లోక్‌సభలో సిందూర్ అమిత్ షా ప్రసంగం
- చిందబరం వ్యాఖ్యలపై గట్టిగా కౌంటర్
- ముగ్గురు పహల్గాం ఉగ్రవాదులను మట్టుబెట్టామని వెల్లడి



**న్యూఢిల్లీ, జూలై29( వెలుతురు):** పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారణంగా ఆపరేషన్ సింధూర్ పేరుతో భారత్ చేపట్టిన ఆపరేషన్‌పై విపక్షాలు సంతోషం వ్యక్తం చేస్తాయనుకుంటే.. సందేహాలు వ్యక్తం చేస్తున్నాయంటూ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. లోక్‌సభలో రెండో రోజు మంగళవారం జరిగిన ప్రత్యేక చర్చలో అమిషా మాట్లాడారు. విపక్ష ఎంపీల వ్యాఖ్యలు దారుణంగా ఉన్నాయన్నారు. ఉగ్రవాదులను మట్టు-బెడితే ఆనందం వ్యక్తం చేస్తారనుకున్నానని.. కానీ విపక్ష సభ్యులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఎలాంటి ప్రశ్నలు

## రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులను ఆధునికరిస్తాం

ప్రాజెక్టుల్లో పేరుకున్న పూడికను తొలగిస్తాం

26 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్న సాగర్

మంత్రి అడ్లూరితో కలసి సాగర్ గేట్లు ఎత్తిన మంత్రి ఉత్తమ్



**నాగార్జునసాగర్, జూలై29(వెలుతురు):** రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులను ఆధునికరిస్తామని,అలాగే పూడిక తీస్తామని ,రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన రాష్ట్ర ఎస్సీ ,ఎస్టీ ,మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి, నల్గొండ జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి నాగార్జునసాగర్ క్రస్ట్ గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ చేతుల మీదుగా శంకుస్థాపన చేయబడిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఒక ఆధునిక దేవాలయం అని అన్నారు. నాగార్జున

## బిసి రిజర్వేషన్ల కోసం 72 గంటల నిరాహార దీక్ష

- ప్రభుత్వ అనుమతితో 4 నుంచి దీక్షకు దిగుతా
- లేదంటే ఎక్కడుంటే అక్కడే దీక్ష చేస్తా
- జాగృతి అధ్యక్షురాలు కవిత హెచ్చరిక




## యూరియాపై ప్రభుత్వం తప్పుడు లెక్కలు

- లెక్కకు మిక్కలిన యూరియా ఎక్కువుంది
- ప్రభుత్వం తక్షణమే జవాబు చెప్పాలి
- జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా సున్నా
- ఖమ్మం ఇక బిజెపి అడ్డా కాబోతోంది
- బిసి రిజర్వేషన్లపై కాంగ్రెస్ దొబూచులాట
- జిల్లా పర్యటనలో కార్యకర్తల సమావేశంలో బిజెపి అధ్యక్షుడు రామ్




**ఖమ్మం,జూలై29( వెలుతురు):** తెలంగాణ రాష్ట్రానికి కేందప్రభుత్వం అందజేస్తున్న యూరియా లెక్కలకు సంబంధించి రేవంత్ ప్రభుత్వం తప్పుడు లెక్కలు చెబుతోందని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచంద్రరావు ఆరోపించారు. తెలంగాణకు ఖరీఫ్ సీజన్‌కు ఇప్పటివరకు 6.14 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాని కేందప్రభుత్వం అందజేసిందని స్పష్టం చేశారు. ఇంకా ఎంత యూరియా కావాలంటే అంత ఇచ్చేందుకు మోదీ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పుకొచ్చారు. రబీ సీజన్‌లో

## ఎపిలో ఇక రేషన్ మరింత స్మార్ట్

క్యూఆర్ కోడ్‌తో చిన్ని సైజులో కార్డులు

ఆగస్టు 25 నుంచి 31 వరకు స్మార్ట్ కార్డులు పంపిణీ

రేషన్ పంపిణీలో ఇక మరింత పారదర్శకత

మీడియా సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి



ఏనుగుల సంచారంపై

## నిరంతర పర్యవేక్షణ

అటవీ అధికారులకు డిప్యూటీ సిఎం పవన్ ఆదేశం

వాట్సాప్ గ్రూపుల ద్వారా ప్రజలను అప్రమత్తం చేయాలని సూచన



## రాష్ట్రంలో అధ్వాన్న పరిస్థితులు

- పాలనకు పాతరేసిన కూటమి నేతలు
- కలెక్షన్ ఏజెంట్లుగా మారిన పోలీసులు
- రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో అరాచకం
- భయానక వాతావరణంతో అరెస్టులు

ముఖ్య నేతలను ఏదో కేసు పెట్టి అరెస్ట్ చేస్తున్నారు

వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుల భేటీలో జగన్ విమర్శలు

**అమరావతి,జూలై29( వెలుతురు):** రాష్ట్రంలో భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారని.. సీనియర్ నేతలను తప్పుడు కేసుల్లో ఇరికిస్తున్నారంటూ కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. ఇదే సంప్రదాయం కొనసాగితే... టీడీపీలో అందరూ జైలుకెళ్లాల్సిం దేనని ఆయన హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యులతో మంగళవారం ఆయన





## సింగపూర్ దేశాధ్యక్షుడు థర్మన్ షణ్ముగరత్నంతో భేటీ

- ఎపిలో పెట్టుబడి అవకాశాలను వివరించిన చంద్రబాబు

**సింగపూర్,జులై 29( వెలుతురు):** సింగపూర్ పర్యటనలో భాగంగా ఆ దేశాధ్యక్షుడు థర్మన్ షణ్ముగరత్నంతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం అయ్యారు. ఏపీలో సింగపూర్ పెట్టుబడులు, వ్యాపార అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి..)

## సైన్యం చేతులు కట్టేసి.. పాక్‌తో సయోధ్య

**న్యూఢిల్లీ,జూలై29( వెలుతురు):**
ఆపరేషన్ సిందూర్ సమయంలో మన సైనికుల చేతులు కట్టేశారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. సాయుధ దళాలకు మద్దతుగా నిలిచే విషయంలో ప్రభుత్వానికి రాజకీయ సంకల్పం కొరవడిందని విమర్శించారు. తాము యుద్ధం కోరుకోవడం లేదని పాకిస్థాన్‌కు భారత ప్రభుత్వమే తెలియజేసిందన్నారు. 'ఆపరేషన్ సిందూర్ 'పై చర్చ సందర్భంగా లోక్‌సభలో రాహుల్ ప్రసంగిస్తూ.. పహల్గాం ఉగ్రదాడిని పాకిస్థాన్ కుట్రపన్నిన క్రూరమైన ఘటనగా పేర్కొన్నారు. సాయుధ దళాలను ఉపయోగించాలనుకుంటే.. బలమైన రాజకీయ సంకల్పం ఉండాలి. వారికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలి. కానీ.. ఆపరేషన్ సిందూర్ విషయంలో మన సైనికుల చేతులు కట్టేశారు. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన సున్నితమైన వివరాలను దాయాదికి వెల్లడించారు. అర్ధరాత్రి 1.05 గంటలకు ఆపరేషన్ ప్రారంభమైందని.. 1.35కు పాకిస్థాన్‌కు ఫోన్ చేసి సైనికేతర లక్ష్యాలను ఛేదించామని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారన్నారు. ఉద్రిక్తతలు పెంచే ఆలోచన లేదని దాయాదితో చెప్పామన్నారు. అంటే.. పాక్‌తో యుద్ధం చేసే ఆలోచన లేదని ఆయన చెప్పకనే చెప్పారని రాహుల్ గాంధీ విమర్శించారు. పాక్ విజ్ఞప్తి మేరకు యుద్ధాన్ని ఆపామని ప్రభుత్వం చెబుతోంది. మరోవైపు.. భారత్-పాక్ యుద్ధాన్ని తానే ఆపానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటివరకు 29 సార్లు చెప్పుకొన్నారు. ఇందిరా గాంధీలా ధైర్యం ఉంటే.. ట్రంప్ 'అబద్ధాలకోరు' అని, భారత్ యుద్ధవిమానాలకు ఎటువంటి నష్టం వాటిల్లలేదని ప్రధాని మోదీ లోక్‌సభలో ప్రకటించాలని రాహుల్ డిమాండ్ చేశారు. 'ఆపరేషన్ సిందూర్'కు ముందు అన్ని పార్టీలు ఏకతాటిపై నిలిచాయని, తాను పహల్గాం దాడి బాధిత కుటుంబాలను పరామర్శించినట్లు- తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి అమానుషమని, ఈ దాడి అనంతరం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు ప్రతిపక్షాలు ముక్తకంఠంతో ప్రభుత్వానికి మద్దుతు తెలిపాయని, ఇందుకు తాము గర్విస్తున్నామని రాహుల్ గాంధీ అన్నారు.హహల్గాం ఉగ్రదాడిలో పర్యాటకులను అత్యంత కిరాతకంగా కాల్చి చంపారని రాహుల్ అన్నారు. ఉగ్రదాడిలో పిల్లలు, యువకులు, వృద్ధులు చనిపోయారని, భార్య కళ్ల ముందే భర్తను కాల్చి చంపేశారని ఆవేదన వ్యక్తం చేసారు. విపక్షాలుగా దేశ భద్రత విషయంలో తాము ప్రభుత్వానికి అండగా నిలిచామని, ఆపరేషన్ సిందూర్‌కు ముక్తకంఠంతో మద్దతు తెలిపామని చెప్పారు. ప

## సంక్షేమ ఫలితాలన్నీ ప్రజల సొమ్ముతోనే అమలు

ఎవరు తమ ఇళ్లల్లో నుండి ఇవ్వరని ఇది ప్రజలు గుర్తించాలని పేర్కొన్నారు. జైనథ్ మండలంలో మంగళవారం జైనథ్, బేల, సాత్నాల, బోరజ్ మండలాల లబ్ధిదారులకు ఆహార భద్రత కార్డు పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా తో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్హులైన వారికి ఆహార భద్రత కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వాలు అందించే పథకాలు ఏ ఒక్క పార్టీకి సంబంధించింది కాదని తాను బీజేపీ ఎమ్మెల్యే అయినంత మాత్రాన కేవలం బీజేపీ వాళ్ళకే ఎమ్మెల్యే కాదని, నియోజకవర్గ ప్రజలందరికీ ఎమ్మెల్యే అని అన్నారు. ఏ పార్టీ గెలిచిన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ ప్రభుత్వం ప్రజలందరిది అని పేర్కొన్నారు. ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగమైన, ప్రభుత్వ పథకాలు దుర్వినియోగమైన అది ప్రజల సొమ్ము దుర్వినియోగమే అని భావించాలని సూచించారు. గతంలో తెల్ల రేషన్ కార్డు ఉంటేనే పేదవారీగా గుర్తించి, అన్ని పథకాలు అందుతాయనే భావన ఉండేదని, కానీ ప్రస్తుతం కేవలం తెల్ల రేషన్ కార్డు మాత్రమే ప్రామాణికం కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నరసయ్య, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీఓ స్రవంతి, సివిల్ సప్లయ్ అధికారి వాజిద్, మండలాల ఎమ్మార్వో తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులను ఆధునికరిస్తాం

సాగర్ మనకు ఆధునిక దేవాలయం అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సాగర్ నుంచి గేట్లు ఎత్తడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. 18 ఏళ్ల తర్వాత జులైలోనే నాగార్జున సాగర్ జలాశయం నిండిందని తెలియజేశారు. సాగర్ కు దివంగత ప్రధాని నెహ్రూ గాంధీ పునాది వేస్తే దివంగత ప్రధాని ఇందిరాగాంధీ ప్రారంభించారని, 26 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించిన గొప్ప ప్రాజెక్టు ఇది అని కొనియాడారు. సాగర్ కాలువల ద్వారా రెండు రాష్ట్రాల్లోని ప్రతీ ఎకరాకు నీరు చేరిందని, మన రాష్ట్రంలో రికార్డు స్థాయిలో వరి పండిందని ఉత్తమ్ కుమార్ పేర్కొన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోని 22 లక్షల ఎకరాలకు సాగునీరుతుందని చెప్పారు .జవహర్ కుడి కాలువ ద్వారా 11.74 లక్షల ఎకరాలు, లాల్ బహదూర్ ఎడమ కాలువ ద్వారా 10.38 లక్షల ఎకరాలకు నీరు అందిస్తున్నట్లు- వెల్లడించారు. తెలంగాణలో మొత్తం 6 లక్షల 50వేల ఎకరాలకు సాగు నీరు అందుతుండగా, నల్గొండ జిల్లాలో 1,50,000 ఎకరాలు, సూర్యాపేట జిల్లాలో రెండు లక్షల 30 వేల ఎకరాలు ,ఖమ్మం జిల్లాలో రెండున్నర లక్ష ఎకరాలకు ఆయకట్టుకు నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా సాగునీరందుతున్నదని తెలిపారు. 2005 సంవత్సరంలో నాగార్జున సాగర్ ప్రాజెక్టు స్వర్ణోత్సవాలు. నిర్వహించడం జరిగిందని చెప్పారు.తను ఆరుసార్లు శాసనసభ్యుడిగా,ఒకసారి పార్లమెంటు సభ్యునిగా ఉంటూ ఇప్పుడు ఇరిగేషన్ ప్రాజెక్టు మంత్రిగా నాగార్జున సాగర్ ద్వారా నీటిని వదలడం సంతోషంగా ఉందన్నారు.తెలంగాణ రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పాటు- అయిన తర్వాత గత వానాకాలం,యాసంగి , వానాకాలం కలిసి రెండు లక్షల 81 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని. పండించడం జరిగిందని, ఇందులో నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ పాత్ర ముఖ్యమని అన్నారు. సాగునీటితో పాటు- నాగార్జునసాగర్ పవర్ ప్రాజెక్ట్ ద్వారా గడచిన 4 రోజులుగా 30000 క్యూసెక్కుల నీటిని తో పూర్తిస్థాయిలో,700 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేశామన్నారు. నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి ,మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, రాష్ట్ర పౌరసరఫరాల ప్రిన్సిపల్ సెక్రెటరీ డిఎస్ చౌహాన్,జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్ర పవర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, జిల్లా ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ అజయ్ కుమార్, నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎస్ ఈ మల్లికార్జునరావు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు. కాగా నాగార్జున సాగర్ ప్రాజక్ట్ ద్వారా మంత్రులు 6 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువ కు వదిలిన తర్వాత అధికారులు 14 గేట్ల ద్వారా 10932 క్యూసెక్కుల నీరు వదిలారు.మంగళవారం సాయంత్రం వరకు 20 గేట్ల ద్వారా 2 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతానికి వదలనున్నట్లు- ప్రాజక్ట్ అధికారులు తెలిపారు. అనంతరం మంత్రులు,అధికారులు నాగార్జున సాగర్ ఎడమ కాలువ ను సందర్శించి కృష్ణ జలాలకు పుష్పాభిషేకం చేశారు.

## బిసి రిజర్వేషన్ల కోసం 72 గంటల నిరాహార దీక్ష

**హైదరాబాద్,జూలై29( వెలుతురు):**
బీసీ రిజర్వేషన్ల సాధన కోసం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఆగస్టు 4, 5, 6 తేదీల్లో తాను 72 గంటల పాటు నిరాహార దీక్ష చేయబోతున్నానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మంగళవారం ప్రకటించారు. ప్రభుత్వ అనుమతి కోరి దీక్షకు దిగుతానని ఒక వేళ అనుమతి ఇవ్వకపోతే ఎక్కడ కూర్చుంటే అక్కడే నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు. ఉమ్మడి రాష్ట్రంలో అంబేద్కర్ విగ్రహ సాధన కోసం తాను 72 గంటలు దీక్ష చేస్తే నాటి కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వం దిగివచ్చిందని గుర్తు చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో కవిత మీడియాతో మాట్లాడుతూ .... 2018 పంచాయతీ రాజ్ సవరణ చట్టాన్ని సవరణ చేస్తూ తెలంగాణ జాగృతి చేసిన డిమాండ్ తోనే రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ చేసిందని చెప్పారు. తమిళనాడులో గవర్నర్ జాప్యం చేస్తే కోర్టుకు వెళ్లి తీర్పు తెచ్చుకున్నారని మరి తెలంగాణ ప్రభుత్వం గవర్నర్ వద్ద పెండింగ్ అంశంపై కోర్టుకు ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. గవర్నర్, రాష్ట్రపతి వద్ద ఉన్న పెండింగ్ బిల్లులపై తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్తే సానుకూల తీర్పు వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే కోర్టులో కేసు వేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీజేపీకి ఉన్న ఒప్పందం కారణంగానే రేవంత్ రెడ్డి ప్రభుత్వం కోర్టుకు వెళ్లడం లేదని కవిత ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలన్నా రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో కేసు వేయాలన్నారు. తాము ఢిల్లీలో చేసే ధర్నాకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అంటు-న్నారు... ఇదేమైనా సత్రం భోజనమా ? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అఫీషియల్ గా అఖిలపక్షంను ఢిల్లీకి తీసుకువెళ్లాలని డిమాండ్ చేశారు. అఖిలపక్షం ఢిల్లీకి రావాలని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేలు, అన్ని రాజకీయ పార్టీలకు ప్రభుత్వం లేఖలు రాయలన్నారు. పొన్నం ప్రభాకర్ బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీహార్ అసెంబ్లీ ఎన్నికల కోసం డ్రామా చేస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా శూన్యం అని రిజర్వేషన్ల విషయంలో బీజేపీ తప్పించుకుంటోందని విమర్శించారు. బీజేపీ బీసీ సీఎం, బీసీ పీఎం అంటు-న్న బీజేపీకి బీసీలపై చిత్తశుద్ధి లేదని కవిత ధ్వజమెత్తారు.

# సిందూర్‌లో త్రివిధ దళాలు సత్తా చాటాయి

సమాధానం ఇచ్చాం. పాక్ డీజీఎం అర్ధరాత్రి ఫోన్ చేసి దాడులు ఆపాలని బతిమాలితేనే ఆపరేషన్ సిందూర్ నిలిపివేశామని అన్నారు. ఈ ఆపరేషన్ సందర్భంగా త్రివిధ ధళాలకు సంపూర్ణ స్వేచ్ఛ నిచ్చామని మోదీ తెలిపారు. భారత సైన్యం పాక్‌లో ఉగ్రవాద స్థావరాలను మట్టుబెట్టిందని, ఊహలకు కూడా అందని విధంగా టెర్రరిస్టులను శిక్షించామని, ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదులను మట్టిలోనే కలిపేశామని అన్నారు. ఏప్రిల్ 22న కేవలం 22 నిమిషాల్లో ఆపరేషన్ పూర్తి చేశామన్నారు. మతాల మధ్య చిచ్చు పెట్టేందుకే పహల్గాం దాడులు అన్నారు. ఈ దాడి తర్వాత ఉగ్రవాదులను మట్టిలో కలుపుతామని ప్రతినబూనాం. ద్రోహులకు కలలో కూడా ఊహించని విధంగా శిక్షిస్తామని చెప్పాం. ఉగ్రవాదులకు గట్టి గుణపాఠం చెప్పాలని అఖిలపక్ష భేటీలోనూ చర్చించాం. పాక్ భూభాగంలోకి వెళ్లి ఉగ్రస్థావరాల్ని ధ్వంసం చేశాం. పాక్ ఎయిర్ బేస్‌లు ఇప్పటికీ ఐసీయూలో ఉన్నాయి. అణుబాంబులు బెదిరింపులు చెల్లవని పాక్‌ను హెచ్చరించాం. 193 దేశాల్లో 190 దేశాలు ఆపరేషన్ సిందూర్‌ని సమర్థించాయి. పాక్‌కు కేవలం మూడు దేశాలే అండగా నిలిచాయని అన్నారు. ఆపరేషన్ సిందూర్‌ను కాంగ్రెస్ మాత్రమే తప్పుపడుతోందని,స్వార్థ రాజకీయాల కోసం సైనికుల పరాక్రమాలను తక్కువ చేస్తోంది. తమ స్వార్థ రాజకీయాల కోసం కాంగ్రెస్ నేతలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మోడీ మండిపడ్డారు.తద్వారా సైన్యం మనోస్థైర్యాన్ని దెబ్బతీస్తున్నారు. మీడియా హెడ్‌లైన్లలో వచ్చేందుకు కొందరు నేతలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. కాంగ్రెస్ నేతలు మీడియా హెడ్‌లైన్లలో ఉండొచ్చేమో గానీ.. ప్రజల మనస్సుల్ని గెలవలేరని అన్నారు. పాకిస్థాన్‌ను కాంగ్రెస్ వెనకేసుకురావడం దౌర్భాగ్యం. సర్జికల్ ÷-టస్రైక్స్ విషయంలోనూ కాంగ్రెస్ నేతలు ఇలాగే మాట్లాడారు. పైలట్ అభినందన్ పాక్‌కు చిక్కినప్పుడూ ఇలాగే మాట్లాడారు. పాక్ నుంచి అభినందన్‌ను మోదీ ఎలా తెస్తారో చూస్తామన్నారు. మేం ఆయన్ను సురక్షితంగా భారత్‌కు తీసుకొచ్చాం. విపక్షాల తీరు చూసి దేశమంతా నవ్వుకుంటోంది. భారత రక్షణ దళాల శక్తి, సామర్థ్యాలపై పూర్తి విశ్వాసం ఉంది. భారత రక్షణ దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చాం. నేనెప్పుడూ భారత ప్రజల పక్షమే. భారతీయుల భావనలతో నా స్వరం మిళితం చేసుకొని ముందుకెళ్తున్నా. ఆపరేషన్ సిందూర్ సమయంలో నాపై నమ్మకం ఉంచినందుకు దేశ ప్రజలకు రుణపడి ఉన్నానని మోడీ అన్నారు. పాకిస్థాన్ మళ్లీ ఎలాంటి కుయుక్తులు చేసినా ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుంని స్పష్టం చేశారు. పాక్ ఎలాంటి దుశ్చర్యలకు పాల్పడినా దీటుగా బదులిస్తాంఅని ప్రధాని మోదీ హెచ్చరించారు. పహల్గాం దాడి ఉగ్రవాదులను సైతం మట్టు-బెట్టామన్నారు. ఆపరేషన్ మహాదేవ్ చేపట్టి ఉగ్రవాదుల్ని ఏరివేస్తున్నట్లు- చెప్పారు.
ఉగ్రవాదుల ఏరివేతకు తిథివారనక్షత్రాలు చూడాలా అని ప్రధాని ఘాటు విమర్శలు చేశారు. ఎవరి హయాంలో పీవోకే పాక్ ఆధీనంలోకి వెళ్లిందో తెలియదా అని విమర్శించారు. 1971లో పీవోకేను స్వాధీనం చేసుకునే అవకాశం వచ్చినా చేజార్చుకున్నామని అన్నారు. ఆపరేషన్ మహాదేవ్ ద్వారా పహల్గాంలో దాడికి పాల్పడిన ముగ్గురు ఉగ్రవాదులను హతమార్చినట్లు ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విపక్షాల తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆపరేషన్ మహాదేవ్ నిన్న ఎందుకు చేపట్టారని ఆరోపిస్తున్నారు. ఎప్పుడు పట్టుకున్నారు.. నిన్ననే ఎందుకు కాల్చారంటూ ప్రశ్నిస్తున్నారు. ఉగ్రవాదుల్ని హతం చేయడానికీ తేదీలు, వారాలు చూడాలా అని ప్రశ్నించారు.ఎవరి కాలంలో పీవోకే.. పాక్ కబ్జాలోకి వెళ్లిందో అందరికీ తెలుసు. దేశభద్రత విషయంలో కాంగ్రెస్ మొదటు-÷-నంచీ ఉదాసీనంగానే వ్యవహరించిందని ప్రధాని మోదీ ఆక్షేపించారు. 1971లో పీవోకేను వెనక్కి తీసుకొనే అవకాశం వచ్చినా ఉపయోగించుకోలేదు. అప్పుడు వేలాది మంది పాక్ సైనికులు మనకు బందీలుగా చిక్కారు. 1971లో మన సైన్యం పాక్ భూభాగంలో వేల కిలోమీటర్లు ముందుకెళ్లింది. ముందుచూపుతో వ్యవహరించి ఉంటే పీవోకేను అప్పుడే తిరిగి పొందేవాళ్లం. పీవోకేను తిరిగి పొందే సువర్ణావకాశాన్ని కాంగ్రెస్ వృథా చేసింది. 1974లో కచ్చతీవు దీవులను శ్రీలంకకు అప్పగించారు. కచ్చతీవు దీవులు శ్రీలంకకు వెళ్లిపోవడంతో తమిళ జాలర్లు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సైన్యంపై నమ్మకం ఉన్నచోటే ప్రజాస్వామ్యం సురక్షితంగా ఉంటుంది. దేశం సురక్షితంగా ఉన్నప్పుడే విజ్ఞానపరంగా అభివృద్ధి చెందుతాం. కాంగ్రెస్ ఎప్పుడూ నిరాశాభావంలోనే ఉంటోంది. ఆయుధపరంగా ఎంత పటిష్ఠంగా ఉన్నా.. శాంతి కోసమే ప్రయత్నిస్తాం. పీవోకేను తిరిగి -కై-వసం చేసుకోవాలని విపక్షాలు అడుగుతున్నాయి. పీవోకేను ఎందుకు వెనక్కి తీసుకురాలేదని కాంగ్రెస్ అడుగుతోంది. భారత రక్షణ పరిశ్రమల్లో సంస్కరణలు తీసుకొచ్చాం. రక్షణ రంగంలో ప్రైవేటు- పరిశ్రమలకు తలుపులు తెరిచాం. గతంతో పోలిస్తే రక్షణ బడ్జెట్ మూడింతలు పెరిగింది. రక్షణ ఉత్పత్తుల్లో 250శాతం వృద్ధి నమోదైంది. భారత రక్షణ ఉత్పత్తుల ఎగుమతులు 30 రెట్లు- పెరిగాయి. మన రక్షణ ఉత్పత్తులు 100 దేశాలకు చేరుతున్నాయి. రక్షణ ఉత్పత్తుల మార్కెట్‌లో భారత్ జెండా పాతింది. ఆత్మనిర్భర్ ఉత్పత్తులతో భారత యువత సత్తా చాటు-తోంది. ఆయుధాలమయమైన ప్రపంచంలో విశ్వశాంతి ముఖ్యం. భారత్ యుద్ధ దేశం కాదు.. బుద్ధ దేశమని మోదీ అన్నారు.

## అఖిలపక్షంకన్నా ఎన్నికల ప్రచారమే ముఖ్యమా?

**న్యూఢిల్లీ,జూలై29( వెలుతురు):**
ఆపరేషన్ సిందూర్ పై రాజసభ్యలోనూ వాడీవేడీ చర్చ జరిగింది. ఈ క్రమంలో రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గేపై సభాపక్ష నేత జేపీ నడ్డా అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం తీవ్ర వాగ్వాదానికి కారణమైంది. దీంతో అధికార, విపక్ష సభ్యుల చప్పుళ్లతో సభ కొద్దిసేపు దద్దరిల్లింది. చివరకు తన వ్యాఖ్యలను నడ్డా వెనక్కి తీసుకొని, క్షమాపణ చెప్పడంతో సభ సద్దుమణిగింది. పహల్గాం దాడి, ఆపరేషన్ సిందూర్‌పై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దాదాపు గంటపాటు- ప్రసంగించారు. ఈ క్రమంలో ప్రధాని మోదీపైనా తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఖర్గే ప్రసంగం ముగిసిన వెంటనే స్పందించిన నడ్డా.. కాంగ్రెస్ అధ్యక్షుడు 'మానసిక సమతుల్యత' కోల్పోతున్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మోదీపై ఖర్గే చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. దీంతో నడ్డా చర్యలను తీవ్రంగా తప్పుపట్టిన విపక్షాలు క్షమాపణ చెప్పాలంటూ బల్లలు చరుస్తూ ఆందోళన చేపట్టాయి. అనంతరం ఖర్గే కూడా మాట్లాడుతూ.. ఎన్డీయే ప్రభుత్వంలో తాను గౌరవించే మంత్రుల్లో నడ్డా కూడా ఒకరని, అయినప్పటికీ తనపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం శోచనీయమన్నారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. వెంటనే కేంద్ర మంత్రి నడ్డా స్పందిస్తూ.. ఇప్పటికే తన మాటలు వెనక్కి తీసుకున్నానని, క్షమాపణ కూడా చెప్పానని అన్నారు. నరేంద్ర మోదీ ప్రపంచంలోనే అత్యంత ఆదరణ ఉన్న నాయకుడు. అందుకు భాజపానే కాదు దేశం మొత్తం గర్విస్తోందని కేంద్ర మంత్రి నడ్డా పేర్కొన్నారు. ఖర్గే మాత్రం ఆయన స్థాయిని పట్టించుకోకుండా అభ్యంతరకరంగా మాట్లాడారని విమర్శించారు. కాంగ్రెస్ అధ్యక్షుడికి సుదీర్ఘ అనుభవం ఉన్నప్పటికీ తన పరిధిని దాటి ప్రధానిపై వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. అవి ఆయన స్థాయికి తగినట్లు- లేవని, వాటిని రికార్డుల నుంచి తొలగించాల్సిన అవసరం ఉందని జేపీ నడ్డా పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్, పహల్గాం ఉగ్రదాడిపై ఉభయసభల్లో చర్చ జరుగుతుండగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సభలో లేకపోవడాన్ని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే తప్పుపట్టారు. తామంతా అఖిల పక్ష సమావేశంలో పాల్గొంటే ఆయన బీహార్‌లో రాజకీయ ర్యాలీలో పాల్గొన్నారని అన్నారు. ఇంతటి క్లిష్ట సమయంలో ఎన్నికల ప్రచారానికి వెళ్లడం అవసరమా అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ప్రభుత్వ రంగ సంస్థలు ఏర్పాటయ్యాయని ఖర్గే తెలిపారు. తమరు ప్రభుత్వ రంగ కార్ఖానాలు కాదు.. అబద్ధపు కార్ఖానాలు ఏర్పాటు- చేశారని అన్నారు. కీలకమైన అంశంపై పార్లమెంటు లో చర్చ జరుగుతుంటే ప్రధాని నరేంద్రమోడీ సభలో లేరని, కీలకమైన చర్చను వదిలేసి బిహార్ ఎన్నికల ప్రచారానికి వెళ్లారని విమర్శించారు. పహల్గాం ఉగ్రదాడి ఈ ఏడాది ఏప్రిల్ నెలలో జరిగిందని తెలియజేశారు. పార్లమెంటుకు రాకుండా ఎన్నికల ప్రచారానికి వెళ్లడమే దేశభక్తి అవుతుందా? అని ప్రశ్నించారు. పార్లమెంటు- సమావేశాలు నిర్వహించాలని అడిగితే మోడీ స్పందించలేదని, ఘటన జరిగిన 3 నెలల తర్వాత పార్లమెంటులో చర్చ పెట్టారని మండిపడ్డారు. విపక్షాలు పాకిస్థాన్ కు మద్దతు ఇస్తున్నాయని అసత్య ఆరోపణలు చేస్తున్నారని, అసత్యాలతో ఎక్కువకాలం ప్రజలను మభ్య పెట్టలేరని అన్నారు. తాము ఎప్పుడూ పాకిస్థాన్ కు మద్దతు ఇవ్వలేదని, ఇవ్వబోము అని చెప్పారు. కాంగ్రెస్ దేశాన్ని నిర్మించిన పార్టీ.. కాంగ్రెస్ కు చాలా చరిత్ర ఉందని కొనియాడారు. పహల్గాం ఘటనతో సంబంధం లేని అంశాలను లేవనెత్తుతున్నారని, పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని పోషిస్తోందని ధ్వజమెత్తారు. తాము మొదట నుంచి చెబుతున్నామని, ఉగ్రవాద సమస్య బిజెపి హయాంలో మూడింతలు అయ్యిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉగ్రవాదాల మూలాలు దెబ్బతీస్తున్నట్లు- కేంద్ర హోం మంత్రి అమిత్ షా జమ్మూకశ్మీర్ పర్యటనలో చెప్పారని అన్నారు. పాక్ ఉగ్రవాదులు పహల్గాం వరకు ఎలా వచ్చారని, పహల్గాం దాడికి 3 రోజుల ముందు ప్రధాని జమ్మూ పర్యటన రద్దు చేసుకున్నారని ఎద్దేవ చేశారు. ప్రధాని పర్యటన రద్దు చేసుకుంటారని.. పర్యాటకులను ఎలా అనుమతించారని నిలదీశారు. పహల్గాం దాడి కచ్చితంగా భద్రతా వైఫల్యమని జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ అన్నారని మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. అన్నీ తన ఘనతగా చెప్పుకునే జవాబుదారీ మోడీ.. పహల్గాం ఘటనకు ఎందుకు బాధ్యత వహించరు? అని మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. సైనికులు సాధించిన విజయాన్ని కూడా రాజకీయం చేయడం తగదని.. ఆపరేషన్ సిందూర్ లో భారత విజయంపై కాంగ్రెస్ కూడా విజయోత్సవ ర్యాలీలు నిర్వహించిందని మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు.

## యూరియాపై ప్రభుత్వం తప్పడు లెక్కలు

9 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందని... కానీ తెలంగాణలో 12.5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. ఇప్పుడు యూరియా లేదని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారని.. రబీలో అదనంగా ఉన్న యూరియా ఇప్పుడు ఎందుకు లేకుండా పోయిందని.. ఎందుకు కొరత వచ్చిందో రేవంత్ ప్రభుత్వం పరిశీలించుకోవాలని సూచించారు. యూరియా విషయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరావుకి రామచంద్ర రావు సవాల్ విసిరారు. ఆర్టీఏ చట్టం ద్వారా వివరాలు సేకరిద్దాం అని, తనది తప్పైతే రాజీనామా చేస్తానంటూ సవాల్ చేశారు. యూరియా సరఫరా విషయంలో ఆర్టీఏ చట్టం ద్వారా వివరాలు తీసుకోవచ్చని, అందులో తాము చెప్పేది అబద్ధమైతే తాను రాజీనామాకు సిద్ధమని.. మరి తుమ్మల రాజీనామా చేస్తాడో చూడాలని రామచంద్ర రావు అన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లాలో రామచంద్రరావు పర్యటించారు. ఖమ్మం నగరంలో రామచంద్రరావు రోడ్ షో నిర్వహించారు. నగరంలోని సప్తపది ఫంక్షన్ హాల్‌లో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడారు.ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నారని.. అభివృద్ధి మాత్రం లేదని రామచంద్రరావు ఆరోపించారు. కేందప్రభుత్వం ఇచ్చే నిధులతో ఖమ్మం జిల్లాలో కోట్లాది రూపాయల అభివృద్ధి జరుగుతోందని ఉద్ఘాటించారు. ఖమ్మం జిల్లాలో రాబోయే ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఏ ఎన్నికలైనా బీజేపీ అభ్యర్థులదే విజయమని జోస్యం చెప్పారు. ఖమ్మం జిల్లా కమ్యూనిస్టుల గడ్డ కాదని.. ఇకపై బీజేపీ అడ్డా కాబోతోందని ఉద్ఘాటించారు. ఖమ్మం జిల్లాలో చాలామంది కమ్యూనిస్టులు తనకు టచ్‌లో ఉన్నారని తెలిపారు. కమ్యూనిస్టులు బీజేపీలోకి రావాలని స్వాగతం పలికారు. రాజకీయాల కోసం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. తాను చెప్పింది తప్పయితే తాను తన పదవికి రాజీనామా చేస్తానని.. మీది తప్పు అయితే మీరు రాజీనామా చేస్తారా అని తుమ్మలకు సవాల్ చేశారు. తుమ్మల తనకు మిత్రులే అది తర్వాత సంగతి అని చెప్పుకొచ్చారు. బీసీ రిజర్వేషన్ విషయంలో తాము చిత్తశుద్ధితో ఉన్నామని రామచంద్రరావు నొక్కిచెప్పారు. బీసీ రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ పార్టీ బీసీలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని ఆక్షేపించారు. బీసీలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఏ పార్టీలో అయినా ఆ పార్టీ నాయకుడు లేదా ముఖ్యమంత్రి స్థాయి నేతలు ఆయా రాష్ట్రాల్లో పాదయాత్రలు చేస్తారని.. కానీ కాంగ్రెస్‌లో ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ జయంతి నటరాజన్ పాదయాత్ర చేస్తున్నారని ఎద్దేవా చేశారు. దీన్ని బట్టి కాంగ్రెస్‌లో ఏం జరుగుతుందో అర్థమవుతోందని విమర్శించారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ వైఖరిని వ్యతిరేకిస్తున్నామని అన్నారు. 42 శాతం బీసీలకు రిజర్వేషన్ అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌ది బీసీ రిజర్వేషన్ కాదని.. ముస్లింల రిజర్వేషన్ అని ఆరోపించారు. కాంగ్రెస్ బీసీలను మోసం చేస్తోందని విమర్శించారు. తాము ముస్లింల రిజర్వేషన్‌కు వ్యతిరేకం కాదని క్లారిటీ- ఇచ్చారు. ముస్లింలకు ఓబీసీ రిజర్వేషన్ అమలు చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఏం చేస్తుందో ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. ఖమ్మం, నల్గొండ బ్యాచ్ ముఖ్యమంత్రిని సరిగా పని చేయనీయటం లేదని రామచంద్రరావు విమర్శలు చేశారు. ఖమ్మం, నల్గొండ జిల్లా నేతలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పని చేయనివ్వటం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. సీఎం రేవంత్ కుర్చీ కాపాడుకోవాడం కోసమే తన సమయాన్ని వెచ్చించాల్సి వస్తుందని, అందువల్లే మీనాక్షి నటరాజన్ పాదయాత్ర కూడా చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశారు. 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు ఇవ్వాలి, కానీ అందులో ముస్లింలకు రిజర్వేషన్ కల్పించకూడదు. బీసీ బిల్లుకు బేషరతుగా మద్దతు ఇచ్చింది బీజేపీ మాత్రమే. 42 శాతం బీసీలకు రిజర్వేషన్ ఇవ్వాల్సిందే. ఒక్క శాతం తగ్గిన ఊరుకునేది లేదు' అని హెచ్చరించారు. 'మొన్న బండి సంజయ్ చెప్పాడు.. ఇది బీసీ రిజర్వేషన్ కాదు, ముస్లింల రిజర్వేషన్ అని. మేము ముస్లింలకు వ్యతిరేకం కాదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 19 నెలలు అవుతుంది. ఇచ్చిన హామీలు ఎందుకు నెరవేర్చడం లేదు. కిసాన్ సమ్మాన్ యోజన పథకం కింద దేశంలో ప్రతి రైతుకు డబ్బులు పడ్డాయి. ఖమ్మంలో కూడా బీజేపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. తెలంగాణ, ఖమ్మం జిల్లా ప్రజలు బీజేపీ మీద విశ్వాసంతో ఉన్నారు. ఖమ్మం జిల్లాలో గెలుపే లక్ష్యంగా అందరూ పని చేయాలి' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు.

## ఏనుగుల సంచారంపై నిరంతర పర్యవేక్షణ

**అమరావతి,జూలై29( వెలుతురు):**
తిరుపతి జిల్లాల్లో ఏనుగులు గుంపులు గుంపులుగా సంచరిస్తున్న క్రమంలో అటవీశాఖ సిబ్బంది గ్రామాలలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. సోమవారం ఉదయం అటవీ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఏనుగుల గుంపుల సంచారం, పంట పొలాలను ధ్వంసం చేయడం, ఏనుగుల దాడిలో ఇటీవల ఒక రైతు దుర్మరణంపై సమీక్షించారు. సోమవారం ఉదయం చంద్రగిరి నియోజకవర్గం పరిధిలో ఏనుగుల గుంపు తిరుగుతూ పొలాలు ధ్వంసం చేసిన ఘటనపై అధికారులు వివరాలు అందించారు. 11 ఏనుగులు ఒక గుంపుగా తిరుగుతూ కళ్యాణి డ్యామ్ సమీపంలోని సత్యసాయి ఎస్టీ కాలనీ దగ్గర పొలాలు, తోటలు తొక్కివేశాయని వివరించారు. డ్రోన్ ద్వారా ఏనుగుల గుంపు కదలికలను పరిశీలిస్తున్నట్లు- వివరించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ అధికారులకు దిశానిర్దేశం



చేశారు. ఏనుగులు ఎటు-వైపు వెళ్తున్నాయి అనేది పరిశీలించడానికి డ్రోన్ టెక్నాలజీ వినియోగిస్తున్న క్రమంలో... అవి వెళ్ళే అవకాశం ఉన్న మార్గాల్లోని గ్రామాలవారిని అప్రమత్తం చేయడంలో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. గ్రామాలవారీగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు- చేసి వాటికి ఎప్పటికప్పుడు ముందస్తు హెచ్చరికలు పంపించాలని ఆదేశించారు. ఏనుగుల కదలికలు, హెచ్చరిక సందేశాలు పంపించడాన్ని డి.ఎఫ్.ఓ. కార్యాలయాలు, పి.సి.సి.ఎఫ్. కార్యాలయం పర్యవేక్షించాలన్నారు. వీటితోపాటు- ఏనుగుల గుంపు పొలాల మీదకి రాకుండా, అటవీ ప్రాంతంలోకి పంపించే చర్యలను పకడ్బందీగా చేపట్టాలని స్పష్టం చేశారు. సోమవారం అర్ధరాత్రి తిరుపతి శ్రీవారి మెట్టు- మార్గంలో ఏనుగులు సంచరించిన విషయం తెలిసిందే. పంప్ హౌస్ వద్ద 11 ఏనుగులు సమీపంలోని పంట పొలాలను ధ్వంసం చేశాయి. ఈ నేపథ్యంలో పవన్ కల్యాణ్ సమీక్ష నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఏనుగులు సంచరిస్తున్న ప్రాంత ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని అధికారులకు పవన్ కల్యాణ్ సూచించారు. గ్రామస్థులతో వాట్సప్ గ్రూపులు ఏర్పాటు- చేసి ముందస్తు సమాచారం ఇవ్వాలని చెప్పారు. అటవీ శాఖ సిబ్బంది ఆయా గ్రామాల్లో నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. ఏనుగుల గుంపు పొలాల మీదకి రాకుండా, అటవీ ప్రాంతంలోకి పంపించే చర్యలను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు.

## ఇండ్ల స్థలాలు కేటాయించాలని హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ కు టీజీవో నేతల వినతి



**హైదరాబాద్ వెలుతురు జూలై 29:**
ఇండ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ మంగళవారం రోజున సెక్రటేరియట్లో హైదరాబాద్ ఇన్చార్జి మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్ కి టీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఏ సత్యనారాయణ వినతి పత్రం సమర్పించారు, హైదరాబాద్ లో పనిచేస్తున్న గెజిటెడ్ అధికారులకు ఇళ్ల స్థలాలను కేటాయించమని హైదరాబాద్ ఇన్చార్జి మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్ ని కోరుతూ నిన్న జరిగిన కార్యవర్గ సమావేశం తీర్మాన పత్రాన్ని మంత్రి కి అందించారు. టీజీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎం.బి కృష్ణ యాదవ్ టిజిఓ నగర అధ్యక్షులు డాక్టర్ గండూరి వెంకటేశ్వర్లు జిల్లా కార్యదర్శి ఎం ఏ ఖాదర్ సిటీ కార్యదర్శి నిరంజన్ రెడ్డి , కేంద్ర సంఘ నాయకులు బి శ్యామ్. నరహరి. లక్ష్మణ్ గౌడ్. డాక్టర్ రామారావు. డాక్టర్ శ్రీరామ్ రెడ్డి. శోకదుస్సేన్. తదితరులు పాల్గొన్నారు

## సిఎం రమేశ్ ఇంటికి వెళ్లావా లేదా

**- రమేశ్ వ్యాఖ్యలపై ఎందుకు సమాధానం లేదు**

**- కెటిఆర్‌కు సవాల్ చేసిన మంత్రి సీతక్క**



**హైదరాబాద్,జూలై29( వెలుతురు):**
బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు మంత్రి సీతక్క సవాల్ విసిరారు. రాజ్యసభ ఎంపి సిఎం రమేష్ ఇంటికి వెళ్లిన విషయంపై కెటిఆర్ ఎందుకు స్పష్టత ఇవ్వడంలేదని అడిగారు. కెటిఆర్ అబద్దాలకోరు అనేది సిఎం రమేష్ మాటల్లో తెలుస్తుందన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపితో బిఆర్ఎస్ కుమ్మక్కు కాలేదని కెటిఆర్ ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్కశాతం ఓట్లు తేడా వస్తే పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ ఓట్లన్నీ బిజెపికి వెళ్లాయని.. కెటిఆర్ గుండెపై చేయి వేసుకొని ఈ విషయంపై క్లారిటీ- ఇవ్వాలని సీతక్క డిమాండ్ చేశారు. లిక్కర్ స్కామ్‌లో ఎంఎల్‌సి కవిత అరెస్టు తరువాత తన ఇంటికి కెటిఆర్ వచ్చారని రాజ్యసభ ఎంపి సిఎం రమేష్ సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. కవితను విడుదల చేస్తే బిఆర్ఎస్‌ను బిజెపిలో విలీనం చేస్తానన్నారని సిఎం రమేష్ మీడియాతో చెప్పారు. తన వల్లే కెటిఆర్గెలిచారని రమేష్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. కెటిఆర్ గురించి చెప్పాలంటే చాలా విషయాలు ఉన్నాయని తనకు సంస్కారం అడ్డువస్తుందన్నారు. కవిత అరెస్ట్ తర్వాత నువ్వే నా ఇంటికి వచ్చావు. బీజేపీలో బీఆర్ఎస్‌ను విలీనం చేస్తానని అప్పుడే చెప్పావు. కవితను విడుదల చేస్తే బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేస్తానని నువ్వు చెప్పిన విషయం మరిచిపోయావా? అని ప్రశ్నించారు. అలాగే, 'నా వల్లే నువ్వు ఎన్నికల్లో గెలిచావు. కేవలం 300 ఓట్ల మెజారిటీతో గెలిచిన విషయం నీకు తెలుసు. నీ గురించి చెప్పాలంటే చాలా విషయాలు ఉన్నాయి, కానీ నా సంస్కారం అడ్డువస్తోందని సీఎం రమేష్ అన్నారు. ఈ క్రమంలో కేటీఆర్‌కు మంత్రి సీతక్క సవాల్ విసిరారు. సీఎం రమేష్ ఇంటికి వెళ్లిన విషయంపై కేటీఆర్ సమాధానం చెప్పాలన్నారు. కేటీఆర్ అబద్ధాలు మాట్లాడుతారనేది ఎంపీ రమేష్ మాటల్లో చూశాం.. ఎన్ని అబద్ధాలు చెప్పినా.. కొద్దీ రోజుల్లో నిజం తెలుస్తుందని మంత్రి సీతక్క వెల్లడించారు.

## జులై 31 నుంచి ఆగస్టు 6వరకు పాదయాత్ర

**- స్థానికులతో కలిసి శ్రమదాన కార్యక్రమాలు**

**- మీనాక్షి పాదయాత్రపై పిసిసి చీఫ్ వెల్లడి**



**హైదరాబాద్,జూలై29( వెలుతురు):**
జులై 31 నుంచి ఆగస్టు 6వరకు పాదయాత్ర, శ్రమదానం కార్యక్రమాలు ఉంటాయని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. పరిగి నియోజకవర్గం నుంచి మొదలై వర్ధన్నపేట వరకు పాదయాత్ర కొనసాగుతుందని చెప్పారు. ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ ఈ కార్యక్రమాల ద్వారా ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. మహేశ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగే పాదయాత్ర, శ్రమదానం కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతలు పాల్గొననున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధతలో భాగంగా వారం పాటు ఎంపిక చేసిన అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ నేతలు పాదయాత్రలు, శ్రమదానం నిర్వహించనున్నారు.జులై 31న పరిగి నియోజకవర్గంలోని రంగాపుర్‌లో సాయంత్రం 5 గంటలకు పాదయాత్ర ప్రారంభిస్తారు. మీనాక్షి నటరాజన్, మహేశ్ కుమార్ గౌడ్ సహా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నేతలు ఆరోజు రాత్రి అక్కడే బస చేస్తారు. మరుసటి రోజుఆగస్టు 1 ఉదయం శ్రమదానం కార్యక్రమం ఉంటుంది. ఆగస్టు 2న అందోల్ , 3న ఆర్మూర్ , 4న ఖానాపూర్ (ఆదిలాబాద్), 5న చొప్పదండి (కరీంనగర్), 6న వర్ధన్నపేట (వరంగల్) నియోజకవర్గాల్లో పాదయాత్ర, శ్రమదానం కార్యక్రమాలు ఉంటాయి. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు నేతలు వివరించనున్నట్లు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. పది ఉమ్మడి జిల్లాల ఇన్‌ఛార్జులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శిలతో సమావేశం జరిగిందని, నామినేటెడ్ పోస్టుల కోసం సుదీర్ఘ చర్చ జరిగింది. కార్పొరేషన్ల పోస్టులు, డైరెక్టర్ల కోసం సీఎంతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం అన్నారు. బీసీల పట్ల కవిత పది ఏండ్లు అధికారంలో ఉండి ఎందుకు మాట్లాడలేదు. ఇప్పుడు బీసీల గురించి వల్కబోసినా కవితను ఎవరు నమ్మరు. మేము అధికారంలోకి వచ్చాక రెండు చట్టాలు తీసుకొచ్చాం. గంగుల కమలాకర్ పది ఏండ్లు మంత్రిగా ఉండి బీసీల రిజర్వేషన్లు తగ్గిస్తే ఎందుకు మాట్లాడలేదు. ముఖేష్ గౌడ్ హైదరాబాద్ కాంగ్రెస్ పార్టీకి సేవ చేసిండు. ముఖేష్ గౌడ్, శివ శంకర్ విగ్రహం పెట్టాలని అడుగుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడి విగ్రహాలు పెడతాం' అని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు.

## సృష్టి టెస్ట్ ట్యూబ్ కేసులో సంచలన విషయాలు

**- సరోగసి పేరుతో డబ్బులు దండుకున్న నమ్రత**

**హైదరాబాద్,జూలై29( వెలుతురు):**
సృష్టి టెస్ట్ ట్యూబ్ కేసులో సంచలన విషయాలు వెలుగుచూస్తున్నాయి. ఐవిఎఫ్ కోసం వస్తున్న దంపతులను సరగోసి వైపు మళ్లించినట్లు- పోలీసులు గుర్తించారు. ఇక్కడ సరోగసికి సంబంధించిన వ్యవస్థ లేకున్నా బురిడీ కొట్టించారు. గిరిజన బిడ్డలను తీసుకుని వచ్చి సరోగసి బిడ్డలుగా నమ్మించారని గుర్తించారు. ఐ వి ఎఫ్ అయితే రెండు మూడు లక్షలు మాత్రమే వస్తాయని భావించింది నమ్రత.. సరోగసి అయితే దంపతుల ఆర్థిక స్తోమతను బట్టి వసూలు చేయొచ్చని భావించింది. సరోగసి కోసం 30 నుంచి 50 లక్షల రూపాయలను వసూలు చేసింది. ఇప్పటికే 30 మందికి పైగా సరోగసి కోసం డబ్బులు కట్టినట్లు- గుర్తించారు. పోలీసులకు సరోగసి బాధితుల లిస్ట్ లభ్యమైనట్లు- సమాచారం.ఐవిఎఫ్ కోసం వస్తున్న వారు హైదరాబాద్ సెంటర్ ను కాంటాక్ట్ చేస్తే వైజాగ్ కి పంపించి డబ్బులు వసూలు చేసినట్లు- గుర్తించారు. వైజాగ్ కి వచ్చే దంపతులను విజయవాడ హైదరాబాద్ పంపించి వసూళ్లకు పాల్పడ్డారు. దంపతులకు అనుమానం రాకుండా సరోగసి మదర్ తో కాంటాక్ట్ లేకుండా జాగ్రత్త పడింది నమృత. ఇప్పటివరకు ఎన్ని సరోగసిలు జరిగాయన్నదానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

## కాలుష్యరహిత హైదరాబాదే లక్ష్యం...

హైదరాబాద్ నగరాన్ని కాలుష్యరహితంగా మార్చేందుకు అవసరమైన సంస్కరణలు చేపట్టాలని... ఇందుకు రానున్న 25 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇందుకుగానూ ఢిల్లీ, ముంబయి, చెన్నై వంటి నగరాల్లో సమస్యలను అధ్యయనం చేయాలని పేర్కొన్నారు. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, అండర్ గ్రౌండ్ కేబులింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో అన్ని శాఖలు సమగ్ర డీపీఆర్‌లు తయారు చేయాలని సీఎం సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని... నిర్మాణ రంగ వ్యర్థాలను సిటీలో ఎక్కడపడితే అక్కడ డంప్ చేయకుండా చూడాలని సీఎం ఆదేశించారు. ఉద్దేశపూర్వకంగా అలా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ నగరంలో మంచినీటి సరఫరా, మురుగు నీటి సరఫరా వ్యవస్థను పూర్తిగా సంస్కరించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందేలా హైదరాబాద్ నగర మంచినీటి సరఫరా.. సీవరేజీ బోర్డు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీఎం ఆదేశించారు. బోర్డు తమకున్న వనరులను ఏవిధంగా సద్వినియోగం చేసుకోవాలనే అంశంపై ప్రత్యేక ప్రణాళిక రూపొంచుకోవాలని సీఎం సూచించారు. ఓఆర్ఆర్ పరిధిలోని వారసత్వ కట్టడాల సంరక్షణ, వాటిని పర్యాటక ప్రదేశాలుగా తీర్చిదిద్దేందుకుగానూ కులీకుతుబ్ షాహీ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ మార్గదర్శకాలను సవరించి దానిని మరింత బలోపేతం చేయాలని సీఎం ఆదేశించారు. మార్గదర్శకాల రూపకల్పనలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాతబస్తీలో మెట్రో పనుల పరిస్థితిపైనా సీఎం ఆరా తీశారు. అవసరమైన నిధులు ఇప్పటికే విడుదల చేసినందున అక్కడ అక్కడ మెట్రో పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మెట్రో ఇతర ఫేజ్‌ల అనుమతులు, తదితర విషయాల్లో ఏమాత్రం జాప్యాన్ని సహించబోమని హెచ్చరించారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖతో సమన్వయం చేసుకుంటూ త్వరగా పనులు పట్టాలెక్కేలా చూడాలని అధికారులకు సూచించారు. ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్ పేట ఓఆర్ఆర్ వరకు ఎలివేటేడ్ కారిడార్ పనులు వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. మూసీ రివర్ ఫ్రంట్‌కు సంబంధించి హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు పనులు వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఓఆర్ఆర్ నుంచి మూసీ వైపు వచ్చే క్రమంలో కొత్వాల్‌గూడ జంక్షన్‌లో మూసీ రివర్ ఫ్రంట్‌కు ప్రతీకగా ఇండియా గేట్, గేట్ వే ఆఫ్ ఇండియా, చార్మినార్ లాంటి ఓ ల్యాండ్ మార్క్‌ను నిర్మించాలని సీఎం సూచించారు. మూసీపైన బ్రిడ్జి కం బ్యారేజీలకు ప్రణాళికలు రూపొందించాలని సీఎం సూచించారు. అనుమతులు, నిబంధనల విషయంలో తగు జాగ్రత్తలు వహించాలని అధికారులకు తెలిపారు. నెహ్రూ జూ పార్క్, మీరాలం ట్యాంక్ అభివృద్ధి పనుల్లో పురోగతిపైనా సీఎం సమీక్షించారు. మీరాలం ట్యాంక్ ఎదుట ఏర్పాటు చేసిన ఎస్టీపీలు వాటి సామర్థ్యానికి అనుగుణంగా పని చేసేలా చూడాలని సీఎం



ఆదేశించారు. జూ పార్క్, మీరాలం ట్యాంక్ సమీపంలో పర్యాటకులు బస చేసేందుకు వీలుగా అధునాతన వసతులతో హోటల్ నిర్మించాలని... పార్క్, మీరాలం ట్యాంక్ తోపాటు నగరాన్ని వీక్షించేలా హోటల్ ఉండాలని సీఎం అభిప్రాయపడ్డారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి (హెచ్ఎండీఏ ఏరియా) కార్యదర్శులు ఇలంబర్తి, టి.కె.శ్రీదేవి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఎఫ్‌సీడీఏ కమిషనర్ కే.శశాంక, వాటర్ బోర్డు ఎండీ అశోక్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్, మెట్రో రైలు ఎండీ ఎన్.వి.ఎస్.రెడ్డి, ఎంఆర్‌డీసీఎల్ ఎండీ ఇ.వి. నరసింహారెడ్డి, జేఎండీ గౌతమి తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ సిందూర్‌పై సందేహాలా

అడుగుతున్నారో ఒకసారి ఆలోచించాలంటూ హితవుపలికారు. ఉగ్రవాదులు చనిపోయారన్న సంతోషం వారిలో కనిపించలేదని చెప్పారు. ఉగ్రవాదులు పాక్ నుంచే వచ్చారనేందుకు.. ఆధారాలు ఉన్నాయా అన్న చిదంబరం ప్రశ్నకు అమిత్ షా స్పందించారు. పాక్‌ను కాపాడే ప్రయత్నం చేస్తున్నారా.. అని ప్రశ్నించారు. పాక్‌కు క్లీన్‌చిట్ ఇవ్వాల్సిన అవసరం ఏంటంటూ కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రశ్నించారు. కేంద్ర హోంశాఖ మంత్రిగా పనిచేసిన వ్యక్తి ఇలా మాట్లాడటం తగదని హితవు పలికారు. ఉగ్రవాదులు పాకిస్తాన్ నుంచి వచ్చారనేందుకు తమ వద్ద ఆధారాలున్నాయని స్పష్టం చేశారు. ఉగ్రవాదుల నుంచి కొన్ని పాక్ వస్తువులను కూడా స్వాధీనం చేసుకున్నామని అమిత్‌షా క్లారిటీ ఇచ్చారు. ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకున్నట్లు- కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. పహల్గాం ప్రతీకారాన్ని ధృవీకరించారు. ఈ దాడికి పాల్పడిన ఉగ్రవాదుల్లో ముగ్గురిని మట్టుబెట్టినట్లు వెల్లడించారు. పహల్గాంలో పర్యాటకులను హత్య చేశారు. టూరిస్టులను ఉగ్రవాదులు అతికిరాతకంగా హత్య చేశారు. కుటుంబ సభ్యులు ముందే కాల్చి చంపారు. మంతం, పేరు అడిగి మరీ చంపడం దారుణం. పహల్గాం దాడికి పాల్పడిన ఉగ్రవాదుల్లో ముగ్గురిని హతమార్చాం. ఈనెల 22న శాటిలైట్ ఫోన్ సిగ్నల్ ద్వారా ఉగ్రవాదుల కదలికలను గుర్తించాం. ఆపరేషన్ మహాదేవ్‌లో ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. ఉగ్రదాడి జరిగిన రోజునే జమ్ము భద్రతపై సమీక్షించాం. ఉగ్రవాదులను ఆశ్రయం ఇచ్చిన వారిని కూడా అరెస్ట్ చేశాం. ఉగ్రశిబిరాలను మట్టిలో కలిపేశాం. ఆర్మీ, సీఆర్‌పీఎఫ్, జమ్ము పోలీసులకు అభినందనలు' అని అమిత్ షా తెలిపారు. ఉగ్రవాదుల్ని హతమార్చాం అంటే విపక్షాలు సంతోషిస్తాయనుకున్నానని, కానీ సందేహాలు వ్యక్తం చేస్తున్నారంటూ షా వ్యాఖ్యానించారు. జమ్ముకశ్మీర్‌లోని శ్రీనగర్ సమీపంలో ఉన్న హర్వాన్ ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కినట్టు- నిఘా వర్గాల నుంచి సమాచారం అందడంతో గడిచిన నెలరోజులుగా ఆ అటవీ ప్రాంతంలో భద్రతా దళాలు గాలింపు చర్యలు చేపట్టాయి. లష్కరే, జైషే ఉగ్రవాదుల కదలికల కోసం గడిచిన 14 రోజులుగా మరింత ముమ్మరంగా నిఘాను పెంచాయి. ఈ క్రమంలో దాచిగామ్ నేషనల్ పార్క్ పరిసరాల్లో రెండు రోజుల కిందట అనుమానస్పద కమ్యూనికేషన్లను భారత సైన్యం పసిగట్టింది. సోమవారం ఉదయం 11.30 గంటల సమయంలో దాచిగామ్ నేషనల్ పార్క్ పరిసరాల్లో ముగ్గురు ఉగ్రవాదులను గుర్తించిన భద్రతాదళాలు.. మెరుపు వేగంతో కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో ఉగ్రవాది సులేమాన్ షాతో పాటు- పహల్గాం దాడికి కారణమైన మరో ఉగ్రవాది యాసిర్ హతమైనట్టు- అధికారులు తెలిపారు. ఈ కాల్పుల్లో మరో ఉగ్రవాది అబూ హామ్‌జా కూడా హతమైనట్టు- పేర్కొన్నారు. వీరందరూ విదేశీ ఉగ్రవాదులేనని తెలిపారు. అమాయక పౌరులపై దాడులు చేస్తే మా ప్రతి స్పందన గట్టిగా ఉంటుందని హెచ్చరించారు. విపక్ష ఎంపిల వ్యాఖ్యలు దారుణంగా ఉన్నాయని, ఎలాంటి ప్రశ్నలు అడుగుతున్నారో ఒకసారి ఆలోచన చేయాలని డిమాండ్ చేశారు. పహల్గాం దాడి బాధితులను కలిసి వారి బాధలు తెలుసుకున్నామని, పహల్గాం దాడి ఘటనను వెంటనే ఎన్ఐఎకు అప్పగించామని వివరించారు.ఉగ్రవాదులు పాక్ నుంచి వచ్చారనేందుకు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని, ఉగ్రవాదుల నుంచి పాక్‌లో తయారైన పత్రాలు, చాక్లెట్లు- స్వాధీనం చేసుకున్నామని, కేంద్ర హోంశాఖ మంత్రిగా పని చేసిన వ్యక్తి ఇలా మాట్లాడడం తగదని అమిత్ షా చురకలంటించారు. దేశ ప్రజల ఆశలు, ఆకాంక్షలు గమనించి కాంగ్రెస్ నేతలు మాట్లాడాలని సూచించారు. ఆపరేషన్ సింధూర్‌పై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వివరంగా చెప్పారని, పహల్గాం తీవ్రవాదుల దాడిలో 26 మంది మృతి చెందారని, మృతుల్లో నేపాల్ వ్యక్తి కూడా ఉన్నారని తెలియజేశారు. పహల్గాం దాడి కేవలం పర్యాటకులపై కాదు అని, దేశంపై దాడి పరిగణించాలని, పహల్గాంలో దాడి చేసిన ఉగ్రవాదులను మట్టిలో కలిపేశామని, ఆనాడు 140 కోట్ల మంది ప్రజల గుండెచప్పుడును ప్రధాని మోడీ వివరించారని అమిత్ షా గుర్తు చేశారు. పాక్‌పై దాడులు చేసేందుకు భద్రతాబలగాలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని, మే 7న ఆపరేషన్ సింధూర్ చేపట్టామని, 9న ఉగ్ర శిబిరాలు ధ్వంసం చేశామని, మన భద్రతా దళాల దాడుల్లో ఒక్క పాక్ పౌరుడు కూడా మరణించలేదన్నారు. పాక్‌లో వందల కిలో మీటర్ల లోపలికి వెళ్లి ఉగ్ర శిబిరాలను ధ్వంసం చేశామన్నారు. భద్రతా దళాల దాడుల్లో పలువురు ఉగ్రవాద నేతలు కూడా హతమయ్యారని వివరించారు. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని ప్రపంచానికి చాటిచెప్పామని, పాకిస్థాన్ దాడుల్లో ఇక్కడి గురుద్వారా, దేవాలయం ధ్వంసమయ్యాయని హోంశాఖ మంత్రి తెలియజేశారు.

## సిఎం రమేశ్ బ్రోకరిజం అందరికీ తెలుసు

**- దాడులకు భయపడి బిజెపిలో చేరింది నిజం కాదా**

**- కెటిఆర్‌ను గతంలో ఎన్నిసార్లు కలిశావో చెప్పు**

**- కంచెగచ్చిబౌలి భూములపై మధ్యవర్తిత్వం నెరిపావా లేదా**

**- కెటిఆర్‌పై విమర్శలకు కొప్పుల ఈశ్వర్ ఘాటు స్పందన**

**హైదరాబాద్,జూలై29( వెలుతురు):**
బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అవుతుందని అంటూ ఎంపీ సీఎం రమేష్ చేసిన వ్యాఖ్యలు 'ఇయర్ ఆఫ్ ది జోక్' అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ఎన్నటికీ బీజేపీలోనే కాదు.. ఏ పార్టీలో విలీనం కాదన్నారు. సీఎం రమేష్ ఎప్పుడు బీజేపీలో చేరారు అని, బీజేపీలో ఆయనకు ఉన్న పరపతి ఎంత అని ప్రశ్నించారు. కంచెగచ్చిబౌలి భూముల విషయంలో సీఎం రమేష్ మధ్యవర్తిగా ఉన్నారా? లేదా? అని తెలంగాణ ప్రజలకు సీఎం రమేష్ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీది తెలంగాణ భావజాలం అని, బీజేపీది ఆర్ఎస్ఎస్ భావజాలం అని పేర్కొన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే వాళ్లకు బ్రోకరిజం చేసే సీఎం రమేష్ మాటలను తెలంగాణ ప్రజలు పట్టించుకోవద్దని కొప్పుల ఈశ్వర్ చెప్పుకొచ్చారు. కంచె గచ్చిబౌలి భూముల విషయంలో సీఎం రమేష్ మధ్యవర్తిత్వం వహించి 10 వేల కోట్ల రుణాలు



ఇప్పించారన్నారు. దీనికి సీఎం రమేష్ సమాధానం చెప్పకుండా, విలీనం అంశం ఎందుకు మాట్లాడుతున్నారు. కంచెగచ్చిబౌలి భూముల విషయంలో సీఎం రమేష్ మధ్యవర్తిగా ఉన్నారా? లేదా తెలంగాణ ప్రజలకు చెప్పాలి. కేటీఆర్ నా ఇంటికి వచ్చి కలిశారని అంటున్న సీఎం రమేష్.. నీ కంపెనీ కోసం, నీ కాంట్రాక్టుల కోసం అధికారంలో వున్నప్పుడు కేటీఆర్ వెంటపడలేదా?. బీఆర్ఎస్ ఎన్నటికీ బీజేపీలోనే కాదు ఏ పార్టీలో విలీనం కాదు. ఇప్పటి వరకు బీఆర్ఎస్ బీజేపీతో పొత్తు పేట్టు- కోలేదు. భవిష్యత్తులో బీజేపీతో బీఆర్ఎస్ పార్టీకి ఎలాంటి పొత్తు ఉండదని కొప్పుల ఈశ్వర్ అన్నారు. రేవంత్ రెడ్డి ఆఫీస్ నుంచి వచ్చిన స్క్రిప్ట్ సీఎం రమేష్ చదువుతున్నారు. టీడీపి నుంచి రాజ్యసభ ఎంపీ అయ్యి ఈడీ, సీబీఐ కేసులకు భయపడి బీజేపీలో చేరిన సీఎం రమేష్ మాటలకు విలువ ఉందా?. సీఎం రమేష్ చరిత్ర రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు తెలుసు. ఆంధ్రా ఎంపీ సీఎం రమేష్ అక్కడ ఉన్న కుల పంచాయతీలు తెలంగాణకు తీసుకురావాలని చూస్తున్నారు. ఆయన లాంటి వాళ్ళతో తెలంగాణ ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. సీఎం రమేష్ ప్రస్తావన చేసిన కమ్మ, రెడ్డి సామాజిక వర్గాలకు కేసీఆర్ సీఎంగా వున్నప్పుడు ఉన్న ప్రాధాన్యత ఇప్పుడు ఉందా?. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కమ్మ, రెడ్డి సామాజిక వర్గాల వారు అత్యధికంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఎంపీలుగా, పార్టీ పదవుల్లో ఉన్నారు. బీఆర్ఎస్ పార్టీని అస్థిరపరచాలని రేవంత్ రెడ్డి ఇచ్చిన స్క్రిప్ట్ సీఎం రమేష్ చదివారు. తెలంగాణ వచ్చాక కేసీఆర్ నాయకత్వానికి అన్ని వర్గాలు మద్దతు తెలిపాయి. 2023లో బీఆర్ఎస్ అధికారంలోకి రాకపోయినా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఎక్కువ సీట్లు- గెలిచింది. సెటిలర్స్, కమ్మ, రెడ్డి, అన్ని సామాజిక వర్గాల వారు కేసీఆర్, కేటీ-ఆర్ నాయకత్వానికి ఆమోదం తెలిపారు. బీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇస్తున్న సామాజికవర్గాల వారిని కేటీ-ఆర్ ఎట్లా తిడతారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే వాళ్లకు బ్రోకరిజం చేసే సీఎం రమేష్ మాటలను తెలంగాణ ప్రజలు పట్టించుకోవద్దు' అని కొప్పుల ఈశ్వర్ సూచించారు.

## రాజాసింగ్ .. రా అంటే మళ్లీ వాలిపోతా

**- బిజెపి నా సొంతిల్లు...కొన్నిపొరపాట్లు జరిగాయి**

**- గోషామహల్‌కుఉప ఎన్నిక రానేరాదు**

**- ఎమ్మెల్యే రాజాసింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు**

**హైదరాబాద్,జూలై29( వెలుతురు):**
గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనను బీజేపీ ఎమ్మెల్యే అని చెప్పొచ్చని, గోషామహల్‌కు మూడేళ్లు తానే ఎమ్మెల్యే అని పేర్కొన్నారు. కొన్ని తాను తప్పులు చేశానని, సోషల్ మీడియా మరికొన్ని తప్పుడు ప్రచారం చేసిందన్నారు. తమ పార్టీలో మిత్రులు, శత్రువులు ఉంటారని చెప్పారు. మీడియాకు రాజా సింగ్ లీక్‌లు ఇస్తున్నారని మా వాళ్లే కొందరు ఢిల్లీకి పిర్యాదు చేశారని తెలిపారు. గోషామహల్‌లో ఉప ఎన్నిక రాదన్నారు. బీజేపీ పార్టీకి మాత్రమే రాజీనామా చేశానని, ఎమ్మెల్యేగా రాజీనామా చేయలేదని స్పష్టం చేశారు. బీజేపీ తన ఇల్లు అని, రాజా సింగ్ రా అంటే వెంటనే పార్టీలోకి వెళ్లిపోతాను అని రాజా సింగ్ చెప్పారు. పెన్ డ్రైవ్‌లో నా మీద ఫిర్యాదులు పంపించారు. పిర్యాదులు, సోషల్ మీడియా వార్తలతోనా రాజీనామాను పెద్దలు ఆమోదించారు. గోషామహల్‌లో ఉప ఎన్నిక రాదు. నేను పార్టీకి రాజీనామా చేశాను, ఎమ్మెల్యేగా రాజీనామా చేయలేదు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అక్కడ ఉప ఎన్నిక జరగకుండా ఇక్కడ ఎలా జరుగుతుంది. ఉప ఎన్నిక వస్తుందని కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పాత బట్టలు



ఐరన్ చేసుకొని తిరుగుతున్నారు. కొందరు మా పార్టీ వాళ్లు కూడా తిరుగుతున్నారు. మూడేళ్లు ఎమ్మెల్యేను నేనే. మా పెద్దవాళ్లు పిలిస్తే ఢిల్లీ వెళ్లి మాట్లాడుతాను. అన్ని విషయాలు పార్టీకి చెబుతాను. చాలా మంది పార్టీనీ ఎందుకు విడిచి వెళ్లరు, ఇతర పార్టీల నుండి వచ్చిన వారు అవమానాలు ఎందుకు భరిస్తున్నారు.. ఇవన్నీ చెబుతాను. ఇవాళ లేకపోతే రేపు అయినా పిలుస్తారు అని అనుకుంటున్నా' అని ఎమ్మెల్యే రాజా సింగ్ తెలిపారు. నేను బీజేపీ హై కమాండ్‌ను కలిసేందుకు ప్రయత్నం చేస్తున్నాను. పార్లమెంట్ ఎన్నికల తర్వాత మా అధిష్ఠానం పిలుస్తుందనే నమ్మకం ఉంది. వేరే పార్టీలో ఉండలేను, ఆ పార్టీలకి నేను మ్యాచ్ కాను. బీజేపీ నా ఇల్లు, రాజా సింగ్ రా అంటే వెంటనే పార్టీ లోకి వెళ్లిపోతాను. నా వెనుక ఎవరు లేరు. గతం లో 14 నెలలు బీజేపీ నుండి సస్పెండ్ అయ్యాను. నా శత్రువులు పార్టీలో ఉన్నారు, ఇతర పార్టీలో కూడా ఉన్నారు. నేను ఏ పార్టీలోకి వెళ్లినా ఆ పార్టీకి నష్టమే. టీ-డీపీ, శివసేన, జనసేన ఈ మూడు పార్టీలు మా అలియన్స్ పార్టీలే. ధర్మ ప్రచారం, నియోజకవర్గం ప్రజలే ఈ రెండే నా ముందున్న అంశాలు. నా లాంటి వాళ్ళు వస్తారు పోతారు, బీజేపీ ఉండాలి. తెలంగాణలో ఉన్న వారికి ఇవాళ కాకున్న రేపు అయినా బుద్ధి వస్తుంది. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుంది' అని ఎమ్మెల్యే రాజా సింగ్ ధీమా వ్యక్తం చేశారు.

# సంపాదకీయం..

# పులుల సంరక్షణతోనే జీవ వైవిధ్యం !



దేశంలో పర్యావరణంపై ఆసక్తి, శ్రద్ధ లేకుండా పోతోంది. మానవజాతి పెరుగుతున్నా కొద్దీ పక్కనున్న ప్రకృతిని, పర్యావరణాన్ని ధ్వంసం చేస్తున్నారు. అడవులను నరికివేస్తూనే..అడవుల్లోని జంతుజాలాన్ని కూడా ఉనికి లేకుండా చేస్తున్నారు. దీంతో ఇప్పటికే అనేక జంతుజాతులు నశించాయి. మనం బతికితే చాలు...మిగతా ఏమయితే ఏమిటన్న ధోరణి ప్రబలింది. ఈ క్రమంలో అడవుల విధ్వంసంతో జంతుజాలం నశిచింది. ప్రపంచవ్యాప్తంగా విచక్షణారహితంగా అడవుల నరికివేత, అక్రమంగా పులులను వేటాడడం లాంటి పలు కారణాలతో పులి జాతి అంతరించే స్థాయికి చేరడాన్ని గమనించిన ఐరాస ప్రతి ఏట 29 జులై రోజున 'అంతర్జాతీయ పులుల దినం లేదా ఇంటర్నేషనల్ టైగర్ డే' పాటించడం ఆనవాయితీగా మారింది. 2010 నుంచి ఇది అమల్లోకి వచ్చింది. పులులను కాపాడుకోవడం, వాటి ఆవాసాలను సంరక్షించుకోవడం, అక్రమ వేటలను మానుకోవడం, జీవ వైవిధ్యాన్ని కాపాడే ప్రాధాన్యాన్ని వివరించడం, టైగర్ ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం చేయడం, టైగర్ రిజర్వులను నియంత్రించడం లాంటి అంశాల్లో సామాన్య జనాలకు అవగాహన కల్పించడానికి ఈ వేదికలను ఉపయోగించుకోవాలి. పిల్లుల జాతిలో అతి పెద్ద జంతువుగా పులికి పేరుంది. 2025 అంతర్జాతీయపులుల దినం ఇతివృత్తంగా మానవులు, పులులు సామరస్యంగా సహజీవనం చేయడం అనే అంశాన్ని తీసుకొని పులుల సంరక్షణ బాధ్యతలను వివరించడం జరుగుతుంది. ఇటీవల ఆదిలాబాద్ కవ్వాల్ రక్షణకు జివో 49ని తెలంగాణ ప్రభుత్వం తీసుకుని వచ్చింది. కానీ అందరూ ఒక్కటై దానిని అమలు చేయకుండా పక్కన పెట్టేయించారు. ఇది అమలు చేయడం ద్వారా పులుల సంరక్షణకు ప్రభుత్వం పూనుకుంది. కానీ గిరిజనుల జీవనానికి ఇది అడ్డంకిగా మారిందన్న ఆందోళనతో పులుల రిజర్వ్ ఫారెస్ట్ రోణ పక్కకు పోయింది. నిజానికి ఇది ప్రజల్లో అవగాహన లేమి కారణంగా జరుగుతున్నదని వేరుగా చెప్పాల్సిన పనిలేదు. జీవవైవిధ్యం కాపాడటంలో పులులదే కీలక పాత్ర. వాటికి తెలియకుండానే అడవిని రక్షిస్తుంటాయి. మొక్కలను తినే జీవ జాతులను పులులు చంపి తినకపోతే అడవి అనేదే మిగలదు.

అంటే...సాధు జంతువులను వేటాడుతూ...పులులు ఎకో సిస్టమ్‌ను బ్యాలెన్స్ చేస్తూ ఉంటాయి. అయితే రానురాను అడువులు ధ్వంసం అవుతుండటం వల్ల వీటి సంఖ్య తగ్గిపోతోంది. అవి మనుగడ సాగించేందుకు అవసరమైన అనుకూల వాతావరణం ఉండటం లేదు. క్రమంగా ఇవి అంతరించి పోయే ప్రమాదముందని గుర్తించిన ప్రపంచ దేశాలు, ఏటా జులై 29న అంతర్జాతీయ పులుల దినోత్సవం జరుపుకుంటున్నారు. ఒక పులి సంచరించే ప్రాంతం చుట్టు-పక్కల మరో పులి సంచరించదు. 25 నుంచి 30 కిలోమీటర్ల మేర ఒక పులి తన సామ్రాజ్యాన్ని విస్తరిస్తుంది. ఫుడ్ పిరమిడ్లో అగ్రస్థానంలో ఉండే పెద్ద పులి నివసించాలంటే ప్రాంతంలో చిన్నా, పెద్దా అన్నిరకాల జంతువులుండాలి. మంచి వర్షపాతం ఉండాలి. పచ్చని చెట్లతో కూడిన దట్టమైన అడవి ఉండాలి. అందుకే ఈ లెక్కన ఇప్పుడున్న పరిస్థితుల్లో పులులు. మనుగడ సాగించాలంటే...ఒక్కో పులికి 25 వేల ఎకరాల అడవిని కాపాడుకోవాల్సి ఉంటుందని శాస్త్రవేత్తలు తేల్చిచెప్పారు. పులి తన ప్రాణాలు కాపాడుకోవడానికి నానా తంటాలు పడుతుంది. మూడేళ్ల వయసు రాగానే మగ పులి సొంత సామ్రాజ్యాన్ని ఏర్పాటు-చేసుకునేందుకు ప్రయత్నిస్తుంది. అయితే అడవులు అంతరించడం. అడవుల్లో నీటి కుంటలు లేకపోవడం వల్ల అవి ఊళ్లలోకి రావాల్సి వస్తోంది. నగరాలు పెరగడం, గ్లోబలైజేషన్ ప్రభావంతో రానురానూ అడవులు తగ్గిపోతున్నాయి. ప్రస్తుతం 93 శాతం పులులు కేవలం అడవుల నరికివేత వల్ల అంతరించిపోతున్నాయని ఓ అధ్యయనంలో వెల్లడైంది. ప్రస్తుతం కేవలం ఆరు జాతుల పులులు మాత్రమే మనుగడ సాగిస్తున్నాయి. అనేక టైగర్ జాతులు పూర్తిగా అంతరించి పోయాయి. 2014 వరల్డ్ వైడ్ ఫండ్ లెక్కల ప్రకారం వందేళ్ల క్రితం సుమారు లక్ష పులులు ఉండేవి. కాని ఇప్పుడు వాటి సంఖ్య చాలా తగ్గిపోయిందని వరల్డ్ వైడ్ ఫండ్ ప్రతినిధులు చెబుతున్నారు. పులుల సంఖ్య పెరగడం ద్వారా ఎకో సిస్టమ్ లో మంచి మార్పులు రావడమే కాకుండా, పర్యాటక రంగం కూడా అభివృద్ధి చెందుతుంది. పులులు అంతరిపోవడానికి వేట, వాతావరణ మార్పులతోపాటు, పులులకు షెల్టర్ లేకపోవడం ముఖ్యమైన కారణాలు. అంతేకాకుండా పులి చర్మం, గోళ్లకు డిమాండ్ ఎక్కువ. చైనీస్ సంప్రదాయ వైద్యంలో పులుల గోళ్లు, పళ్లు,మీసాలను ఉపయోగిస్తారు. వాటి కోసం ఎక్కువ ధర చెల్లిస్తారు. అందుకే పులుల వేట, స్మగ్లింగ్ కూడా ఎక్కువైంది. దీంతో కేవలం పులులు మాత్రమే కాదు. ఇతర జీవులు కూడా మెల్లగా అంతరిస్తున్నాయి. కేవలం అడవుల్ని నరకడం వల్లనే దాదాపు 93 శాతం వాటి ఆవాసాల్ని కోల్పోతున్నాయని సర్వేలు వెల్లడిస్తున్నాయి. పులుల్ని, ఇతర జీవరాశు లని సంరక్షించుకోవాలంటే.. అడవులు పెంచడం ఒక్కటే మార్గమని అర్థం అవుతోంది. అడవులు పెంచడం ద్వారా జంతువుల సంఖ్య పెరగడమే కాక పర్యావరణ సమతుల్యం కూడా దెబ్బ తినకుండా ఉంటుంది. వాతావరణ మార్పులు కూడా జంతువులు అంతరించ డానికి కారణం కాబట్టి వాతావరణ మార్పులకు కారణమయ్యే ప్లాస్టిక్, కాలుష్యాన్ని కూడా తగ్గించాల్సిన అవసరం ఏర్పడింది. మనదేశంలో పులి జాతీయ జంతువు కాబట్టి కొంతవరకైనా పులుల్ని కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికైనా మేలుకోకపోతే ఉన్న నాలుగు జాతులు కూడా అంతరించిపోయే ప్రమాదం ఉందని గత కొన్నేళ్ల నుంచి -టైగర్ ట్రాకర్స్ వ్యవస్థను బలపరిచారు. ప్రపంచం మొత్తం మీద ఉన్న పులుల సంఖ్యలో సగానికి పైగా మనదేశంలోనే ఉన్నాయి. పులులను కాపాడుకోవల్సిన అవసరాన్ని మనదేశం ఎప్పుడో గుర్తించింది. 1972లోనే పులిని జాతీయ జంతువుగా ప్రకటించి, తర్వాతి ఏడాది నుంచే ప్రాజెక్ట్ -టైగర్ ను ప్రారంభించింది. పులుల్ని వేటాడే వారికి కఠిన శిక్షలు పడేలా చట్టాలు తెచ్చినా వాటి అంతం ఆగడం లేదు. వాటి సంరక్షణ కోసం భారీగా ఖర్చు చేస్తోంది. దేశంలో 48 పులి అభయారణ్యాలను ఏర్పాటు- చేశారు. పులుల సంరక్షణ గురించి ప్రజల్ని చైతన్యవంతం చేయడం కోసం ఇండియన్ రైల్వే.. టైగర్ ఎక్స్ ప్రెస్ పేరుతో టూరిస్ట్ రైలు సేవలను కూడా ప్రారంభించింది. ఇందులో బాంధవగడ నేషనల్ పార్క్, కన్హా నేషనల్ పార్కులో సఫారీకి తీసుకెళ్తారు.ప్రపంచ పులుల్లో 70 శాతానికి పైగా భారత్‌లోనే ఉండడం విశేషం. నేడు పులుల జనాభా వృద్ధి రేటు- 6.1 శాతంగా నమోదు అవుతున్నది. శతాబ్దం క్రితం ఒక లక్ష వరకు ఉన్న పులులు నేడు కేవలం 5,574 మాత్రమే ఉండడం విచారకరం. పులుల ఆవాసాలైన అడవులను నరికి వేస్తుండటంతో అవి మానవ ఆవాసాల్లోకి రావడం జరుగుతోంది.పులుల్లో చాలా అరుదైన జాతి రాయల్ బెంగాల్ -టైగర్.. దీన్ని పెద్ద పులి అంటారు. ఇది మన దేశం లో తప్ప ఇంకెక్కడా కనిపించదు. బెంగాల్ టైగర్ గాడ్రింపు సుమారు రెండు కిలోమీటర్ల వరకు వినిపిస్తుంది. ఇవి రోజుకు దాదాపు 21 కిలోల మాంసాన్ని తింటాయి. పులులు అడవిలో వాటి సరిహద్దులను అవే ఏర్పాటు- చేసుకుంటాయి. ఆ సరిహద్దులకు లోపల వున్న ప్రాంతమంతా వాటి సామ్రాజ్యమే. ఆ సరిహద్దులు దాటి ఏ ఇతర జంతువులు ప్రవేశించినా వాటికి మరణమే. ప్రతి రెండేళ్లకోసారి ఒక్కో ఆడ పులి రెండు నుంచి నాలుగు పిల్లల్ని పెడుతుంది. పులులు పుట్టిన 18 నెలల నుంచే వేటాడటం మొదలు పెడతాయి. ఇలా పులలను రక్షిస్తేనే అడవులు పెరుగుతాయి. జీవవైవిధ్యం పెరుగుతుందని గుర్తించాలి.

# "కులాలు కించపరిచే నాయకులు మనకు అవసరమా?"

స్వేచ్ఛ హక్కు ఉంది కదా అని అనుకుంటూ ఇష్టం వచ్చినట్లు మాట్లాడే స్వేచ్ఛ ఎవరికీ లేదు. అది మాటల స్వేచ్ఛ అనే హక్కు యొక్క దుర్వినియోగం మాత్రమే. మన రాజ్యాంగం ప్రతీ పౌరుడికి వ్యక్తిత్వాభివ్యక్తి స్వేచ్ఛను (freedom of speech and expression - Article 19(1)(a)) కల్పించిందనేది సత్యమే. కానీ అదే రాజ్యాంగం ఈ స్వేచ్ఛపై నిర్దిష్ట పరిమితులు కూడా విధించిందనేదీ మరచిపోవద్దు. ఇతరుల హక్కులను కించపరిచేలా, వారిని అవమానించేలా, సమాజంలో చిచ్చు పెట్టేలా మాట్లాడడం ఎట్టిపరిస్థితుల్లోనూ సమర్ధించదగినది కాదు. ముఖ్యంగా బీసీ, ఎంబీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలపై కులపరంగా, హీనంగా వ్యాఖ్యలు చేయడం నేరంగా కూడా పరిగణించబడుతుంది. ఇటువంటి వ్యాఖ్యలు చేసే వారు సాధారణ ప్రజలు అయితేనే తప్పు. కానీ ఉన్నత పదవుల్లో ఉండే రాజకీయ నాయకులు ఇలా వ్యవహరించటం అనేది మరింత బాధాకరమైన విషయం. ఎందుకంటే వాళ్లు ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రతినిధులు, ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన వారు. ఒక ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రి స్థాయి వ్యక్తి తన పదవిని వాడుకొని కులాలు, వర్గాలపై కించపరిచేలా మాట్లాడితే అది కేవలం అసభ్యతే కాదు - అధికార దుర్వినియోగం కూడా అవుతుంది.ప్రతీ రాజకీయ నాయకుడు ఏ వర్గానికి చెంది ఉన్నా, అన్ని వర్గాల ప్రజలను గౌరవించాల్సిన బాధ్యత అతనిపై ఉంటుంది. కానీ కొన్ని సందర్భాల్లో, ముఖ్యంగా ఎన్నికల సమయంలో లేదా రాజకీయ లబ్ధి కోసం, కొందరు నాయకులు చర్చకు వస్తానని భావించి, చింపిన చందంగా మాట్లాడుతున్నారు. "కింది కులాలు" అన్న పదమే కులాన్ని తక్కువగా చూసే దృష్టిని ప్రతిబింబిస్తోంది. ఈ విధంగా మాట్లాడటమంటే మన దేశం కలలు కన్న సామాజిక న్యాయాన్ని, సమానత్వాన్ని తాకట్టు పెట్టడమే.

ఇలాంటి వ్యాఖ్యలు చేయడమంటే అణగారిన వర్గాల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీయడమే కాదు, చట్టపరంగా కూడా శిక్షార్హమైనదే. భారత శిక్షాస్మృతిలో (IPC) 153A, 295A వంటి సెక్షన్ల ప్రకారం, సామాజిక శ్రేణుల మధ్య విద్వేషాన్ని రెచ్చగొట్టేలా మాట్లాడటం నేరం. అటువంటి వారిపై కేసులు నమోదు చేయడం, ఆ పదవుల నుండి తొలగించడం కూడా అవసరం.అంతేకాదు, ఇలాంటి వ్యాఖ్యలు చేస్తూ, ప్రజలను గందరగోళంలో పడేసే నాయకులు ప్రజల సమస్యలను పట్టించుకోకుండా, అసలు దిశను మళ్లించేందుకు ప్రయత్నించేవారు. కులాలను మనదగ్గర ఆయుధంలా వాడుకోవడం, వారిపై ద్వేషాన్ని రగిలించడం అనేది రాజకీయంగా లాభదాయకమైతే తప్ప సమాజపరంగా చాలా ప్రమాదకరం.స్వేచ్ఛ అనే హక్కు మనకుంది. కానీ అదే హక్కును వాడుకుంటూ ఇతరుల గౌరవాన్ని తుడిచేస్తే, అది స్వేచ్ఛ కాదే. అది చట్ట విరుద్ధం. బీసీ, ఎంబీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలపై కించపరిచే వ్యాఖ్యలు చేసే రాజకీయ నాయకులపై చట్టపరంగా, సమాజపరంగా తగిన శిక్షలుంటేనే ప్రజాస్వామ్యానికి గౌరవం నిలుస్తుంది. నాయకులు బాధ్యతతో మాట్లాడటం, పదవుల్ని ఆ పదవులకు తగిన విలువలతో నిర్వహించడం అత్యంత అవసరం. ఇదే నిజమైన ప్రజాస్వామ్య నైతికత.

## ఇంకా అసలు విషయానికొద్దాం:

ప్రజాస్వామ్య దేశంలో ముఖ్యమంత్రి పదవి గౌరవనీయమైనది. ఈ పదవి బాధ్యతలతో కూడినది. ప్రతి వర్గాన్నీ సమానంగా చూడడం, సామాజిక సౌహార్దం పరిరక్షించడం ఒక నాయకుని ధర్మం. కానీ, చాలామంది రాజకీయ నాయకులు చిన్న కులాలను పట్టుకొని కించపరుస్తూ ఉంటారు. మొన్న జరిగిన ఉమ్మడి మహబూబ్నగర్లో జరిగిన సభలోమాట్లాడుతూ ఇలాంటి వాక్యాలు ముఖ్యమంత్రి పదవిలో ఉన్నవ్యక్తి "సాకలోడు",బట్టలు ఉతికేటాయనను ఎమ్మెల్యేగా చేసినం, చేపలు పట్టే ఆయనను ఎమ్మెల్యేగా చేసినం,. వంటి పదజాలం వాడితే అది సామాజికంగా ఎంత ప్రమాదకరమో ప్రతి ఒక్కరు ఆలోచించాల్సిన సమయం ఇది. ఇది కేవలం రాజకీయ విమర్శకులకు విషయంగా కాక, సామాజిక న్యాయానికి భంగంగా కూడామారుతుంది.సామాజిక న్యాయంలో ఆర్థిక, ఉద్యోగ, విద్య, సామాజిక రాజకీయ భారత రాజ్యాంగం కల్పించిన హక్కు, భారత రాజ్యాంగం ప్రకారమే కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం నడుస్తుంది, ఇది ముఖ్య మంత్రి తెలవదా...!ఒకప్పుడు రేవంత్ రెడ్డి గోడలపై గీతలు గీసే స్థితిలో ఉన్న వ్యక్తి. తాను చెప్పుకున్న రాజకీయ ప్రయాణంలో అనేక కులాల సహకారం వల్లే ఎదిగారు. కానీ అధికారం వచ్చింది కాబట్టి,ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం ఏమిటి? గతంలో ప్రజల మద్దతు కోసం వినయంగా మాట్లాడిన నాయకుడు, నేడు ఎంబీసీ (మోస్ట్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్) పై వివక్ష చూపుతున్నారా?వారు గతంలో బహిరంగ సభల్లో "ఒకే కులానికి చెందినవారు రాయలసీమను ఏలుతున్నారు" అని విమర్శించేవారు. 75 సంవత్సరాల యొక్క బీసీ ముఖ్యమంత్రి కూడా కాలేని పరిస్థితి,ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి నేడు అధికారంలోకి వచ్చాక, తనకంటే వెనుకబడిన సామాజిక వర్గాలపై అహంకారంగా మాట్లాడుతున్నారంటే అది ప్రజాస్వామ్యానికి శాపంగా మారుతుంది.దేశానికి ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే - ఒక దళిత నేత. ఆయన దశాబ్దాలుగా పార్టీకి అంకితంగా పని చేస్తున్నారు. రాహుల్ గాంధీ ప్రజల మధ్య సునీతంగా, సమానత్వంతో మెలగాలని చెప్పే నాయకుడు. అలాంటి పార్టీలో తెలంగాణ ముఖ్యమంత్రి ఇలా కులాలకు లబ్ధికరంగా వ్యవహరించడం చూసి, సామాన్యుల ప్రశ్న ఇదే - కాంగ్రెస్ పార్టీ ఇదే దిశగా నడుస్తుందా? ప్రజాస్వామ్యంలో ముఖ్యమంత్రి అనే పదవి గౌరవానికి ప్రతీక. ప్రజలు ప్రత్యక్షంగా ఓటు వేసి ఎమ్మెల్యేలను ఎన్నుకుంటారు. ఆ ఎమ్మెల్యేలు తమలో ఒకరిని నేతగా ఎంచుకుని ముఖ్యమంత్రిని ఏర్పరుస్తారు. ఇందులో పార్టీల ప్రాధాన్యత ఉన్నా, అంతిమ నిర్ణయం ప్రజల ఆధారంగా మలచబడుతుంది. అలాంటి వ్యవస్థలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల ఒక మీటింగ్‌లో మాట్లాడుతూ "నేను రాహుల్ గాంధీ దగ్గర ఉద్యోగం చేస్తున్నాను" అని చెప్పడం విచారకరం మాత్రమే కాదు, ప్రజాస్వామ్య పరంగా ప్రమాదకరం కూడా.

ఈ వ్యాఖ్య మూడు ప్రధానమైన సందేహాలకు, ఆవేదనలకు దారితీస్తోంది.ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేస్తున్న వ్యక్తి "నేను రాహుల్ గాంధీ దగ్గర ఉద్యోగం చేస్తున్నా" అని చెప్పడం తన నియామకాన్ని ప్రజలు చేసినదిగా కాకుండా, ఢిల్లీకి చెందిన నాయకుడి అనుగ్రహంగా చాటడమే. ఇది ప్రజల తీర్పును అవమానించడమే కాక, వారి అంకితభావాన్ని తక్కువ చేసే ప్రకటన. ప్రజలు గౌరవించి, నమ్మకంతో ఇచ్చిన ఓటును "ఒక నాయకుడి ఉద్యోగంగా" అభివర్ణించడం రాజ్యాంగ సంకల్పానికి విరుద్ధంగా ఉంటుంది.ఇలాంటి వ్యాఖ్యల వల్ల రాష్ట్ర పాలన స్వతంత్రంగా జరిగే అవకాశాలు తగ్గిపోతాయి. సీఎం ఒక పార్టీ అధినేతకే అనుకూలంగా వ్యవహరిస్తున్నట్లు బాహ్యప్రపంచానికి సంకేతమిస్తోంది. రాష్ట్ర ప్రయోజనాలకన్నా పార్టీ ఆదేశాలే ముందు ఉండే ప్రమాదం ఉంది. ముఖ్యమంత్రి ఒక రాష్ట్రానికి సేవ చేయాల్సిన వ్యక్తి కానీ, పార్టీ అధినేతకు జీతగాడు కాదు. ఆ భావజాలం ప్రజలకు స్పష్టంగా ఉండాలి.రాజకీయాల్లో నాయకత్వం అనేది స్వతంత్రంగా పని చేయగల సామర్థ్యంతో రావాలి. కానీ ఈ తరహా వ్యాఖ్యల ద్వారా వ్యక్తిగతంగా, స్వతంత్రంగా పాలించగల నాయకత్వం లేనట్టు అర్థమవుతోంది. ఒక పార్టీ అధినేత చెప్పినదే శాసనంగా అనుకోవడం నాయకుడి స్వాతంత్ర్యాన్ని, రాష్ట్ర ప్రయోజనాలను పక్కన పెట్టినట్టే. ఒక ముఖ్యమంత్రి పదవికి వచ్చిన వ్యక్తి, తనను ప్రజలు ఎన్నుకున్నారని గుర్తించాలి. ఎవరైనా పార్టీ అధినేతలకు గౌరవం ఇవ్వొచ్చు కానీ, ఆ గౌరవాన్ని ప్రజల తీర్పుపై ఉంచడం సరికాదు. ప్రజలు ఒక నాయకుడిని ఎన్నుకోవడమంటే అది పార్టీ అధినేత దయ వల్ల జరిగినది కాదు. అది ప్రజల విశ్వాసంతో, ప్రజాస్వామ్య విధానాలతో ఏర్పడినదని గుర్తించాలి. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు పునరాలోచనకు గురయ్యేలా ఉండాలి. ప్రజల తీర్పును గౌరవించకుండా, పార్టీ అధినేతల దయను ప్రధానంగా చూపడం ప్రజాస్వామ్య పరిపాటికి మచ్చగా నిలుస్తుంది. ముఖ్యమంత్రి అనే పదవిలో ఉన్నవారు మాటల విషయంలో మరింత బాధ్యతగా ఉండాలి. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన వ్యక్తి, పార్టీకి మాత్రమే విధేయత చూపినట్లుగా కనిపిస్తే అది ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తుంది. రాహుల్ గాంధీకి అనుబంధం వ్యక్తిగతంగా ఉండవచ్చు, కానీ ప్రభుత్వపరంగా "ఉద్యోగం" అన్న పదం ప్రజాస్వామ్య పాఠశాలలో ఎక్కడికీ సరిపోదు. ఇక జీతగాడు అనే పదం ఈ దేశంలోని లక్షలాది మంది ఉద్యోగులను కించపరిచేలా మారుతుంది. అధికార పీఠంపై ఉన్న నేతలు ప్రజల అంచెలలో నుంచి వచ్చి అధికారిక పదవుల వరకూ చేరితే గర్వించాలి కానీ, ఆ నేపథ్యాలనే అపహాస్యం చేస్తే అది రాజకీయ సంస్కృతి భ్రష్టతకే సంకేతం. ప్రజాస్వామ్యంలో ప్రతి వ్యక్తి సమానమైన అవకాశాలను పొందాలనే నిబంధన రాజ్యాంగం అందించింది. కానీ రేవంత్ రెడ్డి మాటల్లో కనిపిస్తున్న "ఆధికవర్గపు గొప్పదనం", "వెనుకబడినవారిని తక్కువగానే చూడటం" అనే దృక్పథం మనువాద రాజకీయాన్ని ప్రతిబింబిస్తోంది.

ఈ దృష్టికోణం బహుజన వర్గాల ఉనికి, హక్కులపై నేరుగా దాడి చేస్తుంది. ఇది కేవలం ఒక నాయకుడి తప్పిదం కాదు, కాంగ్రెస్ పార్టీ పాలనా ధోరణిని ప్రతినిధి చేసే స్థాయిలో మారుతుంది. ఇది తక్షణమే కండెం తొక్కాల్సిన వ్యాఖ్యలు. మల్లికార్జున ఖర్గే , రాహుల్ గాంధీ స్పందించాల్సిన అవసరం ఉంది. తెలంగాణలో కాంగ్రెస్ అధికారం చేపట్టినప్పుడు ప్రజలకు ఇచ్చిన హామీలు - ఉద్యోగాలు, రైతు సంక్షేమం, ఎస్సీ, ఎస్టి -బీసీ మైనార్టీ హక్కుల పరిరక్షణ. కానీ ముఖ్యమంత్రి ఇలా మాట్లాడుతుంటే పార్టీ మౌనంగా ఉండడం, అధికారాన్ని పార్టీ కన్నా ఒక వ్యక్తి మరిష్టంగా మలచుకోవడం మంచిది కాదు.

పార్టీలోని ఇతర నేతలు కూడా స్పందించకపోవడం, పార్టీకి నమ్మకంగా పనిచేసిన వర్గాలను నిరాశపరచడం జరుగుతోంది. ఇది పార్టీలో అసహనం పెరగడానికి, భవిష్యత్ ఎన్నికల్లో నష్టానికి దారితీయడానికీ కారణమవుతుంది.ఇప్పటికే సామాజిక మాధ్యమాల్లో రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై తీవ్ర ప్రతిక్రియ ఉంది. అన్ని వర్గాల ప్రజలు ఈ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది నేతలు బహిరంగంగా విరోధిస్తున్నారు. ఇది కేవలం విమర్శల స్థాయిలో ఉండక, పార్టీపై విశ్వాసాన్ని పునఃపరిశీలించే స్థాయికి చేరుతోంది.ప్రజలు నెమ్మదిగా అర్థం చేసుకుంటున్నారు - ఎవరు మాటలతో ప్రజలను విభజిస్తున్నారు, ఎవరు నిజంగా అందరినీ కలుపుకుంటున్నారు. ఈ చైతన్యమేరేపటిపాలకులనునిర్ణయిస్తుంది.

ప్రజాస్వామ్యంలో నాయకులు మాటల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యమంత్రి పదవి సొంత ఆస్తి కాదు. అది ప్రజల విశ్వాసంతో ఏర్పడిన బాధ్యత.కులాలను కించపరచడం, మాటలతో బాధ కలిగించడం, మనువాద ధోరణిలో పాలన చేయడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే. కాంగ్రెస్ పార్టీకి, దాని నేతలకు ఇది చివరి హెచ్చరిక కావచ్చు. ప్రజలు ఇప్పుడు ఎంతో చైతన్యంగా మారిపోయారు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడే నాయకులను తిప్పికొట్టే శక్తి ప్రజలకే ఉంది.ఒక ముఖ్యమంత్రికి మర్యాద ఉండాలి, మాటలకు గౌరవం ఉండాలి, మాటల్లో సమానత్వం ఉండాలి - అదే ప్రజల మెప్పు పొందే మార్గం.ఇకనైనా బీసీ కులాలు, ఎంబీసీ (మోస్ట్ బ్యాక్‌వర్డ్ క్లాస్) కులాలు తమ భవిష్యత్తును ఓటు ద్వారా నిర్ణయించాల్సిన సమయం ఆసన్నమైంది. ఎన్నాళ్లుగానో వారి నమ్మకాన్ని రాజకీయ పార్టీలు, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ, మాటలు చెప్పి మోసం చేస్తూ వచ్చాయి. బీసీలు, ఎంబీసీలు - అనేక తరం నుంచి వెనుకబడిన స్థితిలో ఉండి, తాము ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాల కంటె ఎక్కువగా ఓట్లకే ఆశ పెట్టుకున్నారు. కానీ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఎన్ని హామీలు ఇచ్చినా, అవన్నీ మాటలకే పరిమితమయ్యాయి. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీసీ, ఎంబీసీ ఓటర్లతో పలు వాగ్దానాలు చేసింది. సొంతంగా ఓ బీసీ నాయకుడిని ముఖ్యమంత్రి చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఆశలు పుట్టించారు, ఎంబీసీలకు ప్రత్యేక చట్టాలు చేస్తామని, ఎస్సీ ఎస్టీ, బీసీ ఎంపీసీ మైనార్టీ వర్గాల వారీగా రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పింది. కానీ అధికారంలోకి వచ్చాక ఆ హామీలు బహుశా పక్కన పెట్టబడ్డాయి. సామాజిక న్యాయం పేరుతో ఓసి కులాలకే అధికారాన్ని కట్టబెట్టిన కాంగ్రెస్, మిగిలిన బీసీ, ఎంబీసీ, మైనార్టీ తో పాటు సామాజిక వర్గాలను దూరంగా నెట్టేసింది. ఇది చరిత్రలో కొత్త విషయం కాదు. గతంలోనూ ఇదే పార్టీ అధికారం లోకి వచ్చి బీసీలను ఉపయోగించుకుంది. ఇప్పుడు కూడా అదే తంతు తిరగబెట్టింది.ప్రస్తుతం రాష్ట్రంలోని స్థానిక సంస్థల ఎన్నికలు దరిచేరుతున్నాయి. ఈ సందర్భంగా బీసీలు, ఎంబీసీలు తమ ఓట్ల ద్వారా స్పష్టమైన సందేశాన్ని ఇవ్వాలి. ఎన్ని అబద్ధాలు చెప్పినా, ఎన్ని హామీలు ఇచ్చినా - వాటి అమలే అసలైన పరిపాలన ప్రమాణం. ఒక్కొక్కసారి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు పెద్ద పార్టీలకు అవకాశమిస్తారు, కానీ స్థానిక సంస్థల ఎన్నికల్లో మాత్రం సామాజిక న్యాయానికి తగినదైన తీర్పు ఇచ్చే అవకాశం ఉంటుంది. స్థానిక సంస్థల ఓట్లు ప్రజల ఆక్రోశాన్ని వ్యక్తపరచడానికి ముఖ్యమైన మార్గం.బీసీలు, ఎంబీసీలు ఈసారి తగిన బుద్ధి చెప్పకపోతే, రేపటి తరం కూడా ఇదే అవమానాలను అనుభవించాల్సి వస్తుంది. తాము ఎంతో మంది జనాభాతో, ఎంతో శ్రమతో, ఎంతో పట్టుదలతో ఉన్నా ం రాజకీయంగా గుర్తింపు రాకపోతే, దాని బాధ్యత కూడా కొంతవరకు తమదే. రాజకీయం మాటలతో నడవదు. వాటికి తగిన జవాబు ఇచ్చే సమయం ఇప్పుడు వచ్చింది.

ఒకవేళ ఎంబీసీ వర్గాలు కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేస్తే, దాని ప్రభావం అన్ని స్థాయిల్లో ఉంటుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి అప్రతిష్ట, అధికార నష్టమూ తప్పదు. ఈ సంకేతం పార్టీని కుదిపేస్తుంది. అప్పుడు మాత్రమే ఈ పార్టీకి తమ తప్పులు అర్థమవుతాయి. ఇది కేవలం ప్రతీకార ఓటు కాదు ం ఇది గౌరవం కోసం, సమానత్వం కోసం పోరాడే ఓటు. ఇది మాటలకే పరిమితమైన పాలకులను నిషేధించడానికి, సామాజిక న్యాయాన్ని పట్టించుకునే నాయకులను ప్రోత్సహించడానికి వేసే ఓటు.

తుది మాటగా చెప్పాలంటే - బీసీ, ఎంబీసీ వర్గాలు ఇప్పటికైనా చైతన్యం పొందాలి. మాటలతో మభ్యపెట్టి, పదవులు పంచి కొన్ని కుటుంబాలను ప్రోత్సహించి, మిగిలిన ప్రజలను అవమానపర్చే వ్యవస్థను ఇక తట్టుకోకూడదు. స్థానిక సంస్థల ఓటు అనేది సాధారణమైన అంశం కాదు. అది తమ గళాన్ని వినిపించేందుకు, తమ బాధలను వెల్లడించేందుకు, తమ ఆకాంక్షలను సూచించేందుకు ఉపయోగపడే శక్తివంతమైన ఆయుధం. దాన్ని వినియోగించి ం ఇకపై ఏ పార్టీ అయినా బీసీలను, ఎంబీసీలను మోసం చేయకుండా చూసే పరిస్థితి తీసుకురావాలి. ఇది సమాజ మార్పు దిశగా బీసీ ఓటర్ల మొదటి అడుగు కావాలి.



మన్నారం నాగరాజు

# తెలుగు సాహిత్యంలో సినారే ఒక ధ్రువతార

**హైదరాబాద్ వెలుతురు జూలై 29:**
తెలుగు భాషా చైతన్య సమితి ఆధ్వర్యంలో నల్లకుంట లోని శ్రీధర్ ప్లాజాలో డాక్టర్ సి నారాయణ రెడ్డి గారి 94వ జయంతిసందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ కవిరామకృష్ణ చంద్రమౌళి మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో సినారె ఒక ధ్రువతార ఆయన అన్ని ప్రక్రియలలో అందవేసిన చేయి తెలుగు సాహిత్యంలో ఎందరో మహానుభావులు కవులు రచయితలు ఉన్నారుగాని నారాయణరెడ్డి కి ప్రత్యేకత స్టైల్ ఆయన మానవతావాది సమన్వయం కలిగే వ్యక్తి ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్ గా ఉన్నప్పుడు అటు పాటలు ఇటు పాటలు చెప్తున్నప్పుడు వీసీ ఒక సందర్భంలో పిలిపించి మీరు పాటలు రాస్తారా పాఠం చెప్తారా అంటే వీసీ కి ఒకే మాట చెప్పారు నేను పాటలు రాస్తాను పాఠాలు చెపుతాను



ఇది నా నైజం అని వీసీ గారికి సమన్వయంతో ఒప్పించిన మహాధీరుడు డాక్టర్ సి.నారాయణరెడ్డి నేటి తరం రచయితలు ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ఎన్నో రచనలు తీసుకురావాలని ఆయాలని వారు కోరారు మరో అతిథి గంట మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ఆయన రాసిన గీతాలలో వందేమాతరం గీతం నేటికీ శిరస్థాయిగా ఉంటుంది ఆ ఒక్క గీతమే కాదు అన్ని గీతాలు కూడా నేటి మదిలో మనుషుల్లో నిలిచె గీతాలు ఆయనవి తెలుగు భాషా చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షులు బడే సాబ్ గారు మాట్లాడుతూ డాక్టర్ సి.నారాయణరెడ్డి గారిది ఆయన పుట్టుకతోనే పాటలతో లయతో ఉన్న వ్యక్తి కాబట్టి ఆయన ఏ పాట రాసిన ఏ కావ్యం రాసిన లయాత్మకంగా ఉంటుంది కాబట్టి తెలంగాణలో సినారే లాంటి రచయిత ఇక తెలుగు సాహిత్యంలో అరుదుగా కనపడతారు పాలడుగు సరోజినీ దేవి మాట్లాడుతూ సినారే గారి గీతాలు నేటికీ స్థిరస్థాయిగా ఉంటాయని ఉంటాయని ఆమె అన్నారు

## రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల కోసం చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహించడాన్ని హర్షిస్తున్నాం.

**- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్**



**హైదరాబాద్ వెలుతురు జూలై 29:**
మొన్న జరిగిన తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ ప్రకటించడానికి స్వాగతిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ అన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి చెందిన పార్లమెంట్ సభ్యులు ఆగస్ట్ 5న వాయిదా తీర్మానాన్ని,ఆగస్టు 6న ఢిల్లీలోని జంతర్ మంతర్ ముందు ధర్నా,ఆగస్టు 7న బీసీ రిజర్వేషన్లు పెంచాలని రాష్ట్రపతిని కలుస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని బీసీ సంఘాలుగా హర్శిస్తున్నామని అన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం పార్టీలకతీతంగా కులాలకతీతంగా బీసీలంక ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి యువజన పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు బూర శ్రీనివాస్ బీసీ విద్యార్థి సంఘం ఓయూ ఇన్చార్జి గోదా రవీందర్ పాల్గొన్నారు.

## కో లివింగ్ హాస్టళ్లకు రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలి

- జాజుల లింగం గౌడ్



**హైదరాబాద్ వెలుతురు జూలై 29:**
కో లివింగ్ కల్చర్ హైదరాబాద్ నగరం మొత్తం వ్యాప్తిచెందక ముందే రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.విదేశీ సంస్కృతి అయిన కో లివింగ్,రూం షేరింగ్ రూమ్ ఢిల్లీ, గుర్గావ్, ముంబై, పుణె, బెంగళూరు, చెన్నైలకు విస్తరించిన ఈ కల్చర్ నేడు హైదరాబాదులోని సాఫ్ట్ వేర్ సంస్థలు ఉండే ప్రాంతాలైన మాదాపూర్,హైటెక్ సిటీ,కొండాపూర్,జూబ్లీహిల్స్, బంజారా హిల్స్,గచ్చిబౌలి, రాయదుర్గం కెపిహెచ్బి వంటి ప్రాంతాలకు పాకిందనీ చాపకింద నీరులా విస్తరిస్తోన్న ఈ కల్చర్ ను ప్రస్తుతం అడ్డుకట్ట వేయకపోతే భవిష్యత్తులో తీవ్ర చెడు పరిణామాలు ఎదురుకోవాల్సి వస్తుందన్నారు.యువతీ యువకులను ఆకర్షించేందుకు కో-లివింగ్ హాస్టళ్ల యజమానులు లగ్జరీ సౌకర్యాలను ఆఫర్ చేస్తున్నారనీ బెడ్స్, టీవీ, ఫ్రిజ్, ఏసీ, వైఫై, వాషింగ్ మెషీన్, మినలర్ వాటర్, కిచెన్ లాంటి సెటప్ తో పాటు ఫర్నీచర్, స్విమ్మింగ్ పూల్ వంటి వాటిని కూడా అందిస్తున్నారు.కో లివింగ్ అనేది మన దేశ సంస్కృతికి సరైనది కాదన్నారు.

హిమాయత్ నగర్ డివిజన్ లో

## దోమలు సంబంధించిన వ్యాధుల గురించి స్థానికులకు వివరంగా తెలపడం జరిగింది

**- కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్**




**హైదరాబాద్ వెలుతురు జూలై 29:**
మంగళవారం రోజున హిమాయత్ నగర్ డివిజన్లోని ఓల్డ్ కమేల బషీర్బాగ్ అవంతి నగర్ మరియు ఇతర ప్రాంతాలలో దోమలు సంబంధించిన వ్యాధుల గురించి స్థానికులకు వివరంగా తెలపడం జరిగింది మరియు వాటి నుంచి రక్షణ పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రవికిరణ్, డి ఎం సి మారుతి దివాకర్, ఏ ఎం హెచ్ ఓ హేమలత, హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ మరియు ఇతర మున్సిపల్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## కాశీ విశ్వేశ్వరుని దర్శనం, స్మరనంతో ముక్తి

**- ప్రముఖ ఆధ్యాత్మి కవేత్త, వక్త డాక్టర్ అనంతలక్ష్మి**



**వెలుతురు, హైదరాబాద్ 29 జూలై :**
శ్రీకాశి విశ్వేశ్వరుని దర్శనం, స్మరిం చుకోవడంతో మనకు ముక్తి లభి స్తుందని ప్రముఖ ఆధ్యాత్మి కవేత్త, వక్త డాక్టర్ అనంతలక్ష్మి అన్నారు. శ్రీ కాశి విశ్వేశ్వ రుడు మనల్ని కరుణించే దైవం అని ఆయన సహస్ర నియమావళి ఆధ్యాత్మి కవేత్తలకు శక్తినా, ముక్తినా ప్రసాదిస్తాయ ని ఆమె పేర్కొన్నారు. శ్రీమానస ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో ప్రముఖ రచ యిత్రి కేహెచ్ఎస్ జగదంబ రచించిన "శ్రీకాశీ విశ్వేశ్వర నామావళి" పద్యరూ పకం పుస్తకావి ష్కరణ మంగళవారం హైదరాబాదులోనీ రామ్ నగర్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ అనం తలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై పు స్తకాన్ని ఆవిష్కరించి, ప్రసంగించారు. లయం, కారంలోనూ ప్రకాశించి అద్భుత శక్తి శ్రీకాశీ విశ్వేశ్వరుడనీ, ఆయనను దర్శ నం, స్మరణ ప్రసన్నం చేసుకోగలమని అన్నారు. రచయిత్రి జగదంబ పుస్తకాన్ని ఎంతో అద్భుతంగా అర్థ వివరంగా వివరించారని కొనియా డారు. ఈ సందర్భంగా రచయిత్రిని అతిథులు సత్కరించి అభినందనలు తెలిపారు. ప్రముఖ రచయిత్రి లయన్ డాక్టర్ బండారు సుజాత రాజశేఖర్ సభాధ్యక్షత ఈ కార్యక్రమంలో రచయిత్రి లయన్ డాక్టర్ పేకేటి గీత శివరాం, సూరి సీతారాం, సంస్థ అధ్యక్షులు బండా రుపల్లి రామచంద్రయ్య, లలితవా ణి, శ్యామల రావు, సంస్థ వ్యవ స్థాపక కార్యదర్శి రఘు శ్రీ తదిత రులు పాల్గొన్నారు.

## జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఎందుకు అమలు చేయటం లేదో
# నిరుద్యోగులకు ప్రభుత్వం సమాధానం చెప్పాలి

**- బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు లాలగారి జంగయ్య**

**మంచాల వెలుతురు జులై 29:**
మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో బి అర్ ఎస్ పార్టీ జిల్లా నాయకుడు లాలగారి జంగయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎంతో మంది నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలు లేక చాలి చాలని వేతనాలతో ప్రవేట్ ఉద్యోగం చేస్తూ మరి కొంత మంది నిరుద్యోగులు రోజువారి కూలి పనులు చేసు కుంటూ జీవనం సాగిస్తున్నారు అన్నారు తెలంగాణ రాష్ట్రంలోకాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపుగా రెండు ఏండ్లు కావస్తున్న నేటికీ ఆరు గ్యారంటీ ల సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో ఎక్కడ అమలు కాలేదని గుర్తు చేశారు పైగాకాంగ్రెస్ ప్రభుత్వం హయంలో జాబ్ క్యాలెండర్, ప్రకటించి ఇప్పడికి జాబ్ క్యాలెండర్ ఊసే లేదని ఇచ్చిన హామీలు అమలుచేసే దమ్ములేక ఉద్యమ కారులపై అక్రమ కేసులు బనహిస్తూ బిఆర్ఎస్,నాకుల పైవిమర్శలు చేస్తూ కాలం గడుపుతుందని ఏద్దేవాచేశారు జాబ్ క్యాలెండర్ ను ప్రకటించి ఇప్పడికి అమలు చేయకపోవడం నిరుద్యోగులతో ఈ ప్రభుత్వం చలగాటం ఆడుతుందని అన్నారువెంటనే జాబ్ క్యాలెండర్ అమలుచేయాలనీ కోరారు లేని ఏడల నిరుద్యోగులు తిరగబడాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు తెలంగాణ లో బి అర్ ఎస్ పార్టీ అధికారం లో ఉన్నప్పుడు నోటిఫికేషన్ లు ఏసీ ఎగ్జామ్స్ కూడ నిర్వహించడం జరిగగిందని



గుర్తుచేశారు వీటికి నియమాక పత్రాలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తాము నోటిఫికేషన్ లు ఇచ్చినట్టుగా ప్రచారం చేసుకోవడం కాంగ్రెస్ పార్టీ పాలనకు నిదర్శనం అని అన్నారు ఇప్పడికైనా జాబ్, క్యాలెండర్ ప్రకారం వెంటనే నోటిఫికేషన్లు వేయాలని కోరారు లేని ఏడల రానున్నకాలం లో నిరుద్యోగులు ఆగ్రహంచవిచూడాల్సి వస్తుందని అన్నారు ఎన్నికల్లో మీరిచ్చిన అమీలు అమలు చేసేంతవరకు ప్రతిపక్షంగా బిఆర్ఎస్, పార్టీ పోరాడుతుందని నోటిఫికేషన్ లు వేసే వరకు వదిలిపెట్టే ప్రసక్తేలేదని అన్నారు ఇప్పడికైనా జాబ్ క్యాలెండర్ ను వెంటనే అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

# స్థానిక సంస్థల ఎన్నికలలో గ్రామగ్రామాన బిజెపి జెండా ఎగరాలి

**- బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యుడు గోగిరెడ్డి లచ్చిరెడ్డి**

**మంచాల వెలుతురు జులై 29:**
మంచాల మండలం కేంద్రంలో బిజెపి మండల అధ్యక్షులు నూకం రాజుముదిరాజ్, ఆధ్వర్యంలో స్థానిక ఎన్నికల కార్యశాల జరిగింది ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోగిరెడ్డి లచ్చిరెడ్డి మాట్లాడుతూ ప్రజలు కాంగ్రెస్ పార్టీని కాంగ్రెస్, ప్రభుత్వాన్ని నమ్మలేకపోతున్నారని





ఇచ్చిన హామీలునిలబెట్టుకోలేక రోజుకు ఒక మాట చెబుతూ ప్రజలకు మోసం చేస్తున్నారని బిఆర్ఎస్ ఆచూకీ లేకుండాపోయింది. రాబోయేస్థానిక ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్రమోడీ అందిస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లి మంచాల మండలంలోని జడ్పిటిసి ఎంపీపీ గెలవడంతోపాటు ఎంపిటిసి మరియు సర్పంచులు ఎక్కువస్థానలు గెలవాలని అందరూ సమిష్టిగా కష్టపడి గడపగడప తిరిగి రాబోయే స్థానిక సంస్థలలో గెలిపే లక్ష్యంగా పనిచేయాలని కోరడం జరిగింది ఈకార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఇంజమూరి వెంకట్ రెడ్డి మాజీ వైస్ఎంపీపీ దాన్నే భాషయ్య మాజీమండల అధ్యక్షులు మారగోని శ్రీశైలం పాండాల జంగయ్య జిల్లా కౌన్సిల్ మెంబర్ చీవురాల పాండు పిఎసిఎస్, డైరెక్టర్ జనార్దన్ రెడ్డి యార రాజు యాట రమేష్, బిక్షపతి గౌరవెంకటేష్ మండల ప్రధాన కార్యదర్శులు జగదీశ్వర్ రెడ్డి కారింగు రాజుగౌడ్, జిల్లా మండల సీనియర్, నాయకులు నిట్టు పాండు, ఐలయ్య, పూర్ణ చంద్ వివిధ గ్రామల బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు

# కాళేశ్వరం నివేదిక సిద్ధం

**- సీల్డ్కవర్లో సిద్ధం చేసిన పిసి ఘోష్ కమిషన్**
**- త్వరలోనే ప్రభుత్వానికి సమర్పించే అవకాశం**

**హైదరాబాద్,జూలై29( వెలుతురు):**
కాళేశ్వరం కమిషన్ నివేదికను పీసీ ఘోష్ కమిషన్ త్వరలోనే ప్రభుత్వంకు ఇవ్వనుందని తెలుస్తోంది. ప్రస్తుతం కాళేశ్వరం కమిషన్ నివేదికను సీల్డ్ కవర్లో ఉంచారు. దాదాపు 500 పేజీలతో తుది నివేదికను కమిషన్ ఇవ్వనుంది. 3 వేల పేజీలతో మొత్తం డాక్యుమెంట్ను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఆగస్టు ఒకటి లేదా రెండో తేదీన నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి నివేదికను స్వీకరించి.. ప్రభుత్వానికి సమర్పించే అవకాశాలు ఉన్నాయి. కాళేశ్వరం ఎత్తిపోతల్లోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో చోటు-చేసుకున్న లోపాలు, వాటి ఆధారాలతో భారీ నివేదికను సిద్ధం చేశారు. కమిషన్కు ప్రభుత్వం ఇచ్చిన గడువు ఈ నెలాఖరుతో ముగియనుంది. నిబంధనలకు విరుద్ధంగా అధికారులు నిధులు విడుదల చేసినట్లు- పీసీ ఘోష్ కమిషన్ గుర్తించింది. విచారణ సందర్భంగా ఐఏఎస్ అధికారులు చెప్పిన అంశాలపై ప్రత్యేక ప్రస్తావన చేసింది. ఐఏఎస్, ఇంజనీర్లకు సమన్వయ లోపం ఉన్నట్లు- కమిషన్ గుర్తించింది. నాటి ప్రభుత్వ పెద్దలు నేరుగా క్షేత్రస్థాయి సిబ్బందితో సంప్రదింపులు చేయడంతో రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులకు సమాచారం లేకుండా పోయింది.



రికార్డుల నిర్వహణ సక్రమంగా లేదు. పూర్తిస్థాయి అనుమతులు లేకుండానే డిజైన్ల మార్పు చేసినట్లు- గుర్తించారు. డీపీఆర్ మార్పులు, మొదట్లో చెప్పిన డీపీఆర్, తర్వాత డీపీఆర్లో మార్పులు, నిధుల సేకరణ ఎలా జరిగిందో వివరించే అవకాశం ఉంది. హైలెవల్ కమిటీ- అనుమతి లేకుండానే బడ్జెట్ రిలీజ్ గుర్తించింది. మూడు బ్యారేజీలకు సంబంధించిన ఆర్థిక పరమైన అంశాలను వేరువేరుగా పొందుపర్చింది. అధికారుల తప్పిందం అంశాలపై లీగల్ అంశాలతో సిఫార్సు చేసింది. బహిరంగ విచారణ సందర్భంగా సాక్షులు ఇచ్చిన స్టేట్మెంట్ ఆధారంగా పీసీ ఘోష్ కమిషన్ నివేదికలో అంశాలను చేర్చింది. గతేడాది జూన్ నుంచి జస్టిస్ ఘోష్ కమిషన్ ప్రత్యక్ష విచారణ చేపట్టింది. వందల అఫిడవిట్లు-, బహిరంగ విచారణలు, ఎన్డీఎస్ఏ, కాగ్ నివేదికలు, విజిలెన్స్, ప్రాజెక్టు నిర్మాణ సమయంలో గత ప్రభుత్వం ఆమోదించిన మంత్రి మండలి మినిట్స్, ప్రభుత్వం సమర్పించిన వేల పేజీల సమాచారాన్ని కమిషన్ పూర్తిగా పరిశీలించింది. అన్నింటి నుంచి కీలక ఆధారాలను కమిషన్ సేకరించింది. మూడు బ్యారేజీల్లో చోటు-చేసుకున్న లోపాలు, వాటికి సంబంధించిన ఆధారాలతో నివేదికను సిద్ధం చేసిందని తెలుస్తోంది. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్రావు, మాజీ మంత్రి ఈటల రాజేందర్లు కమిషన్ విచారణకు హాజరైన విషయం తెలిసిందే.

## బొగత జలపాత సందర్శనకు అనుమతి



**ములుగు,జూలై29( వెలుతురు):**
వాజేడు మండలంలోని చీకుపల్లి గ్రామం శివారులో ఉన్న బొగత జలపాతం పర్యాటకులను ఆకర్శిస్తోంది. ఇటీవల భారీగా కురిసిన వర్షాలకు బొగత జలాపాతం పరవళ్లు తొక్కుతోంది. జలసవ్వడులు మంత్రముగ్ధులను చేస్తున్నాయి. భారీ వర్షాలతో ఆంక్షలు విధించిన అధికారులు బొగత జలపాతం సందర్శనకు పర్యటకులకి అనుమతి ఇచ్చారు. ములుగు జిల్లా వాజేడు మండలం బోగత జలపాతం సందర్శనకు పర్యాటకులను షరతులతో కూడిన అనుమతులు ఇచ్చారు. గత 10 రోజులుగా ఎడతెరపు లేకుండా కురుస్తున్న వర్షాలకు బొగత జలపాతం ఉగ్రరూపం దాల్చి ప్రమాద స్థాయిని దాటి ప్రవహించడంతో పర్యాటకుల భద్రత దృష్ట్యా అనుమతి నిరాకరించారు. నిన్నటి నుంచి జలత ప్రవాహం కొద్దిగా తగ్గ ముఖం పట్టడంతో జలపాతం సందర్శనకు అనుమతులు ఇచ్చారు అధికారులు. కానీ ఏ సమయంలో ప్రవాహం పెరుగుతోందో తెలియనందున నీటి కొలనులోకి పర్యాటకుల అనుమతి నిరాకరించారు అధికారులు.

## అక్కను హత్యచేసిన తమ్ముడి అరెస్ట్

**రంగారెడ్డి,జూలై29( వెలుతురు):**
తల్లిదండ్రులు వద్దన్న వ్యక్తితో మాట్లాడుతోందని అక్కను హత మార్చిన తమ్ముడిని రంగారెడ్డి జిల్లా కొత్తూరు పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూరు మండలం పెంజర్లకు చెందిన దేశాల రాఘవేందర్కు రుచిత, రోహిత్ సంతానం. రుచిత డిగ్రీ పూర్తి చేసే ఇంటి వద్ద ఉండగా కుమారుడు రోహిత్ ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. రుచిత, అదే గ్రామానికి చెందిన ఈర్లపల్లి దినేశ్ గతకొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. విషయం యువతి తల్లిదండ్రులకు తెలియడంతో పంచాయితీ పెట్టి దినేశ్ను మందలించారు.సోమవారం తల్లిదండ్రులు పనికి వెళ్లగా.. ఇంట్లో రుచిత, ఆమె సోదరుడు రోహిత్ మాత్రమే ఉన్నారు. ఆ సమయంలో దినేశ్తో రుచిత మాట్లాడటాన్ని గమనించిన రోహిత్.. సోదరిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ క్రమంలో గొడవకు దిగి ఆమె గొంతుకు వైరు బిగించి హత్య చేశాడు. కుమారుడిపై అనుమానం వ్యక్తం చేస్తూ తండ్రి రాఘవేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడి కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు- చేశారు. ఈ క్రమంలో మంగళవారం కొత్తూరు టౌన్లోని పెంజర్ల క్రాస్ రోడ్డు వద్ద రోహిత్ను అదుపులోకి తీసుకున్నారు. దినేశ్తో అక్క తరచూ ఫోన్లో మాట్లాడుతోందనే హత్య చేసినట్లు- విచారణలో నిందితుడు అంగీకరించాడు. దీంతో పోలీసులు అతడిని రిమాండ్కు తరలించారు.

## మానవత్వం చాటుకున్న రాహుల్

**న్యూఢిల్లీ,జూలై29( వెలుతురు):**
కాంగ్రెస్ అగ్ర నాయకుడు, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి మానవత్వం చాటుకున్నారు. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా జమ్మూ కాశ్మీర్లోని పూంచ్ సెక్టార్లో పాకిస్తాన్ సైన్యం జరిపిన కాల్పుల్లో తల్లిదండ్రులను కోల్పోయిన 22 మంది పిల్లలను దత్తత తీసుకోవాలని ఆయన నిర్ణయించుకున్నారు. కాంగ్రెస్ అగ్రనేత నిర్ణయంపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. కాగా, పహల్గాంలో ఏప్రిల్ 22న ఉగ్రదాడి జరిగిన విషయం తెలిసిందే. దాడిలొ 26 మంది టూరిస్టులు చనిపోయారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారం భారత ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్ చేపట్టింది.



## 'ముసలవ్వ'పై మమకారం..

**'వాగ్దేవి స్కూల్'చిన్నారులు సరుకులందజేత**

**ఇనుగుర్తి,వెలుతురు 29:**
మానుకోట జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రం లోని బోయినవాడకు చెందిన నిరుపేద వృద్ధురాలి ని చూసి పిల్లలు జాలిపడ్డారు. ఆమెకు ఎలాగైనా సహాయం చేయాలనుకున్నారు.ఆలోచన వచ్చిందే తడవుగా అందరూ కలిసి మన అమ్మానాన్నలు అక్క చెల్లెలు మన పుట్టినరోజు, ఇతర సమయాలలో పొదుపు చేసుకున్న డబ్బులతో ముసలవ్వకు చేయూతనిద్దామనుకున్నారు.ఈ క్రమంలో మంగళవారం చిన్నారులంతా తమ డబ్బులతో ముసలవ్వకు వారం రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు, పండ్లు తీసుకువచ్చి అందజేశారు.దీంతో ముసలవ్వ ఆనందానికి అవధులు లేవు. చిన్నారులు పట్ల సంతోషం వ్యక్తం చేసింది. ఇదంతా చూసిన ఆ పాఠశాల కరస్పాండెంట్ చిన్నాల కట్టయ్య యాదవ్ తమ పాఠశాల బాలబాలికలు చూపిన కరుణ ఔదార్యాలకు ముద్దులయ్యారు. మంచి పని చేశారని అభినందించారు. ఉపాధ్యాయునిలు నవ్య అసినా పాల్గొన్నారు.

## హద్నూర్ ఎస్ఐ సుజిత్ ను సన్మానించిన మల్గి మాజీ సర్పంచ్ జట్గొండ మారుతి




**జహీరాబాద్ వెలుతురు జూలై 29:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం పరిధిలోని న్యాల్కల్ మండలం హద్నూర్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ గా నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన దోమ సుజిత్ ను మల్గి మాజీ సర్పంచ్ జట్గొండ మారుతి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి వారికి శుభాకాంక్షలు తెలియజేసి శాలువా మరియు పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సుజిత్ ను సన్మానించిన వారిలో రత్నాపూర్ మాజీ సర్పంచ్ రవి కుమార్, మల్గి మాజీ ఎంపీటీసీ శివానంద శ్రీపతి, రత్నాపూర్ మాజీ వార్డ్ సభ్యులు జార్జ్, బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు సిద్ధారెడ్డి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రాజ్ కుమార్, రాజు, శివకుమార్, మల్లప్ప, యువజన నాయకులు మాణిక్ తదితరులు యున్నారు.

## నాగల్ గిద్ద ఎస్సై రామకృష్ణకు ఘనంగా సన్మానించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రహీమ్



**వెలుతురు నారాయణఖేడ్ జూలై 29 :**
నారాయణఖేడ్ నియోజకవర్గం నాగల్ గిద్ద మండలం ఎస్సైగా పదవి బాధ్యతలు స్వీకరించిన రామకృష్ణను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రహీం అంబేద్కర్ పూలే సేవ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై పండరీ, అంబేద్కర్ పూలే సేవ సమితి డివిజన్ నర్సింలు,డివిజన్ ప్రధాన కార్యదర్శి వినోద్,మండల అధ్యక్షులు గణపతి,నాయకులు సంపత్ పలువురు కలిసి శాల్వ పూలమాలతో ఘనంగా సన్మానించి మిఠాయి తినిపించి సత్కరించారు.

## ఎమ్మెల్యే సాంబశివరావుకు వినతి పత్రం అందజేసిన ఉద్యమకారుల ఫోరం నాయకులు.




**రామన్నపేట వెలుతురు న్యూస్ జులై 29**
సిపిఐ రాష్ట్ర కార్యదర్శి శాసనసభ పక్ష నేత శాసనసభ్యులు కూనమనేని సాంబశివరావు కు ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు.ఉద్యమకారులకు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని అమలు చేయించి ఉద్యమకారుల ఆకాంక్షను నెరవేర్చి దిశగా ప్రయత్నం చేయాలని ఆయను ఈ సందర్భంగా కోరారు. అనంతరం ఉద్యమకారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని గత అసెంబ్లీలో ప్రస్తావించినందుకు ఆయనకు శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో, ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజన్న, ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులు శీలం స్వామి, ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్, ఉద్యమ కళాకారుల జిల్లా అధ్యక్షుడు మల్లం వెంకటేశం గౌడ్, బత్తి రవీందర్ గౌడ్, ఐటి పాముల పుష్ప,ఎక్కల దేవి శ్రీనివాస్ ,కదిరేని స్వామి, కన్నె కంటి శ్రీనివాసచారి, కొండూరు శ్రీరాములు, దండ మల్లికార్జున్, బొడిగెసుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## సూక్ష్మ,చిన్న మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటుకు ర్యాంప్ ద్వారా అవకాశాలు డీట్ గురించి అవగాహన, రిజిస్ట్రేషన్ నమోదు



**రామన్నపేట వెలుతురు న్యూస్ జులై 29**
కేంద్ర ప్రభుత్వం సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించడానికి తీసుకువచ్చిన ( రైసింగ్ అక్సలరేటింగ్ ఎంఎస్ఎంఈ పెర్ఫార్మెన్స్) ప్రాజెక్ట్ గురించి రామన్నపేట పంచాయతీ కార్యదర్శులకు మండల ఎంపిడిఓ రాములు అధ్యక్షతన అవగాహన సదస్సును జిల్లా ఈడీసీ మేనేజర్ కుమ్మరికుంట్ల రంజిత్ కుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త పరిశ్రమలకు, ఉన్న అవకాశాలను ,ప్రభుత్వ పథకాలను,తెలుసుకుని సద్వినియోగం చేసుకుని ప్రతి ఒకరు మహిళలు నిరుద్యోగులు పారిశ్రామికవేత్తలుగా తయారు అవ్వాలని ఈ సందర్భంగా సూచించారు .అదే విధంగా తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగుల కొరకు ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన డి ఈ ఈ టీ పోర్టల్ గురించి వివరిస్తూ గ్రామాలలో ఉన్న నిరుద్యోగులు ప్రతి ఒక్కరు డి ఈ ఈ టి లో నమోదు చేసుకొని తద్వారా ఉద్యోగ అవకాశాలను,పొందుకోవాలని ఈ సందర్భంగా తెలియజేసి పోస్టర్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఎంపీఓ ,మండల అధికారులు,రామన్నపేట పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## బీఈడీ అభ్యర్థుల మహా పాదయాత్రను విజయవంతం చేద్దాం.



**రామన్నపేట వెలుతురు న్యూస్ జులై 29**
'స్కూల్ అసిస్టెంట్ పోస్టుల డైరెక్ట్ రిక్రూట్మెంట్ కోటాలో బీఈడీ అభ్యర్థులకు కేవలం 30 శాతం ఇస్తూ ఎస్జీటీలకు 70 శాంతం ప్రమోషన్స్ ఇవ్వడాన్ని నిరసిస్తూ.. తమకు కనీసం 80 శాంతం తగ్గకుండా కొటా ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర బీఈడీ అభ్యర్థుల సంఘం మహా పాదయాత్ర నిర్వహించ తలపెట్టింది.ఈ మహా పాదయాత్ర ఆదివారం ఆగస్టు 3 నుంచి గురువారం 7 వరకు ఉంటుంది. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం నుంచి హైదరాబాద్ లోని ఎస్సీఆర్టీ(–విద్యా కమిషన్) వరకు పాదయాత్ర కొనసాగుతుంది. రాష్ట్రంలోని అభ్యర్థులంతా అధిక సంఖ్యలో పాల్గొని యాత్రను విజయవంతం చేయడంలో భాగస్వామ్యమవ్వాలి. నవంబర్, డిసెంబర్ నెలల్లో 10,000 పోస్టుల నోటిఫికేషన్ వస్తుందని అంటున్నారు. మన పోస్టుల కోసం మనం పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైంది. కావున అధిక సంఖ్యలో పాల్గొనాలి. ఇది అందరి సమస్యా పరిష్కారం కోసమని గ్రహించగలరు. తలారి గణేష్ జిల్లా అధ్యక్షుడు తెలంగాణ రాష్ట్ర బీఈడీ అభ్యర్థుల సంఘం యాదాద్రి జిల్లా

## నెల్లికుదురు"మోడల్ స్కూల్" ఘనత..

### పిఎం శ్రీ పథకంలో ఉత్తమ పాఠశాలగా సెలెక్ట్.



**నెల్లికుదురు, వెలుతురు జులై 29:**
దేశవ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా పథకం (ఎన్ఇపి)2020 ప్రవేశపెట్టి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా నెల్లికుదురు మోడల్ స్కూల్ పి.ఎం శ్రీ పథకానికి ఎంపికైంది. దీంతో మంచి అడ్మినిస్ట్రేషన్ పవర్ కలిగి న



ప్రిన్సిపాల్ జి ఉపేందర్ రావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం కృషి అమలవుతున్న నాణ్యత ప్రమాణాలు,సాంకేతిక వినియోగం, విద్యార్థుల సాధన కు అపూర్వ గౌరవం లభించింది. ఈ సందర్భంగా డీఈవో రవీందర్ రెడ్డి ఎంఈఓ రాందాస్ పాఠశాలకు ప్రిన్సిపాల్ కు,ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈఓ రాందాస్ సంబంధిత శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వ పిఎంశ్రీ పథకం లో తమ పాఠశాల ఎంపిక కావడంతో ప్రిన్సిపాల్ తో పాటు ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేసింది. కార్యక్రమాలు విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## జహీరాబాద్ పట్టణ ప్రజలను శునకాల నుండి కాపాడండి

### ఆర్డిఓ రాంరెడ్డికి వినతి పత్రం సమర్పించిన స్థానిక బిఆర్ఎస్ నాయకులు....

**జహీరాబాద్ వెలుతురు జూలై 29:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపాలిటీ, విలీన గ్రామాల ప్రజలు వీధి కుక్కలు, పందుల వల్ల తీవ్రంగా ఇబ్బందులు






గురవుతున్నారని వెంటనే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ప్రత్యేక అధికారి ఆర్డీఓ రామ్ రెడ్డికి వారి కార్యాలయంలో మంగళవారం కలిసి బిఆర్ఎస్ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ నామ రవికిరణ్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని రోడ్లపై వీధి కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ స్వైర్య విహారం చేస్తున్నాయని, పట్టణంలోని పలు ప్రదేశాలలో వీధి కుక్కలు చిన్న పిల్లలపై దాడులు సైతం చేశాయని అన్నారు. వీధి కుక్కల వల్ల ద్విచక్ర వాహనదారులు రోడ్లపై కుటుంబ సభ్యులతో ప్రయాణిస్తూ పలువురు ప్రమాదానికి గురి అయ్యారని అన్నారు. నిత్యావసర సరుకులు ఖరీదు చేసి ఇంటికి వెళుతున్న మహిళల చేతులలో ఉన్న సంచులను వీధి కుక్కలు వారిపై దాడి చేసి లాక్కొని వెళ్తున్నాయని తెలిపారు. ఇన్ని సంఘటనలు జరుగుతున్నా కూడా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు. ప్రత్యేక అధికారి తక్షణమే చర్యలు తీసుకుని వీధి కుక్కల భారీ నుండి ప్రజలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు రాజా రమేష్ యాదవ్, నరేష్ రెడ్డి, సందీప్ రాజ్, జహీర్, అజయ్ స్వామి, అల్లాడి వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపి రవిచంద్ర నిధులతో సిసి రోడ్లు ప్రారంభం..



**ఇనుగుర్తి, వెలుతురు జులై 29:**
రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మంజూరు చేసిన రూ.20 లక్షల నిధులతో మానుకోట జిల్లా ఇనుగుర్తి మండలం చిన్ననాగారంలో మంగళవారం సిసి రోడ్లకు రల్ శ్రీకారం చుట్టారు.అంబేద్కర్ కమ్యూనిటీ భవనం వద్ద సిసి రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కేఎంసీ మాజీ వైస్ చైర్మన్ కసిర బోయిన విజయ్ యాదవ్ మాట్లాడుతూ.. మండలంలో నేటికీ పోలీస్ స్టేషన్ మంజూరు చేయలేదని విమర్శించారు.ఎంపీ రవిచంద్ర కు,వద్దిరాజు కిషన్, మాజీ ఎంపీ ఎమ్మెల్యే కవిత, శంకర్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు మద్దెల సుధాకర్ గౌడ్,జనరల్ సెక్రటరీ చెడుపాక యాకూబ్,మాజీ రైతు కోఆర్డినేటర్ బైరు పటేల్ కొమురయ్య గౌడ్,వడపల్లి కొండయ్య గౌడ్, బొబ్బల ముత్తయ్య యాదవ్,నిడిగంటి యాదగిరి,భూక్య లచ్చు నాయక్,చెడుపాక వెంకన్న,చెడుపాక దర్గయ్య,చెడుపాక సురేష్, వెంకన్న,ముత్తయ్య,శ్రీను, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇనుగుర్తి బాలికల గురుకులంలో 31న ఇంటర్ ఫస్టియర్ స్పాట్ అడ్మిషన్స్..



**ఇనుగుర్తి,వెలుతురు,జూలై 29:**
మానుకోట జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయం లో ఇంటర్ ఫస్టియర్ కోసం రేపు(31 గురువారం) స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి.జయశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.సిఇసి గ్రూపులో 20 సీట్లలో ఎస్సీ 14,ఎస్టి 2,బిసి1,ఓసి2మైనారిటీకి 1చొప్పున ఉన్నట్లు తెలిపారు.హెచ్ ఇ సి లో 25 సీట్లు ఉండగా ఎస్సీ 16, ఎస్టి 1,బిసి 5,ఓసి 2 మైనారిటీ1 చొప్పున సీట్లు ఉన్నట్లు పేర్కొన్నారు.ఆసక్తి కలిగిన వారు ఈ నెల 31న ఉదయం 9 గం.కు ఎస్ఎస్సి మెమో,ఆదాయం,కులం,డేట్ అఫ్ బర్త్ తదితర ఒరిజినల్ సర్టిఫికెట్స్ తో పాటు ఒక సెట్ జిరాక్స్ రతలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## మునిపంపుల హైస్కూల్ కు ఐరన్ గ్యాస్ స్టవ్ ప్రదానం



**రామన్నపేట వెలుతురు న్యూస్ జులై29**
మండలంలోని మునిపంపుల ఉన్నత పాఠశాలకు మంగళ వారం సేవాభారతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆద్వర్యంలో సంస్థ పోషకులు మన్నె పద్మారెడ్డి 2 - బర్నర్ ఐరన్ గ్యాస్ స్టవ్ ప్రదానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రదానోపాధ్యాయులు దొడ్డి స్వామి మాట్లాడుతూ పద్మారెడ్డి వంటి దాతలు పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములవుతూ వంట చేయడంలో ఎదురవుతున్న ఇబ్బందులు గమనించి కోరగానే గ్యాస్ పొయ్యి అందించడం,అభినందనీయం అన్నారు.ఈ సందర్భంగా మన్నె పద్మారెడ్డిని పాఠశాల తరపున సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు మాజీ సర్పంచ్ కట్టా యాదయ్య, మిర్యాల శ్యాంసుందర్, ఉపాధ్యాయులుపాల్గొన్నార.ప్రధానోపాధ్యాయులు జడ్పీహెచ్ఎస్ మునిపంపుల.

## కుమ్మరి కులానికి ఆణిముత్యం బొడ్డుపల్లి సైదులు.

**- యాదాద్రి భువనగిరి జిల్లా శాలివాహన కుమ్మరి సంఘం కన్వీనర్ దరిపల్లి ప్రవీణ్ కుమార్**



**రామన్నపేట వెలుతురు న్యూస్ జులై 29**
తెలంగాణ యోగ టీచర్ కో ఆర్డినేషన్ కమిటీ ( టి వై టి సి సి) నుండి రామన్నపేట మండలం పరిధికి చెందిన రామన్నపేట కుమ్మరి సంఘం కన్వీనర్ బొడ్డుపల్లి సైదులు కి తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా నుండి ఘన సన్మానం. యాదాద్రి భువనగిరి జిల్లా కన్వీనర్ దరిపల్లి ప్రవీణ్ కుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ మా శాలివాహన కుమ్మరి సంఘానికి చెందిన బొడ్డుపల్లి సైదులుకు తెలంగాణ యోగ టీచర్ కోఆర్డినేషన్ కమిటీ నుండి బెస్ట్ యోగా టీచర్ అవార్డు అందుకున్నందుకు, అతని అభినందిస్తూ,ఇంకా మరెన్నో అవార్డులు తీసుకోవాలి. అని తన భుజం తట్టి ప్రోత్సహించారు. తదనంతరం బొడ్డుపల్లి సైదులుకు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కో కన్వీనర్ ఓరుగంటి గోపాల్ , జిల్లా కార్యవర్గం గుమ్మడిల్లి భాస్కర్, తాడూరు ఆంజనేయులు డిసిఎం, బలరాం, తాడూరి సత్యనారాయణ, చిలువేరు తిరుమలేష్, చిట్టిమల్ల రవికుమార్ సన్మానించారు.

## 'కోమటిపల్లి'లో రేషన్ కార్డ్ పత్రాలు పంపిణీ..



**ఇనుగుర్తి,వెలుతురు జూలై 29:**
మానుకోట జిల్లా ఇనుగుర్తి మండలం కోమటిపల్లి గ్రామంలో పేద లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కూరెల్లి సతీష్ మంగళవారం రేషన్ కార్డు పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జాఫర్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రావుల మల్లేశం,వర్కింగ్ ప్రెసిడెంట్ కొట్టం యాకమూర్తి, ఉపాధ్యక్షులు నిమ్మల వెంకన్న, కీమా నాయక్,ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు మల్లం యాకయ్య,షేరు శ్రీనివాస్,మండల నాయకులు గోసుల మల్లేష్,బల్లవరం కృష్ణమూర్తి, అల్లి లక్ష్మి నారాయణ, డీలర్ జల్లే నరసయ్య,దొండ శ్రీను, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## రైతులు పచ్చిరొట్ట ఎరువులైన జనుము జీలుగును విరివిగా సాగు చేయాలి

**- జహీరాబాద్ మండల వ్యవసాయ అధికారిణి లావణ్య...**



**జహీరాబాద్ వెలుతురు జూలై 29:**
పచ్చిరొట్ట ఎరువులైన జీలుగా జనుము సాగు చేసి భూమిలో కలియ దున్నడం ద్వారా భూమిలో సేంద్రీయ కర్బనం పెరగడం కాక వాతావరణంలో గల నత్రజనిని ఈ మొక్కలు గ్రహించి నేలలో స్థిరీకరణ చేయడం ద్వారా నత్రజని సంబంధిత ఎరువులను తగ్గించడం కాకుండా రైతులకు ఆదాయ వనరులుగా చేకూరుస్తాయని జహీరాబాద్ మండల వ్యవసాయ అధికారి లావణ్య తెలిపారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం పరిధిలో సాగుచేసిన జనుము జీలుగా పొలాలను సందర్శించి రైతులకు ఈ యొక్క పచ్చిరొట్ట ఎరువులను ప్రతి రెండు మూడు పంటల సాగు అనంతరం సాగు చేసి భూమిలో కలియ దున్నడం ద్వారా నేల గుల్ల మారడమే కాకుండా వాతావరణంలో గల నత్రజనిని గ్రహించి రైతులకు ఉపయుక్తంగా ఉంటుందని, వివిధ రకాల కలుపు మొక్కలను కూడా నివారించుటకు దోహదపడుతుందని అందుకు రైతులు తప్పనిసరిగా ఈ యొక్క పచ్చిరొట్ట ఎరువులైన జనుము జీలుగును విరివిగా సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి లావణ్య విస్తరణ అధికారులు ప్రదీప్ కుమార్, వీరేందర్, రైతులు రామకృష్ణారెడ్డి, ఫిరోజ్, రాములు, బాబు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి 21వ మహా పాదయాత్రకు ఘన ప్రారంభం

**- శ్రీ గండమ్మ తల్లి దేవాలయంలో పూజలు చేసి సన్మానించిన కాట సుధా శ్రీనివాస్ గౌడ్**





**పటాన్‌చెరు వెలుతురు జూలై 29:**
పటాన్‌చెరు మహాంకాళి దేవాలయం నుండి తిరుమల-తిరుపతి వరకు శ్రీ వెంకటేశ్వర స్వామి దివ్య దర్శనం కోసం సీసాల రాజు ఆధ్వర్యంలో 21వ మహా పాదయాత్ర ప్రారంభమైంది. ఈ సందర్భంగా రామచంద్రాపురంలోని శ్రీ శ్రీ శ్రీ గండమ్మ తల్లి దేవాలయం వద్ద పాదయాత్ర బృందాన్ని సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ ఘనంగా సన్మానించారు. అనంతరం దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తి శ్రద్ధలతో సాగనున్న ఈ పాదయాత్ర విజయవంతంగా పూర్తి కావాలని కోరుకున్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి

**- బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.బొంగోని సురేష్ గౌడ్**



**మద్దురు వెలుతురు జూలై 29:**
మంగళవారం రోజున మద్దురు మండలంలోని లద్నూరు గ్రామంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు మోకు ఉదయ్ రెడ్డి అధ్యక్షతన స్థానిక సంస్థల కార్యశాల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమనికి బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొంగోని సురేష్ గౌడ్ గారు ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పోటీ చేసేందుకు బిజెపి కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వం లోని కేంద్ర ప్రభుత్వం గ్రామానికి అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తామన్నారు. ఈరోజు గ్రామాల్లో జరుగుతున్న ప్రతీ అభివృద్ధి బీజేపీ ప్రభుత్వం గ్రామపంచాయతీ కి నేరుగా నిధులు పంపించడం వల్లనే అని పేర్కొన్నారు.గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బిజెపి జెండా ఎగరేస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలన్నారు. గ్రామ స్థాయి వార్డ్ మెంబర్ నుంచి జిల్లా పరిషత్ చైర్మన్ వరకు బీజేపీ అభ్యర్థులే గెలవాలనీ, భారత ప్రధాని మోడీ సర్కార్ మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి ఇచ్చిందని గ్రామాల్లోకి వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించండి అని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. లద్నూర్ గ్రామం బీజేపీ కి మంచి పట్టున్న గ్రామమని బూత్ స్థాయి నుండి ఇంకా బలోపేతం చేయాలనీ పిలుపునిచ్చారు, బిఆర్ఎస్, కాంగ్రెస్ నుండి బీజేపీ లోకి రావాలని ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమం లో మండల ప్రధాన కార్యదర్శిలు బియ్య రమేష్, బొంగోని బాలు, సీనియర్ నాయకులు మాజీ ఎంపీటీసీ రాపాక బుచ్చిరెడ్డి, బీజేవైఎం రాష్ట్ర నాయకులు మనోజ్ కుమార్,రామకృష్ణ రెడ్డి,మండల నాయకులు రవీందర్ రెడ్డి, వీరయ్య, గోవిందచారి,ఉపేందర్.ఐలయ్య,శరత్, రమేష్ ఇంకా తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతితో మానవుని అనుబంధాన్ని పటిష్టపరచే
# ఒక ప్రత్యేకమైన పండుగ వన మహోత్సవం

**- లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ లయన్ పల్లెర్ల రవీందర్ గుప్త**

**- తూప్రాన్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా వన మహోత్సవం**

**- తూప్రాన్ ఆయుర్వేద ఆసుపత్రి ఆవరణలో 1,116 మొక్కలు నాటిన లయన్స్**



**తూప్రాన్, వెలుతురు జులై,29:**
ప్రకృతితో మానవుని అనుబంధాన్ని పటిష్టపరచే ఒక ప్రత్యేకమైన పండుగ వన మహోత్సవం అని తూప్రాన్ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ లయన్ పల్లెర్ల రవీందర్ గుప్త అన్నారు. తూప్రాన్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆయుర్వేద ఆసుపత్రి ఆవరణలో 1,116 మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత లయన్స్ క్లబ్ తీసుకుంది. ఈ సందర్భంగా లయన్ పల్లెర్ల రవీందర్ గుప్త, లయన్ డాక్టర్ ప్రదీప్ సింహ, ఆయుర్వేద ఆసుపత్రి సీనియర్ మెడికల్ ఆఫీసర్ సచిన్ చంద్ర లు మాట్లాడుతూ వర్షా కాల ఆరంభం లో చెట్లు నాటే కార్యక్రమం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతుంది అని తెలిపారు. "వన మహోత్సవం" వృక్ష (చెట్టు) మహోత్సవ (పండుగ) ల నుండి వచ్చిందని కాబట్టి మనమందరం భాద్యతగా దీన్ని ప్రతి సంవత్సరం జూలై నెలలో ఓ యజ్ఞం లా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వర్షాకాలం ప్రారంభమయ్యే సమయానికీ అనుగుణంగా ఉంటుంది కాబట్టి ఇట్టి సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చెట్లు నాటడం వల్ల భవిష్యత్తులో కలిగే అనేక ప్రయోజనాలు వివరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి వద్ద తూప్రాన్ లయన్స్ క్లబ్ స్వచ్ఛంద సంస్థ పెద్దఎత్తున వృక్షా సంపద పెంపొందించే. అనేక కార్యక్రమాలు నిర్వహిస్తాయన్నారు. పర్యావరణ పై ప్రతి ఒక్కరినీ చైతన్య పరుస్తూదమొక్కలు నాటి వృక్షావరణం యొక్క ప్రాముఖ్యతను తెలియజేసేందుకు అనేక కార్యక్రమాలు, ప్రచారాలు, వ్యాస రచన, వాక్చతృ, ఉపన్యాస పోటీలు, ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులలో పర్యావరణం పట్ల బాధ్యతను కలిగించేందుకు ఈ కార్యక్రమం స్కూల్, కాలేజీలలో ప్రోత్సహిస్తున్నామన్నారు. వృక్షాలు పర్యావరణాన్ని శుభ్రంగా ఉంచతాయని, వాయు కాలుష్యాన్ని తగ్గిస్తాయని, మట్టిని కాపాడుతాయని.వర్షాన్ని ఆకర్షించడంలో సహాయపడతాయనీ, జీవవైవిధ్యానికి నిలయంగా ఉంటాయన్నారు. అనంతరం లయన్ డాక్టర్ జానకిరామ్ సిఆర్ మాట్లాడుతూ వనమహోత్సవం ఒక పండుగ మాత్రమే కాదు, ఇది ప్రకృతి సంరక్షణ పట్ల మన బాధ్యతను గుర్తు చేసే అవకాశంగా భావించాలి అని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ ప్రతి సంవత్సరం కనీసం ఒక చెట్టు నాటి దానిని సంరక్షించాలన్న సంకల్పంతో ముందుకు సాగితే భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన జీవన వాతావరణం అందించవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ లయన్స్ లయన్ పల్లెర్ల రవీందర్ గుప్త, లయన్ డాక్టర్ జానకిరామ్ సిఆర్, లయన్ నీల ప్రవీణ్ కుమార్ గుప్త, లయన్ డాక్టర్ ప్రదీప్ సింహ, లయన్ డాక్టర్ అప్సర్ భాయ్, లయన్ కృష్ణా రెడ్డి, లయన్ మహమ్మద్ హమ్మద్ భాయ్, లయన్ కుమ్మరి రమేష్, లయన్ పల్లెర్ల బాలేష్ గుప్త, లయన్ నేతి సాగర్ గుప్త, లయన్ సుమంత్, ఆశాజ్యోతి డయగ్నాస్టిక్ ఎండి లయన్ పచ్చిమట్ల మల్లేష్ గౌడ్, లయన్ మచ్చ యాదగిరి, ఆయుర్వేదిక్ ఆసుపత్రి సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సచిన్ చంద్ర డాక్టర్ రాణి శర్మ, డాక్టర్ భవాని ప్రసాద్, డాక్టర్ పి.ప్రవీణ్, సిబ్బంది ఎం.వెంకటేశ్వర్ గౌడ్, కే.సౌజన్య, కే.శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ ఎం.సురేష్. ఎస్.యాదయ్య, బి.వెంకటరమణ, ఎల్.సుష్మా, ఏ.కవిత తదితరులు పాల్గొన్నారు.

## రూ. 1.50 లక్షల గోవా మద్యం పట్టి వేత..ఒకరి అరెస్టు

**- కారుతో పాటు 162 మద్యం బాటిళ్ల సీజ్..**

**- వివరాలు వెల్లడించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్కెరెక్టర్ షాన్‌వాజ్ ఖాసీం..**



**జహీరాబాద్ వెలుతురు జూలై 29:**
సర్పంచి ఎన్నికలు త్వరలో రానున్నాయి. ఎన్నికల్లో పోటీ చేయాలంటే మాత్రం ఇప్పటి నుంచి గ్రామస్థులను, ఓటర్లను కాకా పట్టక తప్పదు. ఈ అలోచలను మదిలో పెట్టకొని కుటుంబ సభ్యులతో నల్గొండ జిల్లా పెద్ద అడిసెపల్లికు ఓ కుటుంబ సభ్యులు గోవాకు వెళ్లారు. అక్కడ గోవా అంతటా పర్యాటించారు. తిరుగు ప్రయాణంలో ఏకంగా 162 మద్యం బాటిళ్లను తక్కువకు వస్తున్నాయని కొనుగోలు చేసుకొని కారులో నింపుకొని వస్తున్న సమయంలో పక్కా సమాచారం అందుకున్న డిటిఫ్ ఎస్సై హన్మంతు సింబ్బంది కలిసి జహీరాబాద్ చీరాగ్‌పల్లి ఎక్సైజ్ చెక్‌పోస్టు తనిఖీలు నిర్వహించి మధ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న మద్యం బాటిళ్ల విలువ రూ. 1.50 లక్షల విలువ ఉంటుందని అధికారులు అంచనా వేశారు. 112 ఫుల్ మధ్యం బాటిళ్ళు, 50 బాటిళ్ల 330 ఎంఎల్ బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మధ్యంతోపాటు కారును కూడ సీజ్ చేశారు. ఈ లిక్కర్ కేసులో జయంత్ రెడ్డి అనే వ్యక్తిణి అరెస్టు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్కెరెక్టర్ షాన్‌వాజ్ ఖాసీం తెలిపారు. ఈ దాడిలో డీటీఎఫ్ సంగారెడ్డి టీమ్, జీహీరాబాద్ ఎక్సైజ్ స్టేస్ టీమ్, జహీరాబాద్ చెక్‌పోస్టు టీమ్ పాల్గొన్నారు. గోవా మద్యం బాటిళ్లను పట్టు కున్న టీమ్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్కెరెక్టర్ షాన్‌వాజ్ ఖాసీం, మెదక్ డిప్యూటి కమిషనర్ జె.హరి కిరణ్, ఎక్సైజ్ సూపరిండెంట్ నవీన్ చంద్‌లు అభినందించారు.

# ప్రతి విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలి

**- గురుకుల బాలికల వసతి గృహంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు ...**

**- సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జి. కవిత దేవి...**



**జహీరాబాద్ వెలుతురు జూలై 29:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండల లీగల్ సర్వీసెస్ కమిటీ వారి ఆధ్వర్యంలో మంగళవారం మొగుడంపల్లి ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల బాలికల వసతి గృహంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సును సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జి. కవిత దేవి నిర్వహించి విద్యార్థులకు కొన్ని ముఖ్యమైన అంశాలపై అవగాహన కల్పించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రతీ విద్యార్థినులు చక్కగా చదువుకోవాలని, చదువుతోపాటు సాధారణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. విద్యార్థులు నిత్యజీవితంలో చిన్న చిన్న సమస్యలు ఎదుర్కోకుండ ఉండడానికి, ఒకవేళ సమస్యలు ఎదురైతే వాటిని అధిగమించడానికి చట్టాలు తొడ్పాడుతాయని సూచించారు. కార్యక్రమంలో మోటార్ వాహనాల చట్టం, బాలకార్మిక నిర్మూలన చట్టం, బాల్య వివాహ నిరోధక చట్టం, జువైనైల్ జస్టిస్ యాక్ట్, సైబర్ క్రైమ్స్, ఉచిత న్యాయసేవా సహాయంపై విద్యార్థులకు తెలియజేసారు. విద్యార్థులందరూ చట్టాలను గౌరవిస్తూ, అవసరమైతే తోటివారికి తెలియజెప్పాలని సూచించారు. మీ చుట్టు బాల్య వివాహ బాధితులు, బాల కార్మికులు ఎక్కడైనా ఉన్నట్లు గుర్తిస్తే 1098 కి ఫోన్ ద్వారా తెలుపవచ్చని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలియజేసారు. ఏ సమాచారం గురించి తెలుసుకోవాలనుకున్న మండల లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యాలయంను సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు శ్రీనివాస్ కన్నా, శ్రీనివాస్ రెడ్డి, సోమశేఖర్, శివకుమార్, చిరాగపల్లి ఎస్సై రాజేందర్ రెడ్డి, TGTWURJC కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, పారాలీగల్ వాలంటీర్, వసతి గృహ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## కేంద్రీయ విద్యాలయం భవనాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**





**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 29**
మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలో నూతనంగా నిర్మించిన కేంద్రీయ విద్యాలయం భవనాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ప్రారంభించి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి ఫర్టిలైజర్ షాపును సందర్శించిన అనంతరం పద్దనపల్లి గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల, భవిత కేంద్రం, సబ్బపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లను పరిశీలించి మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులకు ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొన్నారు.

## సరస్వతీ పవర్ షేర్ల బదిలీ కుదరదు

**- జగన్‌కు భారీ ఊరట**

**హైదరాబాద్,జులై 29 వెలుతురు:**



వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌కు భారీ ఊరట లభించింది. సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్ వాటాల బదిలీపై జగన్ వేసిన పిటిషన్‌ను అనుమతించింది. విజయలక్ష్మి, షర్మిలకు వాటాలు బదిలీ నిలుపుదల చేయాలని జగన్ పిటిషన్ పై విచారణ జరిపిన ధర్మాసనం.. జగన్ వాదనలతో ఏకీభవించింది. విజయలక్ష్మి, షర్మిలకు బదిలీ అయిన వాటాలను నిలుపుదల చేస్తూ తీర్పు వెలువరించింది. ఈ తీర్పును విజయమ్మ, షర్మిల హైకోర్టు లో సవాల్ చేసే అవకాశం ఉన్నట్లు- తెలుస్తోంది. కాగా గతంలో తన అన్న వదిన కలిసి తమకు సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్‌లో రావాల్సిన వాటాలను ఇవ్వడం లేదని షర్మిల, విజయలక్ష్మి పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే.

## ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుంది

- ఎమ్మెల్యే పాయల్ శంకర్



**ఆదిలాబాద్ వెలుతురు జూలై 29:**
ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు, మంగళవారం ఆదిలాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సాత్నాల మండలం ఖార గ్రామానికి చెందిన పటేల్ తో పాటు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బిజెపిలో చేరారు. కేంద్ర ప్రభుత్వం పథకాలు నేడు జిల్లాలో వందల కోట్ల నిధులు వ్యయంతో కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఇంకా రాబోయే రోజులలో ప్రత్యేకంగా కేంద్రం నుండి నిధులు తీసుకోరావడానికి కృషి చేస్తామన్నారు. శాసనసభ ఎన్నికల్లో ఏ విధంగా అయితే తనను నిండు మనసుతో గెలిపించారు అదేవిధంగా రాబోయే స్థానిక సంస్థలు ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. వీరితోపాటు బిజెపి నాయకులు పోతురాజు రమేష్. సుభాష్. సురేష్ తదితరులు ఉన్నారు.

## కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆదివాసుల సంక్షేమానికి ప్రత్యేక కృషి చేస్తున్నారు

- ఎమ్మెల్యే పాయల్ శంకర్





**ఆదిలాబాద్ వెలుతురు జూలై 29:**
కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆదివాసుల సంక్షేమానికి ప్రత్యేక కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు, మంగళవారం బేల మండలం చప్రాల గ్రామంలో రెండు కోట్ల 30 లక్షల జన్మన్ నిధుల వ్యయంతో నిర్మించనున్న బాలురుల హాస్టల్ బిల్డింగ్ నిర్మాణ పనులకు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆదివాసుల అభివృద్ధికి కేంద్రం జన్ మన్ పథకాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. జన్ మన్ నిధుల ద్వారా ఆదివాసి గ్రామాల నెలకొన్న సమస్యలను పరిష్కరించడమే ముఖ్య లక్ష్యం అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాకు వందల కోట్ల రూపాయల మంజూరు చేయడం జరిగింది అన్నారు. ఇప్పటికే పలు అభివృద్ధి పనులు పూర్తయి ప్రారంభ దశలో ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్న దేశ ప్రధాని మంత్రి నరేంద్ర మోడీ తో పాటు సీఎం రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారుఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు ఇంద్ర శేఖర్,జిల్లా అసెంబ్లీ కన్వీనర్ విజయ్ బోయర్,.మురళీధర్. దత్తానికం,రామ,రాకేష్ నవీన్ మోరేష్ గణేష్, సాయి పాయల్,గజానన్,తదితరులు పాల్గొన్నారు.

## డ్రైవర్ల వృత్తి ఎంతో క్లిష్టమైనదని..

**- ప్రమాదవశాత్తు ఏమైనా ఘటన జరిగితే కుటుంబానికి బాసటగా కేంద్ర ప్రభుత్వ భీమ పథకాలను తీసుకువచ్చింది**

**- ఎమ్మెల్యే పాయల్ శంకర్**



**ఆదిలాబాద్ వెలుతురు జూలై 29:**
డ్రైవర్ల వృత్తి ఎంతో క్లిష్టమైనదని.. ప్రమాదవశాత్తు ఏమైనా ఘటన జరిగితే కుటుంబానికి బాసటగా కేంద్ర ప్రభుత్వ భీమ పథకాలను తీసుకువచ్చిందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు, గత రెండేళ్ల క్రితం ఆదిలాబాద్ లోని డ్రైవర్ సంఘం సభ్యులకు ఎమ్మెల్యే గారు పాయల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తనవంతుగా పోస్ట్ ఆఫీస్ లో ప్రమాద బీమా చేయించారు. ఇటీవల డ్రైవర్ పెద్దింటి ప్రభాకర్ పాముకాటులో మృతి చెందారు. దీంతో ఆయనకు మంజూరైన 10 లక్షల చెక్కును మంగళవారం అందజేశారు. గ్రామాల, పట్టణాల్లో ఇల్లు లేని డ్రైవర్లకు ఇంటి స్థలాలందే విధంగా కృషి చేస్తానన్నారు. డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు... కార్యక్రమంలో డ్రైవర్ సంఘు నాయకులు విట్టల్ గౌడ్. వసంత్ మోహన్ శంకర్ రమేష్ అశోక్ స్వామి భారతీయ జనతా పార్టీ నాయకులు విజయ్ మయూర్ చంద్ర అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# కేంద్రీయ విద్యాలయాల ద్వారా జ్ఞానం, క్రమశిక్షణతో కూడిన విద్య

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 29**
కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ పాఠశాలల ద్వారా జ్ఞానం, క్రమశిక్షణతో కూడిన విద్య అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేటలో నూతనంగా నిర్మించిన కేంద్రీయ విద్యాలయం నూతన భవనాన్ని షెడ్యూల్డ్ కులాల సహకార సంస్థ ఈ.డి. చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపల్, 13వ పటాలము కమాండెంట్, సమన్వయకర్త శ్రీధర్, తహసిల్దార్ శ్రీనివాస్ రావు దేశ్ పాండే లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయాల ద్వారా విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య జరుగుతుందని తెలిపారు. ఏ పాఠశాలలో అయినా ఒక ప్రాంతం నుండి వచ్చిన విద్యార్థులు మాత్రమే



చదువుకుంటారని, కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ పాఠశాలలలో వివిధ ప్రాంతాలు, వివిధ భాషలు, వివిధ సంస్కృతల నుండి వచ్చిన విద్యార్థులు ఒకే వేదికగా విద్య అభ్యసించడం జరుగుతుందని తెలిపారు. మాతృభాషతోపాటు ఆంగ్లం, హిందీ భాషలు విద్యార్థులకు అందించబడతాయని, కేంద్రీయ విద్యాలయాలలో విద్య అభ్యసించిన వారు ఉన్నత విద్య అనంతరం జాబ్ మార్కెట్ లో రాణించేందుకు అవసరమైన జ్ఞానాన్ని సంపాదించుకుంటారని, ఎలాంటి సమస్యలు ఎదురైనా తాము నేర్చుకున్న క్రమశిక్షణతో పరిష్కరించుకుంటూ ముందుకు సాగుతారని తెలిపారు. ఏకాగ్రతతో కష్టపడే వారు విజయం సాధిస్తారని, తమ జీవితంలో ఎదుర్కొనే హెచ్చుతగ్గులను అధిగమించి ఉన్నత స్థానాలకు ఎదుగుతారని తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, కళలు ఇతర ఆసక్తి ఉన్న రంగాలలో రాణించాలని, సమాజాన్ని తెలుసుకోవాలని తెలిపారు. సోషల్ స్కిల్స్ తప్పనిసరిగా తెలుసుకోవాలని, తల్లిదండ్రులు, వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులు, పిల్లలతో ప్రవర్తించే విధానంలో తమ సంస్కారం కనిపిస్తుందని తెలిపారు. సత్ప్రవర్తన, సామాజిక బాధ్యత, క్రమశిక్షణ, పోటీ తత్వానికి పాఠశాల పునాది వంటిదని తెలిపారు. జిల్లాలోని కేంద్రీయ విద్యాలయంలో చదువుతున్న విద్యార్థులు క్రమశిక్షణతో విద్య అభ్యసించి ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించే దిశగా చిత్తశుద్ధితో కృషి చేయాలని తెలిపారు. అనంతరం విద్యాలయం ఆవరణలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆసుపత్రిలోని వార్డులు, మందుల నిల్వలు, రిజిస్టర్లు, పారిశుద్ధ్య నిర్వహణ అంశాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా పాటించవలసిన



జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, ఆసుపత్రి లోని వార్డులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. మండల కేంద్రంలోని నర్మద ఫర్టిలైజర్ దుకాణాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్, మండల వ్యవసాయ అధికారి లతో కలిసి సందర్శించి స్టాకు నిల్వలు, రిజిస్టర్లు, రసీదు పుస్తకాలను పరిశీలించారు. జిల్లాలో వ్యవసాయ సాగుకు సరిపడా ఎరువులు, విత్తనాలు, యూరియా సమృద్ధిగా ఉన్నాయని, రైతులకు విక్రయించే వాటి వివరాలను రిజిస్టర్ లో నమోదు చేయడంతో పాటు తప్పనిసరిగా రసీదు జారీ చేయాలని, దుకాణం ఎదుట ధరల పట్టిక, స్టాకు నిల్వల వివరాలు తప్పనిసరిగా ప్రదర్శించాలని, నకిలీ, నిషేధిత అంశాల విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పద్దనపల్లి గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. రైతులకు వ్యవసాయ సాగుకు అవసరమైన మెలకువలు అందించాలని తెలిపారు. ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల, భవిత కేంద్రం, సబ్బెపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజన నాణ్యత, తరగతి గదులు, హాజరు, పరిసరాలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలలో సకల సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థులకు సకాలంలో మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, శుద్ధమైన త్రాగునీటిని ఇవ్వాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా వ్యక్తిగత పరిశుభ్రత, ఆహారం తీసుకునే ముందు చేతులు శుభ్రపరచుకోవడం వంటి అంశాలను విద్యార్థులకు వివరించాలని, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు విద్యా బోధన అంశంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వణ అధికారి గణపతి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్ లతో కలిసి మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజా సంక్షేమ కార్యక్రమాల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మండల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలం అయినందున పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, అంతర్గత రహదారులు, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని, దోమల వృద్ధిని అరికట్టేందుకు నీటి నిల్వలను తొలగించడంతో పాటు ఆయిల్ బాల్స్, బయోటెక్ స్ప్రే పిచికారి చేయాలని తెలిపారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా నిర్దేశించిన లక్ష్యం ప్రకారం మొక్కలు నాటి సంరక్షించాలని, ప్రతి ఇంటికి శుద్ధమైన త్రాగునీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమంలో భాగంగా అమలు చేస్తున్న కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహిస్తూ అర్హత గల ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ ఫలాలు అందే విధంగా కృషి చేయాలని తెలిపారు. మంచిర్యాల పట్టణంలోని పాత మంచిర్యాల ప్రాంతంలో నిర్మిస్తున్న ఇందిరా మహిళ శక్తి భవన్ నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను చేపడుతుందని, స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆర్థిక చేయూతనందించి అభివృద్ధి చెందే విధంగా ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఈ క్రమంలో చేపట్టిన ఇందిరా మహిళా శక్తి భవన్ నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాలలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా అధునాతన సాంకేతిక విద్య

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 29**
ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రాలు అడ్వాన్స్ టెక్నాలజీ హబ్ లుగా మారి అత్యాధునిక మౌలిక వసతులతో అధునాతన సాంకేతిక విద్య అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ ఛాంబర్ లో ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ ప్రిన్సిపల్ వై. రమేష్, ఇతర అధికారులతో కలిసి అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యువతకు అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా నైపుణ్యతతో కూడిన శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రపంచ స్థాయి ల్యాబ్ లు, టాటా టెక్నాలజీ సహకారం, ప్రముఖ ఇండస్ట్రీలో భగస్వామ్యంతో యువత భవిష్యత్తును తీర్చిదిద్దే విధంగా అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్లను అభివృద్ధి చేయడం జరిగిందని తెలిపారు. నిష్ణాతులైన ట్రైనర్ల పర్యవేక్షణలో ఇండస్ట్రీ 4.0 మిషనరీ పై రియల్ టైం ప్రాక్టికల్ ట్రైనింగ్ అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో 65 అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్లలో 11 వేల 132 సీట్లు అందుబాటులో ఉన్నాయని, వచ్చే విద్యా సంవత్సరంలో మరో 46 సెంటర్లు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందని, యువత భవిష్యత్తు కోసం 5 వేలకోట్ల రూపాయలతో రాష్ట్రవ్యాప్తంగా 111 అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రిన్సిపల్ టి. సుజాత, శిక్షణ అధికారులు దత్తాత్రి, శ్రీధర్, మనోహర్, సీనియర్ సహాయకులు రామస్వామి, ఎ. టి. ఓ. సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## మన్ననూర్ లో ఘనంగా నాగుల పంచమి, నాగదేవతలకు పూజలు



**వెలుతురు న్యూస్, అచ్చంపేట/అమ్రాబాద్ జూలై 29:**
నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మున్ననూరు గ్రామంలో గల శ్రీ శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో నాగుల పంచమి సందర్భంగా నాగదేవతలకు ఆర్యవైశ్యులు ఘనంగా పూజలు సమర్పించారు నాగుల పంచమి రోజు నాగదేవతల వారి విగ్రహాలకు పూజలు చేసి పుట్టలో పాలు పోస్తే సర్ప దోషాలు తొలగి పోతాయని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సంబు వెంకటరమణ అన్నారు.అదేవిధంగా మన పంటలను ఎలుకలు ఎంతో నాశనం చేస్తుంటాయని కానీ నాగదేవతల వల్ల ఎలుకల బారిన పడకుండా మన పంటలను నాగదేవతలు కాపాడుతాయని పూర్వకాలం నుండి యుగాల నుండి నాగదేవతలకు హిందూ బంధువులు పూజలు చేసే పద్ధతి ఉందని తెలిపారు.



శ్రీశ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో ఉన్న నాగ దేవతల ప్రతిమలకు శిల్పాలకు పాలు పోసి కొబ్బరికాయలు కొట్టి మంగళహారతి పాటలు పాడి మహిళలు ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమామహేశ్వర దేవస్థానం పాలకమండలి సభ్యురాలు శ్రీమతి సంబు శోభ మహాసభ నాయకులు సత్యనారాయణ వారి సతీమణి పద్మావతి సంబు అనిత, పద్మ సంబు భార్గవి సంబు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర పౌరసరఫరాల శాఖలో భారీ స్కాం

**- రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారుల పాత్ర**

**- ఇడికి ఫిర్యాదు చేసిన బిఆర్ఎస్ నేతలు**




**హైదరాబాద్,జూలై29( వెలుతురు):** రాష్ట్ర పౌరసరఫరాల శాఖ స్కాంలో సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సంబంధిత అధికారులు ప్రత్యక్షంగా పాల్గొన్నారని బిఆర్ఎస్ సీనియర్ నేత పెద్దిరెడ్డి సుదర్శన్ రెడ్డి ఆరోపించారు. ఈ కుంభకోణంలో రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డినే ప్రధాన పాత్రధారులు అని పేర్కొన్నారు. పౌరసరఫరాల శాఖలో కుంభకోణంపై మాజీ మంత్రి గంగుల కమలాకర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి)కి ఫిర్యాదు చేశారు. అనంతరం తెలంగాణ భవన్‌లో వారు మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి సుదర్శన్ మాట్లాడుతూ.. పద్దెనిమిది నెలల క్రితం జరిగిన ధాన్యం కొనుగోలు -టె-ండర్ల కుంభకోణంపై ఇప్పటికే ఎనిమిది సార్లు ప్రెస్‌మీట్ పెట్టామని, ఇదే అంశంపై అసెంబ్లీలో తమ నేతలు కెటిఆర్, హరీశ్‌రావు లేవనెత్తినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన రాలేదని అన్నారు. దీనిపై హైకోర్టును కూడా ఆశ్రయించామని తెలిపారు. రైస్ మిల్లర్ల నుంచి బిడ్డర్లు ధాన్యం టన్నుకు రూ.2230 అదనంగా వసూలు చేసి కాంగ్రెస్ పెద్దలకు పంపించారని ఆరోపించారు. అక్రమంగా డబ్బులు చేరిన 187 ఖాతాల వివరాలను సేకరించామని తెలిపారు. ఇందులో మనీలాండరింగ్ జరిగిందని పేర్కొన్నారు. తాము సేకరించిన ఆధారాలతో ఇడికి ఫిర్యాదు చేశామని చెప్పారు. ఇడితో పాటు- సిబిఐ, డైరెక్టరేట్ ఆఫ్ ఇం-టె-లిజెన్స్‌కు కూడా ఫిర్యాదు చేస్తున్నామని తెలిపారు. మొత్తం 700 పేజీలకు పైగా బుక్‌లెట్ తయారుచేసి దర్యాప్తు సంస్థలకు పంపిస్తున్నట్లు- వెల్లడించారు. ఈ కుంభకోణంలో తప్పకుండా దోషులకు శిక్ష పడుతుందని .. ఎవ్వరూ తప్పించుకోలేరని ఆశాభావం వ్యక్తం చేశారు. పౌరసరఫరాల శాఖలో జరిగిన ఈ కుంభకోణంపై బిజెపి స్పందించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందని అన్నారు. ఈ దోపిడీని బయటపెట్టామని అన్నారు. రూ.423 కోట్లు- వివిధ బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ అయ్యాయని చెప్పారు. ఎన్నిసార్లు కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు అడిగినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడమే ఈ కుంభకోణం జరిగిందని అనడానికి రుజువని అన్నారు. ఈ అవినీతి ఇంకా కొనసాగుతూనే ఉందని తెలిపారు. ధాన్యం కొనుగోలు టెండర్లలో మొదటి నుంచి అవకతవకలు జరిగాయని మాజీ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ప్రభుత్వ ఖజానాల్లోకి రావాల్సిన డబ్బులు ప్రైవేటు- వ్యక్తుల ఖాతాల్లోకి వెళ్లాయని ఆరోపించారు. ఈ స్కాంపై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని తెలిపారు. ఈ కుంభకోణంపై ఎసిబి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. దర్యాప్తు సంస్థల మీద తమకు విశ్వాసం ఉందని, అందుకే రాష్ట్రంతో పాటు కేంద్రంలో దర్యాప్తు సంస్థలకు ఈ కుంభకోణంపై ఫిర్యాదు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ స్కాంపై కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి ఇప్పటికైనా నోరు తెరవాలని డిమాండ్ చేశారు.

## బీసీ రిజర్వేషన్ల విషయంలో మభ్య పెడుతున్న కాంగ్రెస్

**- పాత రిజర్వేషన్లతో ఎన్నికలు జరిపేలా కుట్రలు**

**- ఢిల్లీకి వెళతామని కొత్త డ్రామాలకు తెర లేపారు**

**- ఆగస్ట్ 8న కరీంనగర్ వేదికగా బిసి సభ**

**- మాజీమంత్రి తలసాని శ్రీనివాస యాదవ్**



**హైదరాబాద్,జూలై29( వెలుతురు):**

బీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రజలను కాంగ్రెస్ మభ్య పెడుతోందని భారత రాష్ట్ర సమితి నేత, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. చివరికి పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలకు వెళ్తుందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆడుతున్న నాటకాలను ప్రజలు తిప్పికొట్టాలని కోరారు. మాజీ స్పీకర్ మధుసూదనాచారి, పార్టీ నేతలతో కలిసి తెలంగాణ భవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ నేతలు హామీ ఇచ్చారు. ఎలా చేస్తారని అప్పుడు అడిగితే మా వ్యూహం మాకు ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నెపమంతా భాజపా, భారత రాష్ట్ర సమితిపై నెట్టేస్తోంది. 42 శాతం రిజర్వేషన్ల ప్రకారమే స్థానిక ఎన్నికలు నిర్వహించాలన్నారు. కార్పొరేషన్ ఛైర్మన్ పదవుల విషయంలో బీసీలకు ఎందుకు ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. భారత రాష్ట్ర సమితి తరఫున కూడా రాష్ట్రపతిని కలిసి.. 42 శాతం రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాలని కోరతాం. అధికార యంత్రాంగంలోనూ కీలకమైన స్థానాలను ఓ అగ్రవర్ణం వారికే ఇచ్చారు. కార్పొరేషన్ పదవుల్లో సగం బీసీలకు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తలసాని డిమాండ్ చేశారు. ఆగస్టు 8వ తేదీన కరీంనగర్ జిల్లాలో బీసీల భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు- ఈ సదర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ల అమలుపై తెలంగాణ భవన్‌లో మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన బీసీ ముఖ్య నాయకులు సమావేశమయ్యారు. మొదటి నుండి కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేస్తూ వస్తుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ తరపున త్వరలోనే బీసీ ప్రతినిధుల బృందం రాష్ట్రపతిని కలవనుందని తెలిపారు. ఓట్ల కోసమే కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలు ఇచ్చిందని మండిపడ్డారు. పారదర్శకత లేకుండా కులగణన జరిపి, హడావుడి గా అసెంబ్లీలో ప్రభుత్వం బిల్లును పెట్టిందన్నారు. రాష్ట్రపతి వద్ద బిల్లు పెండింగ్‌లో ఉండగానే ఆర్డినెన్స్ తీసుకొస్తామనడం రాజ్యాంగ విరుద్ధం. 9వ షెడ్యూల్‌లో చేర్చితేనే చట్టబద్ధత లభిస్తుందని అసెంబ్లీలో తాము స్పష్టం చేసినం. అమలు కాదని తెలిసే కాలయాపన చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మభ్య పెడుతుందన్నారు. ఢిల్లీలో ధర్నా చేస్తామనడం కొత్త డ్రామాకు కాంగ్రెస్ కుట్ర చేస్తోందని అన్నారు. బిజెపి, కాంగ్రెస్ పార్టీల వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్తాము. మీ చేతుల్లోనే ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీలో 42 శాతం రిజర్వేషన్ ఎందుకు అమలు చేయరు. మిగిలిన మూడు మంత్రి పదవులను బీసీలకు ఇచ్చి చిత్తశుద్ధి నిరూపించుకోవాలి. వివిధ ప్రభుత్వ శాఖలలో కూడా బీసీలను అణచివేస్తున్నారు. 42 శాతం రిజర్వేషన్ అమలు చేయకుండా ఎన్నికలు జరిపితే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బొంద పెట్టేందుకు బీసీలు సిద్ధంగా ఉన్నారని తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు.

## జూబ్లీహిల్ ఉప ఎన్నికల్లో గెలుస్తాం: పొన్నం

**హైదరాబాద్,జూలై29( వెలుతురు):**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. అభ్యర్థుల విషయంలో కాంగ్రెస్ నుంచి గట్టి పోటీ ఉందని వివరించారు. పలువురు నేతలు జూబ్లీహిల్స్ నుంచి పోటీకి ఆసక్తి చూపుతున్నట్లు- పేర్కొన్నారు. పార్టీ అధిష్ఠానం ఎవరికి టికెట్ ఇస్తే వారే పోటీ- చేస్తారని తెలిపారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అభ్యర్థిపై సర్వే జరుగుతోందని వెల్లడించారు. అభ్యర్థులు ఎవరున్నా.. అందరూ కలిసి పనిచేస్తారని తెలిపారు. జూబ్లీహిల్స్‌లో ఈసారి కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ చేస్తున్నమంచి పనులే గెలిపిస్తాయని అన్నారు. బిఆర్ఎస్‌ను ఎవరూ నమ్మడం లేదన్నారు.

## అచ్చంపేట నియోజకవర్గంలోని సంక్షేమ, గురుకుల హాస్టల్స్ వార్డెన్లు, ప్రిన్సిపాల్స్ తో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే డా చిక్కుడు వంశీకృష్ణ

**వెలుతురు న్యూస్, అచ్చంపేట జూలై 29:** వర్షాకాల నేపథ్యంలో హాస్టల్స్, స్కూల్స్ లో శానిటేషన్ మెరుగుపరచుకోవాలని మెనూ ప్రకారం పిల్లలకు తప్పకుండా పౌష్టిక ఆహారం అందించాలని పిల్లల ఆరోగ్యం విషయంలో జాగ్రత్త వహించాలని, వార్డెన్స్ తప్పనిసరిగా హాస్టల్ ఆవరణలోనే నివాసం ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ తెలిపారు. అచ్చంపేట లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రజా భవన్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో నియోజకవర్గంలోని అన్ని హాస్టల్స్ సంక్షేమ గురుకుల వార్డెన్స్ ప్రిన్సిపల్ తో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకులాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. ఎస్సీ ఎస్టీ, బీసీ మైనారిటీ సంక్షేమ, విద్యాశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న సంక్షేమ హాస్టల్, రెసిడెన్షియల్ గురు కులాల, కేజీబీవీ నిర్వహణపై అదనపు కలెక్టర్ అమరేందర్ , డీఈఓ రమేష్ కుమార్, ఎస్సీ కార్పోరేషన్ ఈడి, జిల్లా అధికారులు సంబంధిత హాస్టల్ వార్డెన్‌లు, గురుకులాల ప్రిన్సిపాల్ లతో రివ్యూ నిర్వహించి



చర్చించారు. సంక్షేమ హాస్టల్స్, రెసిడెన్షియల్ గురుకులాలో పారిశుధ్య నిర్వహణ, విద్యార్థులకు అందించే ఆహారం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పారిశుధ్య నిర్వ హణ నిరంతర ప్రక్రియగా ఉండాలని, వర్షాకాలం పూర్తయ్యే




వరకు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈగలు, దోమలు రాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని హాస్టల్ పరిసరాల్లో ఎక్కడ నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. పిచ్చిమొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలని గురుకులాల్లో, సంక్షేమ హాస్టల్లో ఎక్కడా డార్క్‌ఏరియా ఉండవద్దని, ప్రతిచోట లైట్ ఉండాలని తెలిపారు. తాగునీటి సరఫరా నాణ్యతను పరి శీలించాలన్నారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో ఏదైనా సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. హాస్టల్స్ పరిసరాలలో ఎక్కడైనా పాములు, తేళ్లు ఉండకుండా పరిశీలించాలని, ఒకవేళ ఎక్కడైనా గుర్తిస్తే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం వైరల్ జ్వరాల వ్యాప్తి అధికంగా ఉన్న నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏఎన్ఎంల ద్వారా విద్యార్థులకు అవసరమైన పరీక్షలు నిర్వహించాలని, అవసరమైన మందులు అందుబాటులో పెట్టాలని, వైరల్ జ్వరాలు లక్షణం గల పిల్లలకు వైద్య సహాయం అందజేయాలని ఆదేశించారు. పిల్లలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ఆహారం తీసుకునే ముందు, మరుగుదొడ్లు వినియోగించిన తర్వాత చేతుల ను విద్యార్థులు తప్పనిసరిగా శుభ్రం చేసుకునేలా చూడాలని సూచించారు. రెసిడెన్షియల్ గురుకులాలు, సంక్షేమ హాస్టల్స్‌లో స్టాఫ్ పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా వార్డెన్స్ చూడాలని, విద్యా ర్థులకు అందించే ఆహారం వేడిగా ఎప్పటికప్పుడు తయారు చేసి అందించాలని, నిల్వ ఉంచిన భోజనం పెట్టవద్దని ఆదేశించారు. ఫుడ్ పాయిజన్ వంటి ఘటనలు జరిగితే కఠినంగా వ్యవహరిస్తామని, ప్రిన్సిపాల్స్, హాస్టల్ వార్డెన్‌లు బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రిన్సిపల్స్ వార్డెన్స్ ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో అధ్వాన్న పరిస్థితులు

సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ.. మిథున్‌రెడ్డి అరెస్ట్ బాధాకరమన్నారు. మిథున్‌ను, గౌతం రెడ్డిని రాజకీయాల్లో నా ద్వారా వచ్చారు. నన్ను చూసి ప్రేరణ పొంది రాజకీయాల్లోకి వచ్చారు. వారి తండ్రులతో కన్నా, వీరితోనే నాకు ఎక్కువ సాన్నిహిత్యం. నన్ను చూసి వాళ్లు రాజకీయాల్లోకి వచ్చారు. రాష్ట్రంలోని అంశాలకు మిథున్‌కు ఏం సంబంధం?. మిథున్ తండ్రి పెద్దిరెడ్డిగారు ఆ శాఖను కూడా చూడలేదు. కేవలం వేధించాలన్న ఉద్దేశంతో తప్పుడు కేసులు పెట్టారు. చంద్రగిరి చంద్రబాబు సొంత నియోజకవర్గం. గతంలో చంద్రబాబు మంత్రిగా పనిచేసి చంద్రగిరిలో ఓడిపోయారు. తర్వాత ఎన్టీఆర్ కాళ్లు పట్టుకుని మళ్లీ టీడీపీలో చేరాడు. తర్వాత చంద్రగిరి నుంచి కుప్పం పారిపోయాడు. కుప్పం బీసీల నియోజకవర్గం కాబట్టి అక్కడికి వెళ్లిపోయాడు. చంద్రబాబు కంట్లో భాస్కర్‌రెడ్డి నలుసులా మారాడు. భాస్కర్ కొడుకును కూడా జైలులో పెట్టాలని కుట్రపన్నాడు. భాస్కర్ కొడుకు లండన్‌లో చదువుకుని వచ్చాడు. అలాంటి వారిమీద కూడా కేసులు పెట్టి అరెస్టు చేయాలని చూస్తున్నారు. నందిగం సురేష్, ఒక సాధారణ స్థాయి నుంచి ఎంపీగా ఎదిగాడు. గట్టిగా తన స్వరాన్ని వినిపిస్తున్నాడని 191 రోజులు జైల్లో పెట్టారు. కేసు మీద కేసు పెట్టి వేధిస్తున్నారు. కాకాణి గోవర్ధన్ మీద కూడా కేసులు మీద కేసులు పెట్టారు. .టోల్‌గేట్ల వద్ద ఫీజుల వద్దకూడా వసూలు చేశారని తప్పుడు కేసు. లేని అక్రమాలు చూపించి.. తప్పుడు కేసులు పెడుతున్నారు. ఇప్పుడు మళ్లీ మరో మాజీ మంత్రి అనిల్ కుమార్ మీద తప్పుడు కేసులు పెడుతున్నారు. దీని కోసం తప్పుడు వాంగ్మూలం చెప్పించే ప్రయత్నంచేశారు. మెజిస్ట్రేట్ వద్ద తనపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని శ్రీకాంత్‌రెడ్డి అనే వ్యక్తి చెప్పాడు. పార్టీలో ఇలా ముఖ్యమైన, క్రియాశీలకంగా ఉన్నవారిపై కేసులు పెడుతున్నారు. ప్రజల తరఫున గొంతు వినిపించనీయకూడదన్నది చంద్రబాబు ఉద్దేశం. చంద్రబాబు పాలన ఘోరంగా ఉంది. అసలు పరిపాలనే కనిపించడంలేదన్నారు. .సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ సహా ఏ హామీలు నిలబెట్టుకోలేదు. ఘోరంగా వైఫల్యం చెందాడు కాబట్టే... ఈ తప్పుడు కేసులు. మాజీ మంత్రి రోజా మీద తీవ్రంగా దుర్భాషలాడారు. మన పార్టీలో ఉన్న మహిళలకు ఆత్మగౌరవం ఉండదా?. బీసీ మహిళ, కృష్ణాజడ్పీ ఛైర్మన్ హారిక మీద నేరుగా దాడులు చేశారు. నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిమీద హత్యాయత్నమే లక్ష్యంగా దాడులు చేశారు. ఆ రోజు ప్రసన్న ఇంట్లో ఉండి ఉంటే.. ఆయన పరిస్థితి ఏంటి?. రాడ్లతో, కర్రలతో దాడులు చేశారు. తాడిపత్రి నియోజకవర్గ హెడ్ క్వార్టర్‌కు మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి వెళ్లలేకపోతున్నాడు. .ఏకంగా సీఐ గన్ చూపించి మనుషులను భయపెట్టే ప్రయత్నంచేస్తున్నాడు. కొంతమంది డీఐజీలు, పోలీసు అధికారులు అవినీతిలో భాగస్వామ్యం అయ్యారు. ఈ కొంతమంది పోలీసులు కలెక్షన్ ఏజెంట్లుగా మారారు. అధికారపార్టీ ఎమ్మెల్యేలకు కలెక్షన్లు పంచుతున్నారు. ముఖ్య నేతకు, ముఖ్య నేత కొడుక్కి.. కలెక్షన్లు పంచుతున్నారు. వ్యవస్థీకృతంగా అవినీతి జరుగుతోంది. బెల్టుషాపులకు వేలం పాటలు వేస్తున్నారు. ఇసుక మాఫియా, లిక్కర్ మాఫియా, క్వార్ట్జ్, సిలికా, లెటరైట్ మాఫియాలు జరగుతున్నాయి. కొంతమంది పోలీసు అధికారుల సహాయంతో అవినీతిపై పంచాయతీలు చేయిస్తున్నారు. మనం ఎప్పుడూ చూడని విధంగా అవినీతి జరుగుతోందని జగన్ అన్నారు. రేషన్ బియ్యం మాఫియా కొనసాగుతోంది. పేకాట క్లబ్బులు నడుస్తున్నాయి. కొంతమంది డీఐజీలు కలెక్షన్ ఏజెంట్లు-గా పనిచేస్తున్నారు. రాష్ట్ర చరిత్రలో ఇంత అధ్వాన్నమైన పరిస్థితులు ఎప్పుడూ చూడలేదు. మహిళలకు నెలకు రూ.1500 ఇస్తానని, ఇప్పుడు రాష్ట్రాన్ని అమ్మాలి అంటున్నారు, ఇంతకన్నా పచ్చిమోసం ఉంటుందా?. ఫీజురియింబర్స్ మెంట్ ఇవ్వకపోవడం వల్ల పిల్లల చదువులు మానేస్తున్న పరిస్థితులు వచ్చాయి. రూ.4200 కోట్లు- పీజు రియింబర్స్ మెంట్ బకాయలు ఉన్నాయి, ఆరు క్వార్టర్లనుంచి పెండింగ్. వసతీ దీవెన కింద రూ.2200 కోట్లు- బకాయిలు ఉన్నాయి. ఆరోగ్యశ్రీ బిల్స్ నెలకు రూ.300 కోట్ల చొప్పున, రూ.4200 కోట్లు- పెండింగ్. ఆరోగ్య ఆసరా కింద ఒక్క పైసా ఇవ్వడంలేదు. నెట్ వర్క్ ఆస్పత్రులు చేతులు ఎత్తివేశాయి. ఏ రైతుకూ, ఏ పంటకూ గిట్టు-బాటు- ధర లేదు. రైతులను పరామర్శించడానికి వెళ్తే కేసులు పెడుతున్నారు. ఉచిత పంటల బీమా తీసేశారు. ఆర్బీకేలు, ఇ- క్రాప్ నిర్వీర్యం. నాడు-నేడు పనులు ఆగిపోయాయి. స్కూళ్లు మూసేస్తున్నారు. రాష్ట్రంలో అసలు పాలన ఎక్కడుంది?. రెండేళ్లపాటు- కోవిడ్ ఉన్నా.. మనం ప్రజలకు మెరుగైన సంక్షేమం అందించాం అని వివరించారు. ఐదేళ్లలో మనం చేసిన అన్నిరకాల అప్పులు రూ.3.32 లక్షల కోట్లు- చేశాం. ఈ 14 నెలల్లో చంద్రబాబు అందులో 52 శాతం వెళ్లాడు. కేవలం దోచుకున్న డబ్బులు దాచుకోవడానికి మాత్రమే సింగపూర్ పర్యటన. పోర్టులు, హార్బర్లు కట్టాం, స్కూళ్లు బాగుచేశాం, ఆర్బీకేలువ కట్టాం, సచివాలయాలు కట్టాలం, విలేజ్ క్లినిక్స్ కట్టాం, మెడికల్ కాలేజీలు కట్టాం. రాష్ట్రానికి రావాల్సిన ఆదాయాలు రావడంలేదు, అంతా దోచుకుంటున్నారు. దేశం ఆదాయం సగటున 12 శాతం పెరిగితే, రాష్ట్రం ఆదాయాలు 3శాతంకూడా పెరగడంలేదు. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాలు ఆయన జేబులోకి పోతున్నాయన్నారు. చంద్రబాబు ఏదైతే విత్తారో అదే చెట్టవుతోంది. రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో.. కార్యక్రమం కింద బాబు ష్యూరిటీ-, మోసం గ్యారంటీ-.. కార్యక్రమాలు బాగా జరుగుతున్నాయి. మండలాల్లో కూడా దాదాపుగా పూర్తికావొచ్చింది. 90 నియోజకవర్గాల్లో గ్రామస్థాయిలోకూడా ప్రారంభమై ముమ్మరంగా సాగుతోంది. వచ్చే నెలలో రచ్చబండ కార్యక్రమం ద్వారా గ్రామస్థాయిలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ- కార్యక్రమం ఉధృతంగా చేయాలి. క్యూ ఆర్ కోడ్ ద్వారా చంద్రబాబు ఇచ్చిన వాగ్దానాలు, ప్రతి కుటుంబానికీ ఎంత బాకీ పడ్డాడో చెప్పాలి అన్నారు.పార్టీ పరంగా ఉన్న వ్యవస్థలను ఉపయోగించుకోవాలి. చిన్న చిన్న విభేదాలను రూపుమాపి అందర్నీ ఒక్కతాటిపైకి తీసుకు రావాలి. పార్టీని బలోపేతం చేసుకోవడానికి ఇదో మంచి అవకాశం. పార్టీకోసం కష్టపడేవారు ఎవరన్నది ఇప్పుడే బయటకు వస్తుంది. పార్టీలో మంచి గుర్తింపు పొందడానికి ఇదొక అవకాశం అన్నారు. ఇకపోతే వైఎస్ జగన్ భద్రతపై పీఏసీ సమావేశంలో ఆందోళన వ్యక్తమమైంది. జరుగుతున్న పరిణామాలు చూస్తే చాలా ఆందోళనకరంగా ఉందని పీఏసీ సభ్యులు తెలిపారు. 'మీరు భద్రంగా ఉంటేనే మేం, ప్రజలు బాగుంటాం. ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగానే వైయస్.జగన్ భద్రతపై సమస్యలు సృష్టిస్తోంది. ఏ పర్యటన చూసినా భద్రతా లోపాలు చాలా స్పష్టంగా కనిపిస్తున్నాయి. భద్రత విషయంలో ఉపేక్షించడం కరెక్టు కాదు. మీ భద్రత విషయంలో కొత్త కొత్త వార్లు వింటు-న్నాం. మా అందరికీ చాలా ఆందోళన కరంగా ఉంది. తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది' అని ఇందులో రాజీ వద్దని పీఏసీ సభ్యులు.. జగన్‌కు సూచించారు. బంగారుపాళ్యం సహా ఇతర పర్యటనల్లో భద్రత విషయంలో పోలీసులు, ప్రభుత్వం కావాలనే రాజీ పడిందన్నారు.

## సింగపూర్ దేశాధ్యక్షుడు థర్మన్ షణ్ముగరత్నంతో భేటీ

అవకాశాలపై ఈ భేటీలో వీరిద్దరూ విస్తృతంగా చర్చించారు. ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలు, ముఖ్యంగా డిజిటల్, గ్రీన్ ఎనర్జీ రంగాలకు ఉన్న అపారమైన అవకాశాలను సింగపూర్ అధ్యక్షుడికి వివరించారు చంద్రబాబు. రాష్ట్రంలో పెట్టు-బడులకు గల సానుకూల వాతావరణం, నూతన పారిశ్రామిక విధానాలను తెలిపారు. ఏపీలో సింగపూర్ సంస్థలు పెట్టు-బడులు పెట్టడం ద్వారా ఇరు ప్రాంతాలు లబ్ధి పొందుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. సింగపూర్ దేశాధ్యక్షుడు థర్మన్ షణ్ముగరత్నం ఏపీతో గత భాగస్వామ్యాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. భవిష్యత్తులో పరస్పర సహకారాన్ని అందించేందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ భేటీ- ద్వారా ఏపీ, సింగపూర్ మధ్య ఆర్థిక సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని ఆశాభావం వ్యక్తమవుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో డేటా సెంటర్ల ఏర్పాటుకు అనుకూలమైన వాతావరణం ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రత్యేకించి విశాఖపట్నంలో అందుకు అవసరమైన ఎకో సిస్టమ్ సైతం ఏర్పాటు- చేసినట్లు- తెలిపారు. సింగపూర్ పర్యటనలో భాగంగా మంగళవారం ఆ దేశ పారిశ్రామికవేత్తలు, ప్రముఖ కంపెనీల సీఈఓలు, ప్రతినిధులతో చంద్రబాబు రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. డేటా సెంటర్లు, ఐటీ-కంపెనీల ఏర్పాటు-కు విశాఖ అత్యుత్తమ ప్రదేశమని ఈ సందర్భంగా వారికి వివరించారు. త్వరలో గూగుల్ డేటా సెంటర్ సైతం విశాఖపట్నం వేదికగా ఏర్పాటు- కానుందని తెలిపారు. అలాగే టీ-సీఎస్, కాగ్నిజెంట్ సహా వివిధ ఐటీ-దిగ్గజ సంస్థలు విశాఖపట్నంలో తమ సంస్థలను ఏర్పాటు-చేస్తున్నాయని సోదాహరణగా వివరించారు. దేశంలోనే తొలి



క్వాంటం వ్యాలీ అమరావతిలో ఏర్పాటు- చేస్తున్నామని ప్రకటించారు. 2026 జనవరి నాటికి ప్రారంభమయ్యే క్వాంటం వ్యాలీలో సింగపూర్ కంపెనీలు పెట్టు-బడులు పెట్టేందుకు అవకాశముందని అభిప్రాయపడ్డారు. ఈ క్వాంటం వ్యాలీ ప్రాజెక్టు ప్రయోజనాలను సింగపూర్ కంపెనీలు పొందటంతోపాటు- పరిశోధనలకూ ఆస్కారం ఉందని ఆ దేశ పారిశ్రామికవేత్తలకు సీఎం చంద్రబాబు వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో పరిశ్రమలు, పెట్టు-బడులకు అనుకూలంగా 20కిపైగా పాలసీలు అమలు చేస్తున్నామన్నారు. పారిశ్రామిక విధానాలతోపాటు- పెట్టు-బడులకు ఉన్న అన్ని అవకాశాలను ఈ రౌండ్ టేబుల్ సమావేశం వేదికగా వారికి సీఎం చంద్రబాబు వివరించారు. ఈ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్సుకు మంత్రులు నారా లోకేష్, టీ-జీ భరత్, పి.నారాయణతోపాటు- పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సమావేశానికి మొత్తం 41 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై.. తమ తమ అభిప్రాయాలు తెలియజేశారు. ఈ పర్యటనలో భాగంగా స్థానిక జురాంగ్ పెట్రో కెమికల్ ఐల్యాండ్‌ను సీఎం చంద్రబాబు నాయుడు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏపీ తీర ప్రాంతంలోని కాకినాడ, మచిలీపట్నం, కృష్ణపట్నం పోర్టులను కలుపుతూ పారిశ్రామిక - లాజిస్టిక్ కారిడార్ ఏర్పాటు- చేస్తామని స్పష్టం చేశారు. ఈ పోర్టులను అనుసంధానం చేయడంతోపాటు- వీటికి సమీపంలో ప్రపంచ శ్రేణి చమురు రిఫైనరీ ఏర్పాటు- కానుందని పేర్కొన్నారు. ప్రతిష్టాత్మక జురాంగ్ పెట్రో కెమికల్ ఐల్యాండ్‌ను సీఎం చంద్రబాబుతోపాటు- మంత్రుల బృందం సందర్శించింది. ఈ ఐల్యాండ్ వేదికగా సృష్టించిన సమీకృత పారిశ్రామిక ప్రాజెక్టు సహా ఇతర మౌలిక సదుపాయాలను ముఖ్యమంత్రి బృందం పరిశీలించింది. సముద్రాన్ని పూడ్చి నిర్మించిన దీవిలో సమీకృత పెట్రో కెమికల్ ఎ÷-లాంట్, ఇంధన కేంద్రాన్ని సింగపూర్ ఏర్పాటు- చేసింది. ఈ కేంద్రం అందిస్తున్న సేవలను సింగపూర్ ఉన్నతాధికారులు సీఎం బృందానికి సోదాహరణగా వివరించారు. ఈ కేంద్రం ఏర్పాటు- కోసం చేసిన ప్రణాళికలు, వివిధ యుటిలిటీ- మోడల్స్‌తోపాటు- లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాలను చూపించారు. పెట్రో కెమికల్ కేంద్రంలో ముడి చమురు ప్రాసెసింగ్ పక్రియతోపాటు- ఇతర ఉత్పత్తులైన పాలిమర్లు, ఇంధనాలు, స్పెషాలిటీ- కెమికల్స్‌ను వారికి వివరించారు. మొత్తం 3 వేల హెక్టార్ల సముద్రాన్ని భూమిగా మార్చి అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ పెట్రో కెమికల్ హబ్‌ను ఏర్పాటు- చేసినట్టు- జురాంగ్ పెట్రో కెమికల్ ఐల్యాండ్ ఉన్నతాధికారులు వివరించారు. ప్రభుత్వ- ప్రైవేటు- భాగస్వామ్యంతో ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును నిర్మించినట్టు- తెలిపారు. ఈ భారీ ప్రాజెక్టులో వ్యర్థాల నిర్వహణ ఎ÷-లాంట్‌తోపాటు- సమీకృత భద్రతా వ్యవస్థలనూ ఏర్పాటు- చేశామని స్పష్టం చేశారు. మరోవైపు ఏపీ పారిశ్రామిక ప్రగతిలో సింగపూర్ కంపెనీలు కూడా గ్లోబల్ పార్టనర్‌లుగా కలిసి రావాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. అందుకు వారు సానుకూలంగా స్పందించారు. పెట్రో కెమికల్ ఐల్యాండ్ సందర్శనకు విచ్చేసిన ఏపీ సీఎం చంద్రబాబు ప్రతినిధి బృందానికి ఆ సంస్థ ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు.

# 4వేల టన్నుల బొగ్గు మాయంపై హైకోర్టు ఆగ్రహం

**- వానదేవుడే బొగ్గును మాయం చేశాడు**

**- భారీ వర్షాలకు కొట్టుకు పోయి ఉంటుంది**

**- మేఘాలయ మంత్రి ఆసక్తికర సమాధానం**



**షిల్లాంగ్, జులై 29 వెలుతురు :**
మేఘాలయాలో సుమారు నాలుగు వేల టన్నుల బొగ్గు అదృశ్యమైంది. ఆ నల్ల బంగారం మాయం కావడం పట్ల రాష్ట్ర సర్కారుపై హైకోర్టు సీరియస్ అయ్యింది. బొగ్గు ఎక్కడికెళ్లిందో చెప్పాలని కోర్టు నిలదీసింది. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రానికి చెందిన ఎక్సైసజ్ శాఖ మంత్రి కిర్మెన్ షిల్లా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బహుశా వర్షాలు, వరదల వల్ల ఆ బొగ్గు కొట్టుకుపోయి ఉంటుందని ఆయన అన్నారు. జోరు వానల వల్ల బొగ్గు మాయమై ఉంటుందన్నారు. రాజాజూ, డెంగన్‌గాన్ గ్రామాల్లో ఉన్న బొగ్గు నిల్వల నుంచి సుమారు 4 వేల టన్నుల బొగ్గు కనిపించకుండాపోయింది. ఆ కేసులో అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. బొగ్గు మాయం గురించి అడిగిన సమయంలో మంత్రి మాట్లాడుతూ.. మేఘాలయాలో అత్యధిక వర్షపాతం కురుస్తుందని, మీకు ఈ విషయం తెలియదని, ఆ వానల వల్ల బొగ్గు కొట్టుకుపోయే ఛాన్సు ఉందని అన్నారు. బొగ్గు ఎలా అదృశ్యమైందో చెప్పడం తన ఉద్దేశం కాదు అని, సహజ పద్ధతిలో ఆ బొగ్గు మాయమైందా లేక అక్రమ విధానాల వల్ల అది పోయిందా అన్న విషయాన్ని తేల్చలేకపోతున్నట్లు- ఆయన చెప్పారు. మేఘాలయాలో 2014 నుంచి బొగ్గు మైనింగ్‌ను నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆపేసింది. పర్యావరణ కారణాలు, అసురక్షిత పద్ధతుల వల్ల బొగ్గు తొవ్వకాలను నిలిపివేశారు. మేఘాలయాలో అక్రమ రీతిలో మైనింగ్ జరుగుతున్నట్లు- ఆరోపణలు ఉన్నాయి. అయినా ఈ ఏడాది ఆరంభంలో ఈస్ట్ జైంతియా కొండల్లో బొగ్గు మైనింగ్‌ను ప్రారంభించారు. ఒకవేళ బొగ్గు మాయమైనా.. అది బ్రతకడం కోసమైతే అక్రమంగా జరిగి ఉంటుందేమో అని, లేదంటే ఆ బొగ్గును ఎవరు తీసుకెళ్తారని మంత్రి అన్నారు.

# కేరళ నర్సు నిమిష ప్రియ ఉరిశిక్ష

**- రద్దయ్యిందన్న వార్తలను ఖండించిన కేంద్రం**




**న్యూఢిల్లీ, జులై 29 వెలుతురు :**
కేరళ నర్సు నిమిష ప్రియ ఉరిశిక్ష రద్దయ్యిందంటూ వస్తున్న వార్తలపై కేంద్ర ప్రభుత్వ వర్గాలు ఖండించాయి. అవన్నీ అవాస్తవమని పేర్కొన్నాయి. నిమిష ప్రియ ఉరిశిక్ష రద్దు కాలేదని మంగళవారం వెల్లడించాయి. నిమిష ఉరిశిక్షను రద్దు చేస్తూ యెమెన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందంటూ భారత గ్రాండ్ ముఫ్తీ, సున్నీ మత ప్రబోధకుడు కాంతపురం ఏపీ అబూబకర్ ముస్లియార్ కార్యాలయం సోమవారం రాత్రి ప్రకటించింది. అక్కడ జరిగిన ఉన్నత స్థాయి భేటీలో ఉరిశిక్షణ రద్దు నిర్ణయం తీసుకున్నట్లు- తెలిపింది. దీనిపై భారత విదేశాంగ శాఖ వర్గాలు తాజాగా స్పందించాయి. నిమిష మరణశిక్ష రద్దు చేశారంటూ కొంత మంది వ్యక్తులు నుంచి వచ్చిన సమాచారం అవాస్తవమని వెల్లడించాయి. ఈ విషయంపై తమకు యెమెన్ నుంచి ఇప్పటి వరకూ ఎలాంటి అధికారిక సమాచారం రాలేదని పేర్కొన్నాయి. యెమెన్ జాతీయుడు మహద్ హత్యకేసులో నిమిష ప్రియకు మరణశిక్ష పడిన విషయం తెలిసిందే. మహద్‌తో కలిసి ఆమె వ్యాపారం చేసింది. అయితే ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో ఆమె తన పాస్‌పోర్టు కోసం అడిగింది. కానీ పాస్‌పోర్టు ఇచ్చేందుకు మహద్ నిరాకరించడంతో అతడికి మత్తుమందు ఇచ్చి తీసుకునేందుకు నిమిష ప్రయత్నించింది. అయితే డోస్ ఎక్కువ కావడంతో మహద్ మరణించాడు. దాంతో యెమెన్ పోలీసులు నిమిషను హత్య కేసులో అరెస్ట్ చేశారు. ఆమె ముందుగా స్థానిక కోర్టు మరణశక్ష విధించింది. ఆ శిక్షను టాప్ కోర్టు సమర్థించింది. దాంతో ఈ నెల 16న నిమిషకు ఉరిశిక్ష అమలు చేయనున్నట్లు- ప్రకటించారు. నిమిషకు శిక్ష తప్పించేందుకు చివరి నిమిషం వరకు ప్రయత్నించిన భారత ప్రభుత్వం.. ఇక తాను చేసేదేమీ లేదని చేతులెత్తేసింది. జూలై 16న అమలు చేయాల్సిన మరణశిక్ష చివరి నిమిషంలో వాయిదా పడింది.

# మానసిక సమస్యలతో సతమతం

**- ఆఫీస్ నుంచి దూకి టెక్కీ ఆత్మహత్య**

**ముంబై, జులై 29 వెలుతురు :**
మహారాష్ట్రలోని పుణెలో ఓ ఐటీ- ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నారు. జీవితంపై విరక్తితో ఆత్మహత్యకు పాల్పడ్డట్లు గుర్తించారు. ఆఫీసులో మీటింగ్ జరుగుతుండగా మధ్యలో బయటకు వెళ్లిన ఆ టెకీ.. భవనంపై నుంచి దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నాసిక్‌కు చెందిన 23 ఏళ్ల పీయూష్ అశోక్ కవాడే పుణెలోని హింజెవాడి ఐటీ- పార్క్‌లోని ఓ కంపెనీలో ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. రోజూలాగే సోమవారం ఉదయం ఆఫీసుకు వచ్చిన అతడు కంపెనీ మీటింగ్‌కు హాజరయ్యాడు. మధ్యలో అస్వస్థతగా ఉందని చెప్పి మీటింగ్ నుంచి బయటకు వచ్చాడు. ఆ తర్వాత కొన్ని క్షణాలకే బిల్డింగ్ ఏడో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో తోటి ఉద్యోగులంతా ఉలిక్కిపడ్డారు. సమాచారమందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద సూసైడ్ నోట్‌ను గుర్తించారు. జీవితంలో విఫలమయ్యా. నన్ను క్షమించండి. మీకు కొడుకుగా ఉండేందుకు నాకు అర్హత లేదని కుటుంబసభ్యులనుద్దేశిస్తూ లేఖ రాసినట్లు- పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు- తెలిపారు. పీయూష్ గతేడాది జులైలోనే ఈ కంపెనీలో చేరాడు. పనిఒత్తిడి, మానసిక సమస్యల కారణంగానే అతడు బలవన్మరణానికి పాల్పడి ఉంటాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# కాశ్మీర్‌లో సాధారణ పరిస్థితి ఉందని ఎలా చెబుతారు

**- ఉగ్రవాదుల దాడికి ఎవరు బాధ్యులో చెప్పరా?**

**- పహల్గామ్ దాడి ముమ్మాటికీ నిఘా వైఫల్యమే**

**- సిందూర్‌పై చర్చలో ప్రియాంక విమర్శలు**



**న్యూఢిల్లీ,జూలై29( వెలుతురు):**
జమ్మూకశ్మీర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని కేంద్రం చెబుతుండటంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ ప్రశ్నించారు. అంతా సజావుగానే ఉంటే, శాంతి భద్రతలు నెలకొని ఉంటే పహల్గాం ఉగ్రదాడి ఎలా జరిగిందని ప్రశ్నించారు. ఆపరేషన్ సిందూర్, పహల్గాం ఉగ్రదాడిపై లోక్‌సభలో రెండో రోజు మంగళవారం జరిగిన ప్రత్యేక చర్చలో ప్రియాంక గాంధీ మాట్లాడారు. భారత సాయుధ బలగాల సేవలు, త్యాగాలను ప్రశంసించారు. జాతీయ భద్రతపై చెక్కుచెదరని వారి సంకల్పాన్ని కొనియాడారు. పహల్గాంలో పర్యాటకులను దారుణంగా చంపారని, వివరాలు అడిగి మరీ చంపారని ప్రియాంక ఆవేదన వ్యక్తం చేశారు. భార్య కళ్లముందే శుభమ్ అనే వ్యక్తిని చంపేశారని అన్నారు. పహల్గాంలో పర్యాటకుల దగ్గర భద్రతా సిబ్బంది ఎందుకు లేరని సూటిగా ప్రశ్నించారు. పర్యాటకుల భద్రత కేంద్ర ప్రభుత్వానిది కాదా? అంటూ నిలదీశారు. ఇది నిఘా సంస్థల వైఫల్యం కాదా? అని ధ్వజమెత్తారు.పహల్గాం ఉగ్రదాడి బాధ్యత ఎవరిది? ప్రధాన మంత్రిదా? హోం మంత్రిదా? రక్షణ మంత్రిదా? నేషనల్ సెక్యూరిటీ- అడ్వయిజర్‌దా? ఎవరైనా రాజీనామా చేశారా? అని ప్రశ్నించారు. జాతీయ భద్రత విషయంలో తీవ్రలోపం జరిగిందన్నారు. ఉగ్రవాదాన్ని తుదముట్టించామని అమిత్‌షా చెబుతున్నారని, అయితే కశ్మీర్‌లో గతంలోనూ టీఎఆర్‌ఎఫ్ దాడులు చేసిందని గుర్తు చేశారు. టీఆర్‌ఎఫ్ వరుస దాడులు చేస్తుంటే కేంద్రం ఏం చేస్తోందన్నారు. రక్షణమంత్రి గంటసేపు సభలో చాలా విషయాలు మాట్లాడారని, కానీ ఒక పాయింట్ ప్రస్తావించలేదన్నారు. ఏప్రిల్ 12న పట్టపగలే ఉగ్రదాడి ఎలా, ఎందుకు జరిగిందో చెప్పలేదన్నారు. 2008 బాట్లా హౌస్ ఎన్‌కౌంటర్‌లో టెర్రరిస్టులను చంపినందుకు సోనియా గాంధీ కంటతడిపెట్టారంటూ హోంమంత్రి అమిత్‌షా ఆరోపించడాన్ని ప్రియాంక గాంధీ తిప్పికొట్టారు. తన కుటుంబం కూడా వ్యక్తిగతంగా నష్టపోయిందన్నారు. ఉగ్రవాదుల చేతిలో తన తండ్రి ప్రాణాలు కోల్పోయినప్పుడు తన తల్లి కన్నీళ్లు పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.




*శ్రావణమాసం వచ్చిందంటే ఖిల్లా పై శని సోమవారాల్లో సందడే సందడి ఉంటుంది. ప్రతి శ్రావణ మాసంలో మాత్రమే ఈ రామగిరి ఖిలాపై పర్యాటకులు వెళ్లి వస్తుంటారు. ఈ ఖిలాపై ఎన్నో కట్టడాలు మనకు దర్శనమిస్తాయి దీంతో ప్రతి శ్రావణమాసంలో లక్షల సంఖ్యలో పర్యాటకులు వచ్చి వెళ్లడం జరుగుతుంది. ఉమ్మడి కరీంనగర్ ప్రస్తుత పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ ప్రస్తుత రామగిరి మండలంలో బేగంపేట శివాలో గల రామగిరి ఖిలా చూడదగ్గ ప్రదేశాలకు నిలయంగా మారింది.*

**- ఆయుర్వేద మూలికలకు నిలయం రామగిరి ఖిలా.**

**- రామగిరి దుర్గం లో చూడముచ్చటైన ప్రదేశాలు....**

**- పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని పర్యాటకుల కోరిక....**

**- పురావస్తు కు నిలయం రామగిరి ఖిలా.**

### దాని విశేషాలు ఇలా ఉన్నాయి.

రామగిరి కి వెళ్లాలంటే పెద్దపల్లి నుండి మంథని కి వెళ్లే ప్రధాన రహదారి బేగంపేట క్రాస్ రోడ్డు నాగేపల్లి బస్టాండ్ వద్ద దిగి లోనికి వెళ్తే బేగంపేట గ్రామంలోని శివార్లలో మనకు రామగిరి కిల పైకి వెళ్ళవచ్చును. చారిత్రక



ప్రకృతి అందాలకు రామగిరి ఖిల్లా నిలయంగా ఉంది, చారిత్రాత్మక నేపథ్యం కలిగిన ఖిల్లాపై అద్భుత కట్టడాలు, కళా



ఆనవాళ్లకు సాక్ష్యంగా నిలు స్తూ.. అద్భుత కట్టడాలు.. శిల్ప కళలకు నిలయంగా ఉన్న రామగిరి ఖిల్లాపై శ్రావణమాసంలో సందడి మొదలైంది.. ప్రకృతి అందాలతో పర్యాటకులను ఆకర్షిస్తూ... ఆహ్లాదాన్ని పంచే ఖిల్లాకు ఆధ్యాత్మిక కేంద్రంగానూ గుర్తింపు ఉంది.. వందల ఏళ్ల చరిత్ర కలిగిన రామగిరి ఖిల్లాకు రాముడు నడియాడిన నేలగా పేరుంది... రామగిరి ఖిల్లాను పర్యాటక కేంద్రంగా మార్చాలనే డిమాండ్ ఎన్నో ఏళ్లుగా విని పిస్తున్నా.. ఆచరణలో మాత్రం అడుగు లు పడడం లేదు. అయితే ఏడాదిన్నర క్రితం ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రి శ్రీధర్ బాబు జిల్లా అభివృద్ధి కోసం రూ. 5 కోట్ల నిధులను మంజూరు చేయడంతో పర్యాటకులు, ఇక్కడి ప్రజల్లో ఆశలు చిగురించాయి. ప్రస్తుత ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదు.

### ప్రకృతి అందాలకు నిలయం..

సంపద ఇప్పటికి చెక్కు చెదరకుండా ఉంది. శ్రావణ మాసం మొదలు కావడంతో మరోసారి రామగిరి జిల్లా వై పు అందరి చూపు పడింది. ఆహ్లాదాన్ని పంచే ప్రకృతి రమణీయ అందాలను ఆస్వాదించేందుకు ప్రకృతి ప్రేమికులు ఖిలాను సందర్శించేందుకు వస్తున్నారు. రామగిరి దుర్గంపై కాకతీయుల కాలం లో అపురూపమైన శిల్పకళలు, కట్టడాలు నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది.

### రామగిరి ఖిల్లాపై శ్రావణ సందడి

సమేతుడైన శ్రీరామచంద్రుడు లక్ష్మణు డు. ఆంజనేయుడితోపాటు వనవాస సమయంలో రామగిరి దుర్గంపై విడిడి చేసినట్లుగా దీంతో పర్యాటక కేంద్రం గానే కాకుండా ఆధ్యాత్మిక కేంద్రంగానూ రామగిరి జిల్లా ప్రసిద్ధి చెందింది. 200 రకాలకు పైగా వన మూలికలు లభించే ఖిల్లా ఆయుర్వేద వైద్యానికి మూల కేంద్రంగా ఉంటుందని చరిత్ర చెబుతుంది.

### చారిత్రక నేపథ్యమిదే..!

క్రీ.శ1 శతాబ్దంలో రామగిరి కోటను నిర్మించారు. ఈ ప్రాంతాన్ని గౌతమిపుత్ర శాతకర్ణి పులోమావి పాలించినట్లు పెద్దబొంకూర్, గుంజపడుగు తవ్వ కాల్లో బయటపడిన ఆధారాలు తెలుపు తున్నాయి. చంద్రగుప్తుడు, బిందుసారు డు. అశోకుడు దుర్గాన్ని అభివృద్ధి చేశా రని చరిత్ర చెబుతుంది. క్రీ.శ 1158లో చాణక్య గుండ రాజును ఓడించి కాకతీ యులు రామగిరి దుర్గాన్ని స్వాధీనం చేసుకున్నారు. రామగిరి ఖిల్లాను ప్రతాపరుద్రుడు 1195 వరకు పాలించినట్లు చరిత్ర చెబుతోంది.

### ఖిల్లాలో నిర్మించిన ప్రవేశ ద్వారములు

ఓరుగల్లు మంత్రకూటముల శాసనాలు తెలియజేస్తున్నాయి. 1442 లో బహనీ సుల్తాన్లు ఆక్రమించుకోగా, వారి నుంచి రెడ్డి రాజులు స్వాధీనం చేసుకుంటు న్నట్లు ఆధారాలున్నాయి. 1595 లో మొగలాయిలు, 1606లో గోల్కొండ నవాబులు, తర్వాత మహ్మదీయులు నిజాం కాలం వరకు పాలించారు. కోటకు ఇరువైపులా 9 ఫిరంగులు, 40 తోపులుం డగా కాలక్రమేణా కేవలం ఒక్క ఫిరంగి మాత్రమే ఉంది.

### సంగీత నృత్యకళల ఆనవాళ్లు..

పౌరాణికంగా కూడా రామగిరి ప్రత్యేక స్థానాన్ని సంపా దించుకుంది. శ్రీరామ చంద్రుడు వనవాసం సమయంలో ఖిలా పై తపస్సు చేసి శివలింగాన్ని ప్రతిష్ఠించి నట్లు పురాణా లు చెతున్నాయి. సీత సమేత రాముడు, హనుమాన్ విగ్రహం, నంది, శ్రీరాముడి విగ్రహం వద్ద వెయ్యి మంది తలదాచుకునేలా విశాల ప్రదేశం ఉంది. రాజుల పాలనలో రామగిరి ఖిల్లా పరిసర ప్రాంతానికి రామగిరి పట్టణం అనే పేరు వచ్చిందని, చుట్టు పక్కల గ్రా మాలు వాడలుగా ఉండి ఆస్థానంలో సంగీత నృత్య కళాకారులు ఉండే ప్రాం తాన్ని భోగం వాడ అనేవారని, కాల క్రమేణా బోగంపేటగా మారింది. కాకతీ యుల కాలంలో నిర్మించిన కోట శిల్ప కళా సంపదతో శోభిల్లుతుంది. శిల్పసాం స్కృతిక సంపదకు తార్కాణంగా నిలు స్తూ నిర్మిం చిన రాతి కట్టడాలు ఇప్పటికి నైపుణ్యాన్ని తెలియజేస్తున్నాయి.

### చూడాల్సిన ప్రదేశాలు..

రామగిరి దుర్గంలో అంతర్భాగంలో సాలుకోట, సింహాల కోట, జంగకోట, ప్రతాపరుద్ర కోట, అశ్వశాలకోట, కొలు వశాల, మొఘల చరసాల, గజశాల, భజనశాల, సభాస్థలి వంటి వాటితోపాటు సీతమ్మ బావి, పసరు బావి, సీతమ్మ కొలను, రహస్యమార్గాలు, సొరంగాలు, ఫిరం టగులు తదితర ప్రదేశాలు పర్యా టకులను ఆకట్టుకు నేలా ఉంటాయి. వన వాస సమయంలో శ్రీ రాముడు రామ గిరిపై కొద్దిరోజులు కుటీరం ఏర్పరుచుకొని సీతాదేవి, లక్ష్మణులతో ఉన్నారని చరిత్ర చెబుతుంది. ఖిల్లా సీతా రామ లక్ష్మణులు సంచరించినట్లు చెబు తున్న ఆనవాళ్లు ఇప్పటికి చెక్కు చెదర కండా పర్యాటకులకు దర్శనమిస్తు న్నా యి. జిల్లాపై గల బండరాతిపై శ్రీరాముని పాదాలు సీతాదేవి స్నానమాచరించి న కొలనుతోపాటు శ్రీరాముడుతో సంచ రించిన ఆంజనేయస్వామి విగ్రహం కూడా నెలకొల్పబడి ఉంది. రామగిరి చరిత్రను వెలుగులోకి తెచ్చేం దుకు రచయితలు వ్యయ ప్రయాసల కోర్చి పుస్తక రూపం పుస్తక రూపంలో ప్రచురించారు. కాల్వశ్రీరాంపూర్ మండ లం మంగపేటకు చెందిన ఎర బాటి బాబురావు, కమానపూర్ మండలానికి చెందిన మాధవరావు, బలరాం దాసు లు, రామగిరి మహత్యం పేరుతో గ్రం దాన్ని రాశారు. అంతకుముందే చరిత్ర ను వెలికి తీసిన ఘనత బాల ప్రసాద్కు దక్కుతుంది. రామగిరి మండలంలోని రత్నాపూర్, బేగంపేట పరిధి లోని ఖిల్లా విశేషాలు ఇలా ఉన్నాయి..

### శ్రావణ మాసంలో సందడి..

వర్షాకాలంలో పచ్చదనం పరుచుకోవ దంతో ప్రతి శ్రావణమాసంలో రామగిరి ఖిల్లాపై పర్యాటకుల సందడితో ఆహ్లా దకర వాతావరణం నెలకొంటుంది. శ్రా వణ మాసం ముగిసే ఆగష్టు 26 వరకు ప్రతి శని, సోమవారాలలో ఇక్కడ ఉత్స వాలు జరుగుతాయి. కాకతీయుల కాలం నాటి శిల్పకళా వైభవానికి తార్కాణంగా నిలుస్తున్న ఈ దుర్గం, ఆధ్యాత్మిక కేం దంగానూ భాసిల్లుతోంది. రామగిరి దుర్గంపై ప్రకృతి అందచందాల ను తిల కిస్తూ పర్యాటకులు మైమరచిపోతారు. ఆయుర్వేద వైద్యులు ఖిల్లాపై విలువైన వన మూలికలు సేకరిస్తారు. గత చరిత్ర వైభవానికి సజీవ సాక్ష్యమైన రామగిరి ఖిల్లా ప్రభుత్వం, పురావస్తు శాఖనిర్లక్ష్యం మూలంగా కళావిహీనమవుతోంది. ప్రా చీన సంస్కృతికి కళావైభ వానికి అద్దం పట్టిన ఇక్కడి కట్టడాలు కాలగర్భంలో కలిసిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికై నా కళాసంపద కనుమరుగు కాకుండా రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

### మంత్రి చొరవతో చిగురించిన ఆశలు...

తెలంగాణ రాష్ట్రంలో ఏడాదిన్నర క్రితం ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు రామగిరి ఖిల్లాను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు చొరవ. తీసుకోవడంతో పర్యాటకుల్లో ఆశలు చిగురించాయి. రామగిరి ఖిల్లాను పర్యా టకకేంద్రంగా మార్చేందుకు రూ. 5 కోట్ల నిధులను గతంలో మంత్రి శ్రీధర్ బాబు మంజూరు చేయించారు. ఈ నిధుల తోనైనా రామగిరి ఖిల్లా అభివృద్ధికి అడు గువడతాయనిపర్యాటకులు, ఈ ప్రాంత ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# మహావతార్ నరసింహ అద్భుతం

## చిత్ర బృందాన్ని మెచ్చుకున్న ప్రభాస్





ప్రస్తుతం భారతీయ బాక్సాఫీస్ వద్ద పురాణగాథలకు మంచి డిమాండ్ ఉంది. తెలిసిన కథే అయినా ఆసక్తికరంగా తీర్చిదిద్ది అందిస్తే ప్రేక్షకులు ఆదరిస్తున్నారని ఇటీవల పలు సినిమాలు నిరూపించాయి. ఇప్పుడు ఇదే బాటలో పయనిస్తోంది 'మహావతార్ నరసింహ', ప్రముఖ నిర్మాణసంస్థ హోంబలే ఫిల్మ్స్ నుంచి వచ్చిన ఈ విజువల్ వండర్‌కు చిన్నా, పెద్దా అందరూ ఫిదా అవుతున్నారు. ముఖ్యంగా 3డీలో సరికొత్త అనుభూతిని పంచుతోంది. తాజాగా మూవీని చూసిన అగ్ర కథానాయకుడు ప్రభాస్ చిత్ర బృందాన్ని మెచ్చుకున్నారు. పవర్‌ఫుల్ విజన్‌తో 'మహావతార నరసింహ'ను వాస్తవంలోకి తీసుకొచ్చిన హోంబలే ఫిల్మ్స్‌కు శుభాకాంక్షలు. సినిమా నాకెంతో నచ్చింది. యానిమేషన్ రూపంలో తీర్చిదిద్దిన యాక్షన్ సన్నివేశాలు, కథాగమనం అద్భుతంగా ఉన్నాయి. ఈ అపురూప విజయం సాధించిన దర్శకుడు అశ్విన్‌కుమార్, చిత్ర బృందానికి అభినందనలని పేర్కొన్నారు. ప్రభాస్ పోస్ట్‌కు హోంబలే చిత్రబృందం స్పందించింది. సినిమాపై ఆయన అభిప్రాయంపై కృతజ్ఞతలు తెలిపింది.




# కింగ్డమ్ నుంచి రగిలే రగిలే లిరికల్ సాంగ్ విడుదల

## తమిళంలో వాయిస్ ఓవర్ ఇచ్చిన సూర్య

విజయ్ దేవరకొండ ప్రధానపాత్రలో రానున్న 'కింగ్డమ్' గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కింది. భాగ్య శ్రీ బోర్సే కథానాయికగా కనిపించనున్నారు. జులై 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీని ప్రచారంలో భాగంగా 'రగిలే రగిలే' అంటూ సాగే లిరికల్ సాంగ్‌ను విడుదల చేశారు 'మృత్యువు జడిసేలా.. శత్రువు బెదిరేలా..పద పద..' అనే పవర్‌ఫుల్ లిరిక్స్‌ను కృష్ణకాంత్ రాయగా.. సిద్ధార్థ్ బస్రూర్ ఆలపించారు. ఈసందర్భంగా చెన్నైలో ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌ను ఏర్పాటు-చేశారు. అందులో విజయ్ మాట్లాడుతూ హీరో సూర్యకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. టీ-జర్‌కు వాయిస్ ఓవర్ ఇస్తారా అని అడగ్గానే అంగీకరించారని తెలిపారు. కింగ్డమ్' కథ అనుకోగానే దీన్ని తమిళంలో కూడా కచ్చితంగా విడుదల చేయాలని భావించాం. ఈ సినిమా విడుదలకు ముందు ముఖ్యంగా ఇద్దరికి కృతజ్ఞతలు చెప్పాలి. వారిలో ఒకరు హీరో సూర్య. నాకు మొహమాటం ఎక్కువ. ఎవరిని సాయం అడగలేను. 'కింగ్డమ్' తమిళ టీజర్‌కు సూర్య వాయిస్ ఇస్తే బాగుంటుందని దర్శకుడు తెలిపారు. నేను ఈ మాట అడగ్గానే సూర్య ఓకే చెప్పారు. ఆయన పవర్‌ఫుల్ వాయిస్ టీజర్‌ను మరింత పవర్‌ఫుల్‌గా చేసింది. థాంక్యూ సూర్య అన్న అని అన్నారు. ఇక రెండో వ్యక్తి మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్.. అతడు ఈ సినిమాకు ప్రాణం పెట్టాడు. ఇప్పటికీ దీని పనుల్లోనే బిజీగా ఉన్నాడు. అతడిని కిడ్నాప్ చేసి నాతోపాటే ఉంచుకోవాలని ఉంది. ఈ సినిమా విషయంలో నేను చెప్పిన అప్‌డేట్స్ కంటే అనిరుధ్ చెప్పినవే వైరల్ అయ్యాయి. ఇటీ-వల జరిగిన ఈవెంట్‌లో కూడా ఈ చిత్రం మా అందరికీ మైల్‌స్టోన్ అవుతుందని అనిరుధ్ చెప్పాడు. ఆ మాటనే ఎంతోమంది షేర్ చేశారు. మరో రెండు రోజుల్లో 'కింగ్డమ్' మీ ముందుకురానుంది. మీ అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను అని తెలిపారు.





# వార్నర్‌కు బాహుబలి కిరీటం



డేవిడ్ వార్నర్.. క్రికెట్ అభిమానులకే కాదు.. సినీప్రియులకు ఎంతో ఇష్టమైన వ్యక్తి. తెలుగు సినిమా పాటలకు తనదైన ÷-టసైల్‌లో డ్యాన్స్ వేస్తూ అలరిస్తుంటారు. 'బాహుబలి' సినిమాపై ఆయన చేసిన వీడియోలు కూడా అప్పట్లో సోషల్ మీడియాలో తెగ వైరల్ అయ్యాయి. ఇప్పుడీ క్రికెటర్‌కు మన దర్శకధీరుడు రాజమౌళి 'బాహుబలి' కీరిటాన్ని పంపనున్నారు. ఇండియన్ సినిమాను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లింది 'బాహుబలి'. ఈ చిత్రం విడుదలై 10 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో దీన్ని మరోసారి ప్రపంచ ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఈ సందర్భంగా డేవిడ్ గతంలో తాను ధరించిన బాహుబలి కాస్ట్యూమ్ లుక్స్‌ను తాజాగా మరోసారి పంచుకున్నారు. 'కిరీటం ఉన్న ఫొటో బాగుందా? లేని పిక్ నచ్చిందా?' అని క్యాప్షన్ పెట్టారు. దీనికి రాజమౌళి రిప్లై ఇచ్చారు. హాయ్ డేవిడ్.. మీరిప్పుడు మాహిష్మతి సామ్రాజ్యానికి నిజమైన రాజులా తయారవ్వండి. నేను ఈ కిరీటాన్ని పంపుతున్నానని అన్నారు. దానికోసం ఎదురుచూస్తుంటానని క్రికెటర్ చెప్పారు. 'మీరు ఆస్ట్రేలియాలో ఈ సినిమాను మరోసారి చూడండి' అని టీమ్ మరో కామెంట్ పెట్టింది. దీనికి వార్నర్ ఓకే అంటూ థంబ్ పెట్టారు. రెండు భాగాలుగా అలరించిన ఈ బ్లాక్‌బస్టర్ ఇప్పుడు ఒకే పార్ట్‌గా రానుంది. 'బాహుబలి: ది ఎపిక్ పేరుతో ప్రపంచవ్యాప్తంగా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకురానుంది. తెలుగు, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో ఇది విడుదల కానున్న విషయం తెలిసిందే.


# చందమామల కథ స్ఫూర్తితో విశ్వంభర




చిరంజీవి కథానాయకుడిగా వశిష్ఠ దర్శకత్వంలో రానున్న సోషియో ఫాంటసీ ఫిల్మ్ 'విశ్వంభర'కి సంబంధించిన ఆసక్తికర విషయాల కోసం చిరు అభిమానులతో పాటు- సినీప్రియులంతా ఎదురుచూస్తున్నారు. తాజాగా చిత్ర దర్శకుడు ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ కొన్ని సంగతులు పంచుకున్నారు. దీని టీజర్ విడుదలయ్యాక 'అవతార్'కు కాపీ అంటూ వచ్చిన ట్రోల్స్‌పై మాట్లాడారు. టీజర్ నాకు నచ్చింది కాబట్టి నేను రిలీజ్ చేశాను. అందులో కనిపించిన పాప కాస్ట్యూమ్‌ను చూసి అందరూ నేను అవతార్ సినిమా కాపీ చేసి దాన్ని రూపొందించానని అన్నారు. టీజర్‌లో కనిపించిన కొండలు,ఆ పాప చెవులు చూసి అలా భావించారు. కానీ, కొండలను 'అవతార్' కంటే ముందు ఎన్నో సినిమాల్లో చూపించారు. ఇక చెవులు కూడా పెద్దగా ఉండడం గతంలో చాలా సినిమాల్లోని పాత్రల్లో చూపారు. నేను చందమామ కథలు చూసి స్ఫూర్తి పొంది అలా కాస్ట్యూమ్ డిజైన్ చేయించాను. అవతార్ చూసి కాపీ కొట్టాననే బదులు ఈ కథలను చూసి కాపీ కొట్టాను అంటే చాలా ఆనందించేవాడిని. చందమామ కథల్లో జ్వాలాదీపం అనే సిరీస్ ఉంటుంది. అందులో ఉన్నవే అవతార్‌లో చూపించారని అన్నారు. ఇందులో ఐదుగురు హీరోయిన్స్ ఉన్నారంటూ వార్తలు వస్తున్నాయి. మెయిన్ హీరోయిన్ త్రిష, సెకండ్ లీడ్ ఆషిక వాళ్లిద్దరు మాత్రమే ఉన్నారు. విడిగా నటీమణులు కొన్ని పాత్రల్లో కనిపిస్తారు. స్క్రీన్‌పై వీళ్లందరూ చాలా ఫ్రెష్‌గా ఉంటారు. వీఎఫ్‌ఎక్స్ వర్క్ కారణంగానే దీని విడుదల ఆలస్యమవుతుంది. ఇక ఇప్పటికే చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ సినిమా విడుదల తేదీని త్వరలోనే ప్రకటించనున్నారు.

# ఉస్తాద్ భగత్ సింగ్ క్లైమాక్స్ పార్ట్ పూర్తి

పవన్ కల్యాణ్ అభిమానులు ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'ఉస్తాద్ భగత్‌సింగ్' ఒకటి. పవన్ కల్యాణ్ – హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న ఈ సినిమా షూటింగ్ అప్‌డేట్‌ను నిర్మాణసంస్థ తాజాగా షేర్ చేసింది. దీని – క్లైమాక్స్ పూర్తయినట్లు- తెలిపింది. పవన్ కల్యాణ్ ఎంతో అంకితభావంతో దీని షూటింగ్‌లో పాల్గొన్నారంటూ ఆయనకు కృతజ్ఞతలు చెప్పింది. ఎన్నో భావోద్వేగాలతో కూడిన ఉస్తాద్ భగత్‌సింగ్ క్లైమాక్స్ పూర్తయింది. నబకాంత మాస్టర్ పర్యవేక్షణలో యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ జరిగింది. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ- సీఎంగా బాధ్యతలను నిర్వర్తిస్తూనే.. మరోవైపు 'హరి హర వీరమల్లు' ప్రచారంలో పవన్ కల్యాణ్ భాగమయ్యారు. అదే మెరుపు వేగంతో 'ఉస్తాద్ భగత్‌సింగ్' షూటింగ్‌లో కూడా పాల్గొన్నారు. ఇది ఆయన అంకితభావానికి, కష్టపడి పనిచేసే స్వభావానికి నిదర్శనమని నిర్మాణ సంస్థ తెలిపింది ఈ విషయాన్ని తెలుపుతూ సెట్‌లో పవన్, హరీశ్ శంకర్‌ల ఫొటోను పంచుకుంది. గబ్బర్ సింగ్' తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో రానున్న చిత్రం కావడంతో దీనిపై సినీప్రియులు ఎన్నో అంచనాలు పెట్టుకున్నారు. ఇందులో పవన్ కల్యాణ్ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, స్పెషల్ వీడియోలు సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేశాయి. ఇక పవన్ సరసన శ్రీలీల, రాశీ ఖన్నా నటిస్తున్నారు. త్వరలోనే దీని విడుదల తేదీని ప్రకటించనున్నారు.



# సతీలీలావతిగా లావణ్య త్రిపాఠి

లావణ్య త్రిపాఠి, దేవ్ మోహన్ ప్రధానపాత్రల్లో రానున్న చిత్రం 'సతీ లీలావతి' తాతినేని సత్య ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. తాజాగా దీని టీ-జర్‌ను టీ-మ్ విడుదల చేసింది. సోషల్ మీడియాలో వచ్చే కౌంటర్స్, సరదాగా సాగే పంచ్‌లతో ఈ వీడియో నవ్వులు పూయిస్తోంది. మిక్కీ జే మేయర్ ఈ చిత్రానికి సంగీతం అందించారు. త్వరలోనే దీని విడుదల తేదీని ప్రకటించనున్నారు.




# విజయవాడ వేదికగా 10న వార్-2 ప్రీరిలీజ్ వేడుక




యంగ్ టైగర్ ఎన్టీఆర్ భారీ ముల్టీస్టారర్ వార్ 2. బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ తో కలిసి నటిస్తున్నాడు. ఇప్పటికే రిలీజ్ అయిన పోస్టర్స్, గ్లిమ్స్ సినిమాపై అంచనాలు భారీగా పెంచేశాయి. కియారా అద్వానీ హీరోయిన్ గా నటిస్తోంది.

బాలీవుడ్ బడా నిర్మాణ సంస్థ యష్ రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తుండగా అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ భారీ బడ్జెట్ చిత్రం ఏడాది ఆగస్టు 14 న ఈ సినిమా వరల్డ్ వైడ్ రిలీజ్ కానుంది. రిలీజ్ కు గట్టిగా రెండు వారాలు ఉంది. ఇద్దరు బడా స్టార్స్ ఉన్న సినిమాకు ప్రస్తుతం ఉన్నబజ్ సరిపోదు. అందుకే తెలుగు హక్కులు దక్కించుకున్న నిర్మాత కమ్ డిస్ట్రిబ్యూటర్ వార్ 2 కోసం భారీ ఎ÷-లానింగ్ రెడీ చేస్తున్నాడు. అందులో భాగంగా ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ కు రంగం సిద్ధం చేస్తున్నాడు. కానీ ఈ ప్రీ రిలీజ్ ఈవెంట్ తో సెన్సేషన్ క్రియేట్ చేయాలనీ నాగవంశీ వ్యూహ రచన చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో విజయవాడ లో ఆగస్టు 10న వార్ 2 ప్రీ రిలీజ్ ఈవెంట్ ను నిర్వహించనున్నారు. నిన్న, మొన్నటి వరకు కేవలం ఊహాగానాలు వినిపించగా ఇప్పుడు అక్కడే ఫిక్స్ చేసినట్టు- తెలుస్తోంది. ఈ వేడుకకు యంగ్ టైగర్ ఎన్టీఆర్ తో పాటు- బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ కూడా హాజరుబోతున్నారట. అదే జరిగితే వార్ 2 ఈవెంట్ హిస్టారీ క్రియేట్ చేయడం ఖాయం.

# నిండుకుండలా నాగార్జున సాగర్

**- 14 గేట్లు ఎత్తి నీటిని విడదల చేసిన మంత్రులు**

**- 18 ఏళ్ల తరవాత జూలైలో ఈ మోతాదులో నీటి చేరిక**

**నాగార్జునసాగర్,జూలై29( వెలుతురు):**

ఎగువ నుంచి వస్తున్న భారీ వరద ప్రవాహంతో నాగార్జునసాగర్ జలాశయం నిండుకుండలా మారింది. దీంతో ప్రాజెక్టు క్రస్ట్ గేట్లు- ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థం 590.00అడుగులకుగాను ప్రస్తుతం 586.60 అడుగులకు చేరింది. ప్రాజెక్టు గేట్లు- ఎత్తిన నేపథ్యంలో.. దిగువ భాగంలో లోతట్టు- ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. 18 ఏళ్ల తర్వాత.. నెల ముందుగానే నాగార్జున సాగర్ నుంచి నీటిని విడుదల చేయడం ఇదే తొలిసారి. వరద ప్రవాహం పెరగడంతో మంగళవారం నాగార్జున సాగర్ గేట్లను ఎత్తారు. మంత్రులచేతుల మీదుగా ఉదయం 11 గంటలకు గేట్లను తెరిచారు. మొత్తం 14 గేట్లను 5 అడుగుల మేర ఓపెన్ చేశారు. అయితే సాగర్ గేట్లను ఎత్తడానికి ముందు బేగంపేట ఎయిర్‌పోర్టులో మంత్రుల గొడవపడ్డారు. షెడ్యూల్ ప్రకారం నల్లగొండ జిల్లా మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ చేతుల మీదుగా మంగళవారం ఉదయం 10 గంటలకు నాగార్జున సాగర్ గేట్లను తెరువాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఉదయం 9 గంటలకు అందరూ బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుని, అక్కడి నుంచి హెలికాప్టర్‌లో నాగార్జునసాగర్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అనుకున్న ప్రకారం మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ ఉదయం 9 గంటలకే బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. కానీ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గంట ఆలస్యంగా 10 గంటలకు వచ్చారు. ఈ విషయంలో కోమటిరెడ్డికి, ఉత్తమ్‌కు మధ్య వాగ్వాదం జరిగింది. ఆ తర్వాత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తాను నాగార్జునసాగర్‌కు రానని అలిగి బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి వెళ్లిపోయారు. దాంతో మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ మాత్రమే హెలికాప్టర్‌లో నాగార్జునసాగర్‌కు వెళ్లారు. పూజా కార్యక్రమం నిర్వహించి సాగర్ 14 గేట్లను ఎత్తారు. దాంతో కృష్ణమ్మ దిగువకు పరవళ్లు తొక్కుతూ పరుగులు తీస్తోంది. కాగా నాగార్జునసాగర్ జూలై నెలలో ఈ స్థాయిలో నిండటం గడిచిన 18 ఏళ్లలో ఇదే తొలిసారని అధికారులు తెలిపారు.

# భూ వివాదం కేసులో రేవంత్ రెడ్డికి ఊరట

**- పెద్దిరాజు తదితరులు వేసిన పిటిషన్ తిరస్కరణ**

**- ఫిర్యాదుదారుకు కోర్టు ధిక్కరణ కింద నోటీసులు**

**న్యూఢిల్లీ,జూలై29( వెలుతురు):**

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. భూవివాదం కేసులో ఎన్ పెద్దిరాజు వేసిన కేసులో.. రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా ఎటువంటి ఆధారాలు లేవంటూ పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు క్వాష్ చేసింది.అయితే హైకోర్టు ఆదేశాలపై ఎన్ పెద్దిరాజు సుప్రీంకోర్టులో సవాలు వేశారు. ఈ కేసును వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలంటూ సుప్రీంను ఆశ్రయించారు. ఆ పిటిషన్‌లో హైకోర్టు తీర్పునకు సంబంధించ అంశాలతో పాటూ జడ్జి పైన అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినట్లు- సమాచారం. ఎన్ పెద్దిరాజు వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ధర్మాసనం డిస్మిస్ చేసింది. అలాగే ఎన్ పెద్దిరాజుతో పాటు-, ఆయన అడ్వకేట్ రితేష్ పాటిల్‌కు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. పిటిషనర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సీజేఐ బీఆర్ గవాయి తదుపరి విచారణకు పిటిషనర్ అండ్ పెద్దిరాజు వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాలని ఆదేశించారు. భూ వివాదం వ్యవహారంలో సొసైటీ- స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించారని 2016లో రేవంత్‌రెడ్డి, ఆయన సోదరుడు కొండల్ రెడ్డి, లక్ష్మయ్య పై పెద్దిరాజు ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పీఎస్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. తనపై కేసును కొట్టివేయాలని సీఎం రేవంత్‌రెడ్డి 2020లో దాఖలు చేసిన




పిటిషన్‌పై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం.. ఫిర్యాదు దారు ఆరోపణల్లో సరైన సాక్ష్యాధారాలు లేవని పేర్కొంది. రేవంత్‌పై నమోదైన కేసును కొట్టివేసింది. తెలంగాణ హైకోర్టు తీర్పు అనంతరం.. కేసు విచారణను మరో రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరుతూ పెద్దిరాజు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌ను మంగళవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిష్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం డిస్మిస్ చేసింది.పిటిషన్‌లో.. ఉత్తర్వులు ఇచ్చిన హైకోర్టు న్యాయమూర్తిపై అభ్యంతరకర వ్యాఖ్యలు ఉన్నాయని సీజేఐ జస్టిస్ గవాయ్ తెలిపారు. ఒక న్యాయవాదిగా న్యాయమూర్తిపై వ్యాఖ్యలు చేస్తూ .. పిటిషన్ ఎలా దాఖలు చేస్తారని సీజేఐ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్.పెద్దిరాజుతో పాటు- ఆయన తరఫు న్యాయవాది రితేష్ పాటిల్‌కు ధర్మాసనం కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణకు పిటిషనర్ పెద్దిరాజు వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశాలిచ్చింది. కోర్టు సాక్షిగా పిటిషనర్ తరఫు న్యాయవాది రితీష్ పాటిల్ క్షమాపణ కోరారు. అందుకు నిరాకరించిన సీజేఐ.. పిటిషన్ రాసేటప్పుడు, దాఖలు చేసేటప్పుడు గుడ్డిగా ఎలా వేశారని ప్రశ్నించారు. పిటిషన్ ఉపసంహరించుకునేందుకు అనుమతివ్వాలని న్యాయవాది రితీష్ పాటిల్ కోరగా.. అందుకు సీజేఐ నిరాకరించారు. పిటిషన్ దాఖలు చేసే ముందు న్యాయవాదిగా అన్ని విషయాలు చూసుకోవాల్సిన బాధ్యత ఉంటుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కోర్టు ధిక్కరణ కింద ఎందుకు చర్యలు తీసుకోవద్దంటూ జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రశ్నించారు. కోర్టు ధిక్కరణ నోటీసుపై లిఖిత పూర్వకంగా సమాధానం ఆదేశించారు. సమాధానం ఆమోదయోగ్యంగా ఉంటేనే కోర్టు పరిగణనలోకి తీసుకుంటుందని స్పష్టం చేస్తూ... విచారణ ఆగస్టు 11కు వాయిదా వేశారు.

(మొదటి పేజీ తరువాయి..)

# ఎపిలో ఇక రేషన్ మరింత స్మార్ట్

**అమరావతి, జూలై29( వెలుతురు):**

రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 25 నుంచి 31 వరకు స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేయనున్నట్లు- ఏపీ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. అక్రమాలకు ఆస్కారం లేకుండా క్యూఆర్ కోడ్‌తో ఈ కార్డులను రూపొందించినట్లు- తెలిపారు. మంగళవారం మీడియాతో మంత్రి మాట్లాడారు. కొత్తగా 9లక్షల మందికిపైగా రేషన్‌కార్డులు మంజూరు చేస్తున్నాం. రాష్ట్రంలోని 29,796 రేషన్ షాపుల్లో ప్రతినెలా 1 నుంచి 15 వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 వరకు రేషన్ సరఫరా చేస్తున్నాం. ఐదేళ్లలోపు, 80 ఏళ్లు దాటిన వారికి ఈకేవైసీ అక్కర్లేదని మంత్రి నాదెండ్ల తెలిపారు. జాతీయ ఆహార భద్రతా చట్టం ప్రకారం కేంద్రప్రభుత్వ సాయంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రేషన్ కార్డులని పంపిణీ చేస్తోందని మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం 60శాతం, ఏపీ ప్రభుత్వం 40శాతం కార్డులను భరిస్తున్నాయని వెల్లడించారు. 4.72 శాతం రేషన్ కార్డు దరఖాస్తులు తిరస్కరించామని చెప్పుకొచ్చారు. ఏపీ వ్యాప్తంగా రేషన్ కార్డుల సంఖ్య కోటి 40 లక్షల 96వేల 86 మందికి కార్డులు ఉన్నాయని వివరించారు. పాత విధానాన్ని మార్చి స్మార్ట్ రేషన్ కార్డులు ఇచ్చేందుకు డిజిటలైజ్ చేశామని వెల్లడించారు. ఈ కార్డులపై ఎక్కడ కూడా నాయకుల ఫొటోలు ఉండకూడదని డిజైన్ చేశామని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫొటోలు మాత్రమే రేషన్ కార్డులో ఉంటాయని.. వీటిని డెబిట్, క్రెడిట్ కార్డు సైజుల్లో ఇవ్వబోతున్నామని ప్రకటించారు. కుటుంబ సభ్యుల వివరాలు, కార్డునెంబర్ బాగా కనిపించేలా రూపొందించామని వెల్లడించారు. క్యూఆర్ కోడ్ ద్వారా ట్రాన్సెక్షన్ జరిగిన వెంటనే సెంట్రల్ ఆఫీసులో తెలుస్తోందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఈ కార్డులు అన్ని ఉచితంగా అందిస్తామని ప్రకటించారు. ఆగష్టు 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ ఈ కార్డులు అందిస్తామని ప్రకటించారు. జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు ఇస్తారని, రాష్ట్రస్థాయిలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ ఈ కార్డులు పంపిణీ చేస్తారని వెల్లడించారు. 94శాతం మందికి ఈ కేవైసీ చేశామని తెలిపారు. 65 సంవత్సరాల దాటిన వృద్ధులకు ప్రతి నెల 26వ తేదీ నుంచి 30వ తేదీ మధ్య సరుకులు హోం డెలివరీ చేస్తామని వెల్లడించారు. ఒక్క అల్లూరి సీతారామరాజు జిల్లాలో మినహా అన్నిచోట్ల పంపిణీ బాగానే జరుగుతోందని చెప్పుకొచ్చారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్న ఇబ్బందులను స్వయంగా తామే వెళ్లి పరిష్కరిస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. దీపం పథకంలో ఎలాంటి లోపం లేకుండా మూడు ఆయిల్ కంపెనీలతో ప్రతి వారం సమీక్షలు చేస్తున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ వ్యాఖ్యానించారు. రెండో విడతలో దీపం పథకంలో ఈరోజు వరకూ 93లక్షల 86వేల మందికి దీపం పథకం డెలివరీలు పంపిణీ చేశామని తెలిపారు. దీపం-2 పథకాన్ని లబ్ధిదారులు ఈ నెల 31వ తేదీ లోపు వినియోగించుకోవాలని సూచించారు. ఇకపై డైరెక్ట్‌గా వినియోగదారుల ఖాతాలో డబ్బులు జమ చేయడానికి 4281 మంది లబ్ధిదారులకు పంజాబ్ నేషనల్ బ్యాంకు ద్వారా డిజిటల్ వ్యాలెట్ ఇస్తామని స్పష్టం చేశారు. ఇప్పటి వరకూ దీపం పథకాన్ని 30శాతం మంది ఉపయోగించుకున్నారని గుర్తుచేశారు. 2580 మంది లబ్ధిదారులు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారని మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. దీపం



పథకంలో 86వేల మంది లబ్ధిదారుల అకౌంట్లు- సక్రమంగా లేకపోవడంతో వారికి డబ్బులు పడలేదని.. వారి వివరాలు తీసుకుంటామని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఇప్పటి వరకూ 4516 ట్రాన్సెక్షన్‌లు మాత్రమే ఫెయిల్ అయ్యాయని తెలిపారు. వేర్వేరు బ్యాంకు అకౌంట్లు-, ఫోన్ నెంబర్‌లు వేరే ఉండటంతో డబ్బులు పడలేదని చెప్పుకొచ్చారు. సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ కింద గ్యాస్ ఏజెన్సీకి మాత్రమే ఆ కూపన్ చెల్లుతుందని... దీంతో వ్యాలెట్‌లోని పైసలు వేరే అవసరాలకు వాడటానికి వీలుండదని స్పష్టం చేశారు. 86 వేల మంది లబ్ధిదారులని గుర్తించడం చాలా కష్టం అయిందని... అయితే అర్హత ఉన్నవారికి నూటికి నూరుశాతం అందజేస్తామని హామీ ఇచ్చారు. చివరి నిమిషంలో గ్యాస్ బుకింగ్ చేసుకోవడం వల్ల కూడా డబ్బులు పడే అవకాశం లేదని... కాబట్టి ముందే బుక్ చేసుకోవాలని సూచించారు. ఏపీలో అన్ని సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డు ఓ అర్హతగా ఉందని తెలిపారు. ప్రస్తుతం డెత్ కేసుల వరకే ఇప్పుడు తొలగిస్తున్నామని.. ఇప్పటి వరకూ ఏపీలో 3 లక్షల 56 మంది వరకూ డెత్ కేసులుగా గుర్తించి వాటిని తొలగించామని వివరించారు. వలంటరీగా కార్డులు సరెండర్ చేయమని అడగటంతో 12 నుంచి 13 వందల మంది ముందుకు వచ్చారని పేర్కొన్నారు. అసెంబ్లీ పిటిషన్‌ల కమిటీ- ఇచ్చిన సిఫార్సులని కమిషనర్ తన దృష్టికి తీసుకువచ్చారని... ఈ విషయంపైనా ఆలోచిస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పుకొచ్చారు. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కాబట్టే హరిహర వీరమల్లు సినిమాను తాము ప్రమోట్ చేస్తామని.. అది తమ బాధ్యత అని మంత్రి నాదెండ్ల మనోహర్ వ్యాఖ్యానించారు. తమ సినిమాలను తాము ప్రమోట్ చేయకుండా.. వారి సినిమాలను ప్రమోట్ చేస్తామా అని ప్రశ్నించారు. సినిమాకు ప్రమోషన్ చేస్తే తప్పేంటని నిలదీశారు. తమ సినిమాని తాము ప్రమోషన్ చేసుకుంటామని స్పష్టం చేశారు. సినిమా ప్రమోషన్‌కి మంత్రుల స్థాయి అనేది అనవసరమని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.




Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com